మంగళవారం
6•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 240
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

14 నుంచి మైనింగ్ టుడే సదస్సు

గవర్నర్‌కు మంత్రి కేటీఆర్ ఆహ్వానం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మైనింగ్ టుడే సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభించాలని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ఆహ్వానించారు. సోమవారం ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో మైనింగ్ టుడే సదస్సు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు

మిగతా 15వ పేజీలో



సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యా!

మినీ కుంభమేళాలా మేడారం జాతర
తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది 2
సమ్మక్క, సారక్క జాతరపై ఉపరాష్ట్రపతి వెంకయ్య ప్రశంసలు

42 లక్షల గొర్రెల పంపిణీ

15.50 లక్షల గొర్రెపిల్లల పునరుత్పత్తి.. రూ.700 కోట్ల విలువైన సంపద వృద్ధి

ప్రగతి నివేదికను విడుదలచేసిన గొర్రె - మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న అతిపెద్ద జీవనోపాధి పథకమైన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల జీవాలను పంపిణీచేశారు. ఇప్పటివరకు పంపిణీచేసిన గొర్రెల నుంచి 15.50 లక్షల గొర్రె పిల్లల పునరుత్పత్తి జరిగి రూ.700 కోట్ల విలువైన సంపద లభించింది. గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధితోపాటు మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించడం.. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతులు చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రారంభించిన ఈ పథకంపై ప్రగతి నివేదికను తెలంగాణ రాష్ట్ర గొర్రెల - మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి సోమవారం విడుదలచేశారు. ఈ పథకం కింద ఇప్పటివరకు గొల్ల, కురుమలకు 2,00,235 గొర్రెల యూనిట్లను పంపిణీ చేసినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు రూ.2,502 కోట్లు ఖర్చుచేయగా, ఇందులో ప్రభుత్వం వాటాగా రూ.1,877 కోట్లు, లబ్ధిదారులు తమ వాటాగా రూ.625 కోట్లు చెల్లించినట్టు లక్ష్మారెడ్డి చెప్పారు. గొర్రెల ఆరోగ్య పరిరక్షణ కోసం యూనిట్‌కు రూ.425 చొప్పున రూ.6 కోట్లు విడుదల చేశామని, మెడికల్ కిట్స్‌తో గొర్రెల ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 100 సంచార పశువైద్య అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. పశుగ్రాసం కొరత రాకుండా స్టైలో పశుగ్రాసం పెంపకాన్ని విరివిగా ప్రోత్సహించినట్టు, అటవీ భూముల్లో గొర్రెలను మేపుకొనేందుకు సడలింపు ఇచ్చినట్టు తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా గొర్రెలకు షెడ్లు, నీటితొట్ల నిర్మాణాలకు ముమ్మర చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఈ పథకం పురోగతిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తూ, సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రోత్సాహం.. పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లడంలో

మిగతా 13వ పేజీలో


ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలు (ఫైల్)


జీవం జీవికనిచ్చింది..



- పద్మాక్షి, వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి అనుసంధానం
- రోడ్లకిరువైపులా తీగల నిర్వహణకు భూగర్భ డక్టులు
- శాంతిభద్రతల నిర్వహణకు కమాండ్ కంట్రోల్ సెంటర్
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పురపాలకశాఖ ప్రణాళికలు
- సుందర నగరంగా రూపుదాల్చనున్న చారిత్రాత్మక ఓరుగల్లు

వరంగల్‌కు కొత్తందాలు!

2,740 కోట్లతో 23 రకాల అభివృద్ధి పనులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధంచేసింది. దాదాపు రూ.2,740 కోట్లతో 23 రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నది. వీటిలో ఇప్పటికే కొన్ని మొదలుకాగా, మరికొన్ని అతి త్వరలో ప్రారంభంకానున్నాయి. సింహభాగం పనులను ఈ ఏడాదిలోనే పూర్తిచేయాలని సంకల్పించింది. రాష్ట్రంలోని ప్రజలు సకల సౌకర్యాలతో ఆహ్లాదకర వాతావరణంలో నివసించాలని టీఆర్‌ఎస్ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ ఉద్దేశంతోనే అన్ని నగరాలు, పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నది. ఈ క్రమంలోనే వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశాలతో వరంగల్ ముఖచిత్రాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేలా రూ.2,740 కోట్లు వ్యయంతో ప్రణాళికలు సిద్ధంచేశారు. కేంద్రం ప్రకటించిన స్మార్ట్ సిటీ, అమృత్, హృదయ్, ఎస్‌బీఎం (స్వచ్ఛ భారత్ మిషన్), ఐపీడీఎస్, పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) వంటి పథకాల కింద గ్రేటర్ వరంగల్‌లో 23 రకాల కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఇవి అమలైతే వచ్చే రెండేండ్లలో వరంగల్ రూపురేఖలు మారిపోనున్నాయి. రాష్ట్రంలో వరంగల్ మరో సుందరమైన నగరంగా

మిగతా 13వ పేజీలో

ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి?

సంస్మరణ పేరుతో కాంగ్రెస్ సంస్కార రహిత సభ
విలేకరుల సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి 15

'టీఆర్‌ఎస్ కార్యకర్తల మొండాలు మోరీల్లో తేల్తయ్. ఎమ్మెల్యేలను, మంత్రులను బట్టలూడదీసి కొడ్తం. ఎమ్మెల్యేలను ఎన్‌కౌంటర్ చెయ్యాలె' ఇవీ నల్లగొండలో నిర్వహించిన బొడ్డుపల్లి శ్రీనివాస్ సంస్మరణ సభలో కాంగ్రెస్ నాయకులు ప్రజలకిచ్చిన సందేశాలు. ఇది సంస్మరణ సభా? సంస్కారహీనుల సభా? సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, జానారెడ్డి సమాధానం చెప్పాలె' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండలో బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య విషయంలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చంపడాలు, చంపించడాలు, ఒకరికి వ్యతిరేకంగా ఒకరు కుట్రలు, కుతంత్రాలు చేయడాలు ఇవన్నీ కాంగ్రెస్ సంస్కృతి అని అన్నారు.


నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కే ప్రభాకర్ రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ఐదు సబ్‌జైళ్ల మూసివేత



జైళ్లశాఖ నిర్ణయం
సత్ఫలితాలిస్తున్న సంస్కరణలు.. తగ్గిపోతున్న నేరస్థుల సంఖ్య
జైళ్లల్లో 6848 మంది ఖైదీలు ఉండే సామర్థ్యం 12
ఉన్నది 5348 మంది ఖైదీలు మాత్రమే

భార్య, ఇద్దరు పిల్లల దారుణహత్య

హైదరాబాద్‌లోని మీర్‌పేటలో ఉన్మాది ఘాతుకం
పనిచేసుకోమన్నందుకు కుటుంబంపై పైశాచికత్వం 2
కాలనీవాసులకు విషయం చెప్పి.. ఠాణాకు వెళ్లి లొంగుబాటు

సిద్దిపేటలో అత్యాధునిక మోడల్ రైతు బజారు ప్రారంభం

2

సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు
పాస్‌పుస్తకాల ముద్రణ బాధ్యత

- ఒక్కో పుస్తకం ముద్రణ ఖర్చు రూ.200
- నేడు ఉత్తర్వులు జారీచేసే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లతో రూపొందుతున్న పట్టాదార్ పాస్‌పుస్తకాల ముద్రణ బాధ్యతలను నామినేషన్ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించనున్నది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో పాస్‌పుస్తకం ముద్రణకు రూ.200 వరకు ఖర్చవుతుంది. మొదట పాస్‌పుస్తకాల ముద్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌టీఎస్ ద్వారా టెండర్లు పిలిచింది. దీనిలో 15 మంది బిడ్డర్లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేయడంతో ఇన్నిరకాల ప్రమాణాలు పాటించడం కష్టమని బిడ్డర్లు వెనుకంజ వేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ద్వారానే పట్టాదార్ పాస్‌పుస్తకాలు ముద్రించి రైతులకు ఇవ్వాలని నిర్ణయించిట్టు తెలిసింది. కాగా సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ రోజుకు ఏడువేల పాస్‌పుస్తకాలను మాత్రమే ముద్రించగలదని సమాచారం. ఇదే విషయాన్ని ప్రెస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో మార్చి 11వ తేదీ నాటికి కేవలం 2.50 లక్షల నుంచి 3 లక్షల పాస్‌పుస్తకాలు మాత్రమే అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తిచేసుకొని పాస్‌పుస్తకాల కోసం ఎదురుచూస్తున్న దాదాపు రెండు లక్షల మంది రైతులకు ముందుగా ఇచ్చి, తర్వాత మిగతా రైతులకు అందజేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్‌కు తెలియజేసి.. తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రహరీలకు మరమ్మతులను చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణపై సోమవారం విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ జిల్లా విద్యాధికారులతో సమీక్షించారు. ఎస్సెస్సీ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయాకేంద్రాల్లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని.. నీటిని అందుబాటులో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దాదాపు 5.60 లక్షల మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలు రాయనున్నారు. అందుకోసం 2,550 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 21 కేంద్రాలు సమస్యాత్మకంగా ఉండటంతో ఆ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నారు.

సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యా!

- మినీ కుంభమేళాలా మేడారం జాతర
- 8 రాష్ట్రాల నుంచి ఆదివాసీల హాజరు
- తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది
- సమ్మక్క, సారలమ్మ జాతరపై ఉపరాష్ట్రపతి ప్రశంసలు
- రాజ్యసభలో ప్రస్తావించిన వెంకయ్య



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో నాలుగురోజులపాటు నిర్వహించిన మేడారం సమ్మక్క సారక్క జాతర తనను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసిందని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు అన్నారు. గిరిజనుల పండుగైన మేడారం జాతర మినీ కుంభమేళాలా సాగిందని చెప్పారు. సోమవారం రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, జాతర అనుభవాలను సభ్యులతో పంచుకున్నారు. 'గత శుక్రవారం సభకు హాజరుకాలేకపోయాను. తెలంగాణలో నిర్వహించిన ఆదివాసీల దేవతలైన సమ్మక్క, సారక్క జాతరకు వెళ్లాను. నిజంగా సంభ్రమాశ్చర్యాలకు (థ్రిల్) గురయ్యాను' అనిచెప్పారు. మేడారం జాతరకు వచ్చిన తొలి ఉపరాష్ట్రపతిగా నిలిచిన వెంకయ్యానాయుడు.. జాతరలో అమ్మవార్లకు తన నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయాలను సోమవారం సభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆదివాసీలు భారీగా హాజరైన మేడారం జాతరను చూడటంతోనే మనసు పులకించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ గణాంకాల ప్రకారం సుమారు 1.5 కోట్ల మంది హాజరైన మేడారం జాతర మినీ కుంభమేళా అని ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. ఇంతటి జాతరకోసం తెలంగాణ ప్రభుత్వం భారీస్థాయిలో ఏర్పాట్లు చేసిందని కితాబిచ్చారు. భారీ సంఖ్యలో వచ్చిన ఆదివాసీలు, ఇతరులు భక్తిప్రపత్తులతో, సంప్రదాయబద్ధంగా అత్యంత క్రమశిక్షణతో పూజలుచేయడం ఆకట్టుకున్నదని వివరించారు. ఉపరాష్ట్రపతి మేడారం జాతర గురించి వివరించినపుడు సభ్యులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.





సిద్దిపేటలో మోడల్ రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీలు పీ సుధాకర్‌రెడ్డి, ఫారూఖ్ హుస్సేన్, బీ వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు దేవీప్రసాద్, దామోదర్, కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తదితరులు కూడా ఉన్నారు. (పక్కన) మోడల్‌రైతు బజార్‌లో ఏర్పాటుచేసిన కూరగాయల స్టాళ్లు.

సీఎం ఆశీస్సులతో సిద్దిపేట అభివృద్ధి

దేశంలో ఎక్కడాలేని విధంగా మోడల్ రైతుబజారు

భారీనీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేటను అన్నిరంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో రూ.8.16 కోట్లతో నిర్మించిన అత్యాధునిక మోడల్ రైతుబజారును మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ బోడెకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు దేవీప్రసాద్, దామోదర్, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయిలతో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. మంత్రి హరీశ్‌రావు కూరగాయలు కొనుగోలు చేయడంతోపాటు ఎంపీ, ఎమ్మెల్సీలతోనూ కొనుగోలు చేయించారు. అంతకుముందు పొన్నాల వద్ద పోలీసు కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఆయా సభల్లో మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ ముందుచూపుతో 1999లోనే ఇక్కడ రైతుబజార్‌ను ఏర్పాటుచేశారని, ఇప్పుడు అదేస్థలంలో దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక హంగులతో మోడల్ రైతుబజార్‌ను నిర్మించుకున్నట్టు తెలిపారు. సెల్లార్, జీప్లస్-1 పద్ధతిలో నిర్మించిన ఈ రైతుబజార్ ప్రతి ఫ్లోర్‌లో టాయిలెట్స్, ఎల్‌ఈడీ లైటింగ్, లిఫ్టు, వృద్ధులు, వికలాంగుల కోసం ర్యాంపు, కూరగాయల ధరలు తెలిపే ఎల్‌ఈడీ తెరలు, 332 స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతుబజార్‌కు వచ్చే రైతులకు ఆన్‌లైన్ ద్వారా టోకెన్ విధానాన్ని అమలుచేస్తున్నామని, ఏ రైతుకు ఏ నంబరు టోకెన్ వస్తే ఆ స్టాల్ వద్దకు వెళ్లి కూరగాయలు అమ్ముకోవాలని సూచించారు. వినియోగదారులు, రైతుల కోసం ఆంధ్రాబ్యాంకు సహకారంతో ఏటీఎం సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైతులు అమ్మగా మిగిలిన కూరగాయలు భద్రపరుచుకోవడానికి సెల్లార్‌లో 5 టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశామన్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, చెత్తతో బయోగ్యాస్ విద్యుత్ ఉత్పాదన ప్లాంట్ ద్వారా 100 యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి రైతుబజార్ అవసరాలకు సరిపోయేలా వినియోగిస్తామన్నారు. ఆర్గానిక్ లిక్విడ్ ఎరువును ఉత్పత్తి చేసి లీటరు రూ.2 చొప్పున రైతులకు అందజేస్తామని తెలిపారు. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయల కోసం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నదని, సుమారు 1400 ఇండ్లు పూర్తయ్యాయని త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. రూ.15 కోట్లతో పోలీసు కమిషనరేట్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ తరువాత రాష్ట్రానికే ఆదర్శంగా సిద్దిపేట పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ శివకుమార్, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ పరిధిలో కొత్త పురపాలికలు

- గ్రామజనాభా 15 వేలకు మించితే మున్సిపాలిటీ
- మరికొన్ని ఇతర పురపాలికల్లో విలీనం
- కనీసం రెండేండ్లు పన్నుల పెంపు ఉండదు
- నూతన పురపాలికలకు ప్రభుత్వ నిధులు
- ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి కే తారకరామారావు సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న గ్రామాలను పురపాలికలుగా మార్చే అవకాశాలను పరిశీలిస్తున్నామని పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. సోమవారం సచివాలయంలో పురపాలక, పంచాయతీరాజ్ శాఖాధికారులతో మంత్రి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వేలకు మించి జనాభా గల పంచాయతీలను కచ్చితంగా నగర పంచాయతీలు, మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన మున్సిపాల్టీల ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. పురపాలికలను ఏర్పాటుచేసిన తర్వాత కనీసం రెండు సంవత్సరాల పాటు పన్నుల పెంపు ఉండదన్నారు. దీంతోపాటు నూతన పురపాలికలకు నిధులను సైతం అందిస్తామని తెలిపారు. కొత్త పురపాలక సంస్థలను ఏర్పాటుచేయడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధిలో వేగం పెరుగుతుందని వివరించారు. నగరంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం ద్వారా రానున్న జనాభాను సైతం ఈ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు.

కొన్ని కొత్తగా.. మరికొన్ని విలీనం

ప్రస్తుతం ఓఆర్‌ఆర్ లోపల 167 గ్రామాలున్నాయని, వాటి భౌగోళిక పరిస్థితులను బట్టి నూతన పురపాలక సంస్థలుగా ఏర్పాటు, ఇతర పురపాలికల్లో విలీనం చేయడం ఉంటుందని మంత్రి కేటీఆర్ వివరించారు. అధికారుల నివేదికలతోపాటు స్థానికంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి నూతన పురపాలికలకు ప్రతిపాదనలివ్వాలని కోరారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేయాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అమీన్‌పూర్, బొల్లారం, కొంపల్లి, పుప్పాల్‌గూడ, ప్రగతినగర్, తెల్లాపూర్, కొల్లూరు, తుర్కయాంజాల్‌లతోపాటు మరికొన్ని మున్సిపాలిటీలను ఏర్పాటుచేయడంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, సంగారెడ్డి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నగర ఎమ్మెల్సీలు, భువనగిరి ఎంపీ బూర నర్సయ్య, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




సోమవారం సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ రామ్మోహన్, ఎంపీ నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు, అధికారులు కూడా ఉన్నారు.

కేటీఆర్‌కు కృతజ్ఞతలు

గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బసంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్‌లోని ఎన్నారైలను ఆదుకునేందుకు మంత్రి కేటీఆర్ తీసుకొన్న చొరువ పట్ల గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్కురి బసంత్‌రెడ్డి సోమవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ సాయం ప్రశంసనీయమని, అవసరమైన మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.50 గంటలకు



సూర్యాస్తమయం: 6.10 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం షష్ఠి ఉదయం 8.03 వరకు తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్త ఉదయం 10.54 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: తె. 4.21 నుంచి 5.57 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి 4.45 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.06 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.23 నుంచి 3.09 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.50 నుంచి 6.26 వరకు.

మేడ్చల్‌లో మిషన్ భగీరథ పరుగులు

837 కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు • ఇంటింటికి ఇంటర్‌నెట్.. ఈ నెలలో ప్రారంభం

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

బిందెడు నీళ్ల కోసం పుట్టెడు కష్టాలకోర్చిన మేడ్చల్ జిల్లాకు మంచి రోజులొచ్చాయి. ఇంటింటికీ తాగునీళ్లిస్తేనే మళ్లీ వచ్చి ఓట్లడుగుతానని శపథంబూనిన నేత మొదలుపెట్టిన భగీరథ కార్యం జిల్లాలో 100 శాతం సఫలమైంది. మేడ్చల్ జిల్లా గొంతు తడిపేందుకు, ఆడబిడ్డల కన్నీళ్లు తుడిచేందుకు సుమారు 270 కి.మీ. దూరానపారే గోదారమ్మను మేడ్చల్‌కు మోసుకొచ్చింది 'మిషన్ భగీరథ'. గజ్వేల్‌లో మిషన్ భగీరథ పథకం ప్రారంభోత్సవ సభలో సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగానే గజ్వేల్ తరువాత భగీరథ జలాలు మేడ్చల్ జిల్లా పల్లెప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకాన్ని 26 సెగ్మెంట్‌లుగా విభజించగా, వీటిలో 100 శాతం పూర్తయిన మొదటి ప్రాజెక్టు మేడ్చల్ కావడం విశేషం. ఎన్నికల మ్యానిఫెస్టోలో లేకున్నా.. తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ కానుకగా అతి త్వరలో ప్రారంభమవుతున్న సందర్భంగా మేడ్చల్ సెగ్మెంట్ మిషన్ భగీరథ పథకంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

104 గ్రామాలకు.. 45,449 కుటుంబాలకు లబ్ధి

2015 డిసెంబర్ మొదటివారంలో జిల్లాలో మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు అవసరమైన నిధులను కూడా విడుదల చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి అనుమతులను సాధించారు. అలాగే జిల్లాలో రైతులను ఒప్పించి సుమారు 40.40 ఎకరాల వ్యవసాయ భూములను సేకరించారు. దీంతో కేవలం ఏడాదిన్నరలోనే మేడ్చల్ జిల్లాలో ఇంటింటికీ నల్లానీరు పథకం ఆవిష్కృతమైంది. ఇప్పటికే 2016 ఏప్రిల్ నుంచి మేడ్చల్ నగర పంచాయితీ పరిధిలో 10,000 కుటుంబాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుండగా, ట్రయల్‌రన్‌లో భాగంగా సుమారు ఆరునెలలుగా 104 గ్రామాల్లో గోదావరి నీటిని అందిస్తున్నారు. 2018 ఫిబ్రవరి రెండోవారంలో జిల్లా పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపల ఉన్న మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 5మండలాలు, 104 గ్రామాలకు చెందిన 45,449 కుంటుంబాలకు గోదావరి నీరు అందుతుంది.

ఇంటింటికీ ఇంటర్నెట్

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు జిల్లాలో మిషన్ భగీరథ పైపులైన్లతో పాటు సుమారు 552 కి.మీ.మేర ఫైబర్ కేబుల్స్‌ను వేయించారు. ఇంటింటికి ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు టీవీ కేబుల్, ల్యాండ్‌లైన్ ఫోన్ కేబుల్ వసతి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఫైబర్ కేబుల్స్‌ను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. మేడ్చల్ జిల్లాలో మిషన్ భగీరథ పథకం అమలులో భాగంగా భౌగోళిక స్వరూపంపై సంపూర్ణ అధ్యయనం చేసిన ఇంజినీరింగ్ అధికారులు అద్భుతమైన డిజైన్లను సమకూర్చారు. ఇందులో ముఖ్యంగా అత్యంత ఎత్తైన కొండల ప్రాంతాల్లో రిజర్వాయర్లు (సముద్రమట్టానికి 622 మీటర్ల ఎత్తులోని గిర్మాపూర్, డబీల్‌పూర్ రిజర్వాయర్లు), సంపుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడంతో 75-80శాతం వరకు విద్యుత్ వినియోగం లేకుండానే కేవలం గ్రావిటీ ద్వారానే ఇంటింటికి నీరు సరఫరా చేయగలుగుతున్నారు. కేవలం 25 శాతం 0.119 మెగావాట్స్ విద్యుత్ వినియోగిస్తూ పంపింగ్ కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇది మేడ్చల్ జిల్లా మిషన్ భగీరథ సెగ్మెంట్ ప్రత్యేకతగా ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, దీనిని ఈ నెల 12న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు.మేడ్చల్‌లో నిర్మించిన 1000 కేఎల్ రిజర్వాయర్ వద్ద అధికారులు ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మేడ్చల్‌లో నిర్మించిన 1000 కేఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్



ఘనపూర్ రిజర్వాయర్ పైప్‌లైన్

సీఎం ప్రజలనాడి తెలిసిన నాయకుడు



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలనాడి తెలిసిన నాయకుడు. ఇంటింటికి తాగునీరు ఇవ్వకుంటే ఓట్లు అడుగనని శపథం చేసిన అపర భగీరథుడు. ప్రాజెక్టు 100 శాతం పూర్తవడంతోపాటు రాబోయే వేసవికి ముందే ప్రారంభోత్సవం చేసుకొని ప్రజల తాగునీటి కష్టాలను తీరుస్తుండటం మా జిల్లా ప్రజల అదృష్టం.

– చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ

30 ఏండ్ల సమస్య.. మూడేండ్లలో పరిష్కారం



మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో 30 ఏండ్ల నుంచి ఉన్న తాగునీటి సమస్య కేవలం మూడేండ్లలోనే పరిష్కారమైంది. 104 గ్రామాలకు సుమారు రూ.300 కోట్లతో స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ అంకితభావానికి నిదర్శనం. ఔటర్ లోపలి గ్రామాలకు సంబంధించిన పనులు కూడా 2018 డిసెంబర్ నాటికి పూర్తవుతాయి.

– మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే

ప్రజల కల నిజమైంది



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల కల నిజమైంది. మొదట చెప్పినప్పుడు నమశక్యం కాలేదు. కానీ నేడు ఇంటింటికి గోదావరి నీరు వస్తుంటే ప్రజల కలలను కూడా నిజం చేసే సత్తా ఉన్న నాయకుడు సీఎం కేసీఆర్ అని తేలింది. ఇక్కడి ప్రజలు గోదావరి నదిని చూడటమే అరుదు. అలాంటిది ఇంటింటికి గోదావరి నీరు వస్తుండటం చూస్తుంటే స్థానిక ఎమ్మెల్యేగా గర్వపడుతున్నాను.

– కే వివేకానంద, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే

ఇక జిల్లా ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు



జిల్లాలో ప్రజలందరికీ ఇకనుంచి రక్షిత తాగునీరు ఇంటింటికి సరఫరా అవుతుంది. ఈ ప్రాజెక్టు అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ నేడు 100 శాతం పూర్తి చేయడం శుభ పరిణామం.

–ఎంవీ రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్

లోకం పోకడ



గోపాలస్వామి మీ మొర ఆలకించాడు.. సరాసరి శ్రీకృష్ణ జన్మస్థానానికి రప్పించుకున్నాడు!

భార్య, ఇద్దరు పిల్లల దారుణ హత్య

- పనిచేసుకోమన్నందుకు ఓ భర్త పైశాచికత్వం
- గొంతునులిమి భార్యను.. దిండుతో అదిమి చిన్నారుల హత్య
- కాలనీవాసులకు విషయం చెప్పి.. స్టేషన్‌కు వెళ్లి లొంగుబాటు
- జిల్లెలగూడ సుచిత్ర ఎన్‌క్లేవ్‌లో ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో/ బడంగ్‌పేట, నమస్తే తెలంగాణ: ఖాళీగా తిరగడం ఎందుకు.. ఏదైనా పనిచేసుకుని బతుకమన్నందుకు కట్టుకున్న భార్యతోపాటు, ఇద్దరు పిల్లలను కడతేర్చాడు కసాయి భర్త. ఈ సంఘటన హైదరాబాద్‌లోని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలలోకి వెళితే.. హరీందర్‌గౌడ్ భార్య జ్యోతి(33), కుమారుడు అభితేజ్(6), కుమార్తె సహస్ర(4)తో కలిసి బాలాపూర్ మండలం జిల్లెలగూడ సుమిత్ర ఎన్‌క్లేవ్ కాలనీలో ఉంటున్నాడు. మలక్‌పేటలో డెంటల్‌క్యాప్స్ తయారుచేసే ల్యాబ్‌ను నడిపిన అతడు ఏడాదిగా ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక హరీందర్.. భార్య, పిల్లలతో కలిసి నిద్రపోయాడు. సోమవారం తెల్లవారుజామున భార్య జ్యోతిని నిద్రలేపి పక్క గదిలోకి తీసుకెళ్లి గొంతునులిమి హత్య చేశాడు. తరువాత బెడ్రూంలో పడుకుని ఉన్న పిల్లల దగ్గరకు వెళ్లి దిండుతో ఊపిరాడకుండా చేసి చంపేశాడు. కొద్దిసేపటి తరువాత ఇంటినుంచి బయటకు వచ్చిన అతడు కాలనీ కార్యదర్శి విఠల్‌రెడ్డి, అధ్యక్షుడు రాములు వద్ద కు వెళ్లి భార్య, పిల్లలను చంపేశానని చెప్పాడు. నిద్రమత్తులో ఉన్నవారు హరీందర్ చెప్పేది అర్థం చేసుకునేలోపే ఆటోలో నేరుగా మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ నైట్‌డ్యూటీ అధికారికి మూడుహత్యల విషయం చెప్పాడు. పని చేయమంటూ వేధిస్తుంటే భార్యను చంపానని, తాను జైలుకు పోతే పిల్లలు అనాథలుగా మారుతారని వారినీ చంపేశానని చెప్పుకొచ్చాడు.

పశ్చాత్తాపంలేని కసాయి..

ఏడాదికాలంగా ఏ పనిచేయకుండా.. తల్లిదండ్రులు, అత్తామామలు సరుకులు పంపుతుంటే తినుకుంటూ తిరుగుతున్నాడు. దీనిని అవమానంగా భావించిన భార్య ఏదైనా పనిచేయవచ్చు కదా అని అడుగడమే ఆమె పాలిట శాపమైంది.. పనిచేయమంటూ నిత్యం అడుగుతుండడంతో అక్కసు పెంచుకున్నాడు. ప్రతిరోజూ భార్య ముందు అవమానపడేకంటే వారిని చంపేస్తే సమస్య పరిష్కారమవుతుందని నిర్ణయించుకున్నాడు. భార్య, పిల్లలతోపాటే భోజనం చేసి పడుకున్న అతడు తెల్లవారుజామున 4 గంటలకు వారిని కడతేర్చాడు. భార్య, కన్నబిడ్డలను హత్యచేశాననే పశ్చాత్తాపం అతనిలో లేకపోవడం పోలీసు అధికారులనూ ఆశ్చర్యానికి గురిచేసింది.

రాత్రంతా గుడిలో నిద్ర..

నెలరోజుల క్రితం జ్యోతి, భర్త హరీందర్‌ల మధ్య రాత్రి సమయంలో గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన జ్యోతి పిల్లలను తీసుకుని కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయానికి వచ్చింది. రాత్రంతా దేవాలయంలోనే ఉండిపోయింది. తనభర్త గౌరవం కాపాడడానికి తెల్లవారుజామున తిరిగి ఇంటికి చేరుకుంది. తన భర్త మారుతాడని ఆశలుపెట్టుకున్న ఆమె అతడే కాలయముడవుతాడని ఊహించలేకపోయింది. ఈహత్యలు చాలా దారుణమని డీసీపీ వెంకటేశ్వర్ రావు తెలిపారు. కేసును ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ మన్‌మోహన్ దర్యాప్తు చేస్తారని, నిందితుడికి శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.



భార్య జ్యోతి, పిల్లలు అభిజేత్, సహస్రలతో హరీందర్‌గౌడ్ (ఫైల్)

భగీరథ పనులకు 201 కోట్లు

గ్రామీణ మౌలిక వసతుల పథకం కింద నాబార్డ్ రుణం మంజూరు

24 ఇంట్రావిలేజ్ ప్రాజెక్టుల పనులపై ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ ప్రాజెక్టులో భాగంగా నల్లగొండ, సూర్యాపేట, మేడ్చల్, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో చేపడుతున్న 24 ఇంట్రావిలేజ్ ప్రాజెక్టుల పనులకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ మౌలిక వసతుల కల్పన నిధుల పథకం కింద నాబార్డ్ రూ.201.71 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టు ప్రధాన పనులను పూర్తి చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ప్రస్తుతం ఇంట్రావిలేజ్ పనులపై దృష్టి సారించింది. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన నిధుల పథకం కింద సూర్యాపేట, మేడ్చల్, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని 24 ప్రాజెక్టుల పరిధిలో 719 ఆవాసాలలో తెలంగాణ మిషన్‌భగీరథ కార్పొరేషన్ ఇంట్రావిలేజ్ పనులు చేపడుతున్నది. ఈ పనులకు రూ.237 కోట్ల 31 లక్షల 25 వేల అంచనావ్యయంతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రతిపాదనలు రూపొందించగా.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 15 శాతం అంటే రూ.35 కోట్ల 60 లక్షల 15 వేలు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ సోమవారం ఈ పనులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్‌లో 22న బయో ఏషియా సదస్సు

రెండు రోజులపాటు హెచ్‌సీసీలో నిర్వహణ

మిచెల్ ఎన్ హల్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు

50కిపైగా దేశాల నుంచి 1500 మంది ప్రతినిధుల రాక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్ ఎన్ హల్ ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. 2004 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా నిర్వహించే బయో ఏషియా సదస్సు సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్తను ఎంపికచేసి ఈ అవార్డును అందజేస్తుంది. ఈ సారి మిచెల్‌ను ఎంపికచేసింది. సదస్సు ప్రారంభోత్సవ వేడుకలో ఆయనకు ఈ అవార్డు అందజేయనున్నది. స్విట్జర్లాండ్‌లోని బయోజట్రం యూనివర్సిటీ ఆఫ్ బాసెల్‌లో ఆయన పనిచేశారు. బయో ఏషియా సదస్సు 2018 సదస్సు ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌సీసీలో జరుగనున్నది. దీనికి ప్రపంచవ్యాప్తంగా 50కిపైగా దేశాల నుంచి 1500 మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సులో ఏర్పాటుచేసే ఎగ్జిబిషన్‌లో వంద మంది ఎగ్జిబిటర్లు, స్టార్టప్ సంస్థ నిర్వాహకులు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. 1200లకుపైగా ట్రేడ్, పార్టనర్ షిప్ సమావేశాలు జరుగనున్నాయి. జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డును అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులున్న ఇంటర్నేషనల్ అడ్వయిజరీ బోర్డు ఎంపిక చేసింది.

మిచెల్ ఎన్ హల్ ఎంపిక పట్ల మంత్రి కేటీఆర్ హర్షం

అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధనలు చేసిన మిచెల్ ఎన్ హల్‌ను ఈ అవార్డుకు ఎంపికచేయడం పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు హర్షం వ్యక్తంచేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో విశిష్ట సేవలందించిన వారికి ఈ అవార్డు ఇస్తున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్సెస్ విభాగంలో తెలంగాణ ముందు భాగంలో నిలుస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదారులు, వ్యాపార ప్రముఖులు తమ ఉత్పత్తులు, విస్తరణ అవకాశాలను ఎంపిక చేసుకోవడానికి బయో ఏషియా సదస్సు మంచి వేదికగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ కిట్ భేష్!

- కేంద్ర వైద్యారోగ్యశాఖ అదనపు కార్యదర్శి వీపీ సుడాన్ ప్రశంస



సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో బాలింతకు కేసీఆర్ కిట్టును అందజేస్తున్న వీపీ సుడాన్

కొండాపూర్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం బాలింతల కోసం అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ పథకంపై కేంద్ర వైద్యారోగ్యశాఖ అదనపు కార్యదర్శి వీపీ సుడాన్ ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలును తెలుసుకునేందుకు కేంద్ర బృందం సోమవారం హైదరాబాద్‌కు వచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆ బృందం సందర్శించింది. అక్కడ అందిస్తున్న వైద్యసేవల గురించి సిబ్బందిని కేంద్ర బృందం సభ్యులు జాయింట్ సెక్రటరీలు లవ్ అగర్వాల్, అలోక్ సక్సేనా, నీతి ఆయోగ్ డైరెక్టర్ దినేశ్ అరోరా అడిగి తెలుసుకున్నారు. ఈ పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో భద్రపర్చే విధంగా వెబ్‌సైట్‌ను సుడాన్ ప్రారంభించారు. ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వాకాటి కరుణ బృందం వెంట ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన తరువాత ఈ బృందం సభ్యులు హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయానికి చేరుకుని ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు.















వడివడిగా కాళేశ్వరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారీ సాగునీటి పారుదల ప్రాజెక్టుల పనులు వడివడిగా సాగుతున్నాయి. కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. తొమ్మిది నెలల క్రితం వరకు బీడు భూములుగా దర్శనమిచ్చిన ప్రాంతాల్లో నిత్యం వందల మంది కార్మికులు భారీ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో తలమునకలయ్యారు.

1. భారీ ఎత్తున సాగుతున్న మేడిగడ్డ బరాజ్ పనులు
2. అనంతగిరి ప్రాజెక్టు సర్జ్‌పూల్, 3. మేడిగడ్డ పంప్‌హౌస్
4. జోరుగా సాగుతున్న మేడి గడ్డ పంప్‌హౌస్ నిర్మాణ పనులు
5. మిడ్ మనేరు ప్రాజెక్టు
6. చురుకుగా సాగుతున్న సుందిళ్ల బ్యారేజ్ పనులు
7. మేడిగడ్డ పంప్‌హౌస్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు

ఫొటోలు- గడసంతల శ్రీనివాస్

పీవీ నర్సింహారావు వెటర్నరీ వర్సిటీకి రూ.15 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయానికి పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ నిధులు విడుదలచేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు రూ. 15 కోట్ల నిధులను కేటాయించింది. ఈ మేరకు సోమవారం పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

ఏప్రిల్ 21న పాలిసెట్ 2018

మార్చి 14 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర సాంకేతిక విద్యామండలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల భర్తీకోసం ఏప్రిల్ 21న పాలిసెట్ 2018ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌కు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆమోదం తెలిపారని రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి సెక్రటరీ బీ వెంకటేశ్వర్లు తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 58 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 2018-19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో 44,451 సీట్లు ఉన్నాయన్నారు. అయితే ఏఐసీటీఈ ప్రకారం 2018-19 విద్యా సంవత్సరం ప్రైవేటు పాలిటెక్నిక్ కళశాలల అఫిలియేషన్ ప్రక్రియ కొనసాగుతున్నదని ఆయన పేర్కొన్నారు.

ఉర్దూ మీడియంలోనూ అన్ని ప్రవేశ పరీక్షలు: పాపిరెడ్డి

ఎంసెట్, ఎంబీఏ, ఎడ్‌సెట్, పీజీఈసెట్, లాసెట్ వంటి అన్నిరకాల ప్రవేశ పరీక్షలను తెలుగు, ఇంగ్లిష్ మీడియంతోపాటు ఉర్దూ మీడియంలో కూడా నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఆ మేరకు కసరత్తు జరుగుతున్నది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డిని.. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశించారు.

డిగ్రీ విద్యార్థులకు సాంకేతికవిద్య

రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రాక్టికల్స్ (ఇంటర్నల్స్)ను అమలు చేస్తున్నామని, ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరుపుతున్నామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఐదు యూనివర్సిటీల్లో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

స్టాఫ్‌నర్స్, ఫిజియోథెరపిస్ట్ అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలోని స్టాఫ్‌నర్స్, ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీకి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ ఎడిట్ ఆప్షన్ కల్పించింది. దరఖాస్తు పత్రాన్ని సమర్పించే సమయంలో అభ్యర్థులు తప్పులు చేసినట్టు గమనించామని.. వారి భవిష్యత్ రీత్యా తప్పులను సరిదిద్దుకునేందుకు ఎడిట్ అవకాశం కల్పిస్తున్నామని కమిషన్ కార్యదర్శి వెల్లడించారు. ఒక్కసారి మాత్రమే ఈ సౌకర్యం కల్పిస్తున్నందున అభ్యర్థులు తమ వివరాలను జాగ్రత్తగా సవరించుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 8నుంచి 11 వరకు దరఖాస్తులు సవరించుకోవచ్చని వివరించారు.

సినిమా ఆపరేటర్స్ పరీక్ష ఫలితాలు విడుదల

36 మంది ఎంపికైనట్టు ప్రకటించిన ఎలక్ట్రికల్ విభాగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన సినిమా ఆపరేటర్స్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ సోమవారం విడుదల చేశారు. మొత్తం 36 మంది ఎంపికైనట్టు వెల్లడించారు. 2018 సంవత్సరానికి గాను 5వ విడుత సినిమా ఆపరేటర్స్ పరీక్షను వచ్చే డిసెంబర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జూలైలో విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. జీఓ నం 213 ప్రకారం, సంవత్సరానికి ఒకసారి ఈ పరీక్షను నిర్వహిస్తూ ఉంటారు.

ఐకియా ఫర్నిచర్ సంస్థలో ఉద్యోగాలు

8 వరకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గృహోపకరణాల రంగంలో అంతర్జాతీయంగా ప్రథమస్థానంలో ఉన్న ఐకియా సంస్థ ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వంతో జట్టుకట్టింది. కార్పొరేట్ రంగంలోని ఉద్యోగాల భర్తీలో నైపుణ్యాల కల్పనకు ఉద్దేశించిన టాస్క్ ద్వారా తమకు కావాల్సిన మహిళా అభ్యర్థులను ఎంపిక చేసుకొనేందుకు సోమవారం ప్రకటన విడుదలచేసింది. ఐకియా స్టోర్‌లో సేల్స్ ఉద్యోగానికి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని ఆ సంస్థ కోరింది. సాధారణ డిగ్రీతోపాటు బీఈ, బీటెక్, ఎంబీఏ వంటి అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. వేతనం ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, పనితీరును బట్టి ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించింది.

కాంగ్రెస్ హయాంలో ధనయజ్ఞం

- ప్రాణహిత-చేవెళ్ల పేరుతో నిధులు బూడిదపాలు
- బరాజ్ లేకుండానే కాల్వలు తవ్వించారు
- నాటి మహారాష్ట్ర సీఎం హెచ్చరించినా కిరణ్‌కుమార్ సర్కార్ పట్టించుకోలేదు
- ఇంజినీర్ తిరుపతిరెడ్డి స్మారకోపన్యాసంలో రిటైర్డ్ సీఈ అనంతరాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జల యజ్ఞం పేరిట నిధులు బూడిదపాలయ్యాయని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ అనంతరాములు అన్నారు. అప్పటి ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా బరాజ్ నిర్మించకుండానే కాల్వల నిర్మాణం చేపట్టిందని చెప్పారు. ఇది తగదని తాము అప్పట్లోనే కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి చెప్పామని తెలిపారు. నాటి మహారాష్ట్ర సీఎం కూడా బరాజ్‌పై ఒప్పందం లేకుండా పనులు నిర్వహిస్తే నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతాయని కూడా హెచ్చరించారని గుర్తుచేశారు. కానీ, అప్పటి ప్రభు త్వం వినకపోవడంతో జలయజ్ఞం కాస్తా ధనయజ్ఞంగా మారిందనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లిందని అభిప్రాయపడ్డారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో సోమవారం 'కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇం జినీర్ తిరుపతిరెడ్డి ఏడో స్మారకోపన్యాసం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అనంతరాములు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు తెరపైకి రావడం, తదనంతర పరిణామాలు, తెలంగాణ ప్రభుత్వం రీడిజైనింగ్‌లో భాగంగా కాళేశ్వరానికి ఎందుకు రూపకల్పన చేసింది అనే విషయాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిజానికి రిటైర్డ్ ఇంజినీర్ల చొరవతోనే ప్రాణహితజలాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందన్నారు.

160 టీఎంసీలను ప్రతిపాదించగా 50 టీఎంసీలకు మాత్రమే మెమో జారీ చేసిన కాంగ్రెస్

తుమ్మిడిహట్టి బరాజ్ దగ్గర 160 టీఎంసీలను మళ్లించేందుకు తాము డీపీఆర్ రూ పొందించగా, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తొలుత కేవలం 50 టీఎంసీల మళ్లింపునకు మెమో జారీ చేసిందన్నారు. దీనిని తాము ప్రశ్నించడంతో అదేరోజు 160 టీఎంసీల మళ్లింపు మెమో జారీచేశారని అనంతరాములు గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడి, టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహారాష్ట్రతో తమ్మిడిహట్టి బ్యారేజీపై సంప్రదింపులు జరిపి, 152 మీటర్ల బరాజ్‌కు ఆ రాష్ట్రం అంగీకరించదనే నిర్ధారణకు వచ్చిన తర్వాతే ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషించిందని వివరించారు. తమ్మిడిహట్టి దగ్గర ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడంతో మేడిగడ్డ దగ్గర బరాజ్ నిర్మాణానికి పూనుకుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి డాక్టర్ జీ రామేశ్వరరావు, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్లు వెంకట్రామారావు, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

మగ్గానికి కార్మికుడే యజమాని

- దేశంలోనే తొలిసారిగా మరమగ్గ కార్మికులకు పథకం
- 220కోట్లతో సిరిసిల్ల జిల్లాలో 50 శాతం సబ్సిడీపై మగ్గాల అందజేత
- మొదటి దశలో 1104 మందికిలబ్ధి
- ఒక్కో కార్మికుడికి 20లక్షల ప్రయోజనం



సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో తమిళనాడు వస్త్ర పరిశ్రమ యజమానులకు మరమగ్గాల గురించి వివరిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇప్పటిదాకా మరమగ్గాలపై పనిచేస్తున్న కార్మికులు.. త్వరలో సొంతంగా మగ్గాలు ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధంచేసింది. మరమగ్గాలతో పనిచేస్తున్న కార్మికులకు యజమానుల హోదా (వర్కర్ టూ ఓనర్) కల్పించడమే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. మరమగ్గాలు ఏర్పాటుచేసుకునేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రతి కార్మికుడికి యాభైశాతం సబ్సిడీపై మరమగ్గాలను అందజేస్తారు. దేశంలోనే మరమగ్గ కార్మికులకు ఇటువంటి పథకం తొలిసారిగా తెలంగాణలో అమలుకానుండటం విశేషం. విడుతలవారీగా అమలుచేసే ఈ పథకంలో మొదటి దశలో మౌలికసదుపాయాల కల్పన, మరమగ్గాలకు సబ్సిడీ సహా రూ.220కోట్లకు పైగా వెచ్చించనుంది. రాష్ట్ర పరిశ్రమలు, చేనేత, జౌళి శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశాలతో పథకం అమలుపై చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ ఇటీవలే సిరిసిల్లలో పర్యటించి కార్మికుల అభిప్రాయాలను సేకరించారు. ఒక్కో కార్మికుడికి మరమగ్గాల సబ్సిడీ, మౌలిక సదుపాయాల రూపంలో దాదాపు రూ.20 లక్షలకు పైగా సబ్సిడీతో పథకాన్ని ప్రభుత్వం అమలుచేయనుంది. 1104 మంది కార్మికులను మొదటి విడుతలో ఎంపికచేయాలని నిర్ణయించారు. రాబోయే డిసెంబర్‌నాటికి సొంత మరమగ్గాల మీద కార్మికులు వస్త్రాలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు.

మగ్గాలపై సగం సబ్సిడీ

కార్మికుడిని యాజమానిగా మార్చే క్రమంలో ఒక్కొక్కరికి నాలుగు మరమగ్గాలను అందజేస్తారు. ఒక్కో దానికి రూ.2 లక్షల చొప్పున నాలుగు మగ్గాలకు రూ.8 లక్షలు అవుతుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4 లక్షలు అందచేయనుంది. రూ.2.40 లక్షలవరకు బ్యాంకు రుణం ఇప్పిస్తారు. మిగిలిన రూ.1.60 లక్షలను కార్మికుడు వెచ్చించాలి.

88 ఎకరాల స్థలంలో షెడ్లు

వర్కర్ టూ ఓనర్ పథకంలో భాగంగా కార్మికుడికి షెడ్డు నిర్మించి ఇస్తారు. దీనికోసం సిరిసిల్ల శివారులో 88 ఎకరాల భూమిని సేకరించారు. ఈ భూమిలో షెడ్లు నిర్మించడంతోపాటు తాగునీరు, రోడ్లు, కరంటు, మూత్రశాలలు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలన్నింటినీ చేనేత, జౌళి శాఖ కల్పించనుంది. మొత్తం 46 షెడ్లు నిర్మిస్తారు. ఒక్కో షెడ్డును 24మంది లబ్ధిదారులకు కేటాయిస్తారు.

త్వరలోనే మార్గదర్శకాలు: శైలజా రామయ్యర్

మరమగ్గ కార్మికులను యజమానులుగా మార్చాలని సీఎం కేసీఆర్ గతంలోనే ఆదేశాలు ఇచ్చారని చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే అమలుకు మార్గదర్శకాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు.



అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో మా యువ బ్యాట్స్‌మెన్ విజయంసాధిస్తారనుకున్నా. భారత బౌలర్లు మాయచేయడంతో ఓటమిపాలయ్యాం. మా బ్యాట్స్‌మెన్ పరిస్థితులను అర్థం చేసుకోలేక ఒత్తిడికి గురయ్యారు. దీంతో మ్యాచ్ చేజారింది.

నదీం ఖాన్, పాక్ అండర్-19 క్రికెట్ జట్టు మేనేజర్

ఫైనల్లో మన కుర్రాళ్లు నంబరవన్ ఆటతీరును ప్రదర్శించలేదు. అండర్-19 ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో వారి పూర్తి సామర్థ్యం ప్రదర్శించారు. 15 మంది కుర్రాళ్లు ప్రపంచకప్ విజేతలుగా నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఇలాంటి ప్రదర్శనను రాబోయే రోజుల్లోనూ కొనసాగిస్తే జాతీయజట్టులోకి కుర్రాళ్ల ప్రవేశం ఖాయం.

రాహుల్ ద్రవిడ్, భారత అండర్-19 చీఫ్ కోచ్



చరిత్రలో నేడు



1911
అరిజోనాలోని ప్రెస్కాట్‌లో తొలిసారిగా వృద్ధాశ్రమం ప్రారంభం.

1921
చార్లీ చాప్లిన్, జాకీ నటించిన 'ది కిడ్' సినిమా విడుదల.





1935
టర్కీలో తొలిసారిగా మహిళలకు ఓటు హక్కు.

రాజస్థాన్‌లో ఈ మధ్య జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు ఆ రాష్ట్రంలోని తాజా సామాజిక పరిస్థితిని, ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తున్నాయని చెప్పక తప్పదు. ఒక అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవటం తాజా స్థితికి సంకేతం. నిజానికి కొంతకాలంగా రాజస్థాన్‌లో నెలకొన్న పరిస్థితులను దగ్గరగా గమనిస్తున్నవారికి ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగించలేదు. రాజస్థాన్‌కు రాచరిక, భూస్వామ్య ఆధిపత్యాలు కొత్త కాదు. కాకుంటే ఈ మధ్యకాలంలో కుల, మత ఆధారిత వైషమ్యాలు, దాడులు పెచ్చుమీరాయి. ఈ పరిస్థితిని కాంగ్రెస్ సద్వినియోగం చేసుకున్నది. బీజేపీని ఊడ్చేసింది. ఏదేమైనా తాజా ఫలితాలు బీజేపీకి ప్రమాద సూచికలు.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ సాధించి భారత యువ క్రీడాకారులు దేశ ప్రతిష్ఠను నిలిపారు. ఓటమన్నదే ఎరుగకుండా నాలుగోసారి ప్రపంచకప్ గెలుచుకురావటం గర్వకారణం. ఈ గెలుపు సమిష్టి కృషి ఫలితానికి ప్రతీక. అటు బౌలర్లు, బ్యాట్స్‌మెన్ అంతా తమదైన పాత్రను నిర్వహించారు. యువ సామర్థ్యానికి ఐపీఎల్‌లోనూ తగిన గుర్తింపు దక్కింది. సగం మంది ఐపీఎల్ వేలంపాటలో మెరిశారంటేనే వారి ప్రతిభకు నిదర్శనం. ఈ విజయంలో కోచ్ ద్రవిడ్ పాత్ర ఎనలేనిది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

ఆవులకూ ఆధార్!

దేశంలోని ప్రతి ఒక్కరికీ పన్నెండు అంకెల ఆధార్‌కార్డు ఉన్నట్లుగానే, ఇప్పుడు ఆవులకూ ఆధార్ నెంబరు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైంది. ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు తప్పనిసరిచేసి, అన్నింటికీ అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై దేశంలో అనేకస్థాయిల్లో చర్చలు, వ్యతిరేకతలు వ్యక్తమవుతున్న తరుణంలో, పశువులకూ గుర్తింపు నెంబర్ ఇచ్చేందుకు సన్నద్ధమవటం గమనార్హం. పశుసంపదకు యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ఇవ్వడం ద్వారా పశుసంపద, దేశ సంపద పెరిగేందుకు కృషిచేస్తామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ చెప్పుకొస్తున్నది. దీనికోసం తాజా బడ్జెట్‌లో రూ.50 కోట్లు వెచ్చించింది. ఒక్కో ఆవు గుర్తింపు కార్డుకు ఎనిమిది నుంచి పది రూపాయలు ఖర్చుచేస్తూ, మొదటి దఫాగా నాలుగుకోట్ల ఆవులకు నెంబర్ ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నది. మొదట ఈ ప్రతిపాదనను 2015లో తీసుకొచ్చినా ఆధార్ కార్డుపై జరుగుతున్న వాద,వివాదాల కారణంగా కావచ్చు ఇన్నాళ్లు ఆచరణలోకి రాలేదు. ఇప్పుడు తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించి పశుసంపద గణన, సంరక్షణ పేరిట దానికి తెరతీశారు. ఇప్పటికే ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి చేసి, అన్నింటికీ అనుసంధానం చేయటం పట్ల తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న మోదీ ప్రభుత్వం, ఆవులకూ అలాంటి గుర్తింపు నెంబర్‌ను ఇవ్వటానికి ప్రయత్నించటం చర్చనీయాంశమవుతున్నది. ఇప్పటికే వ్యక్తిగత సమాచారం గోప్యత పట్ల ఆధార్‌పై విశ్వాసం లేక కాంగ్రెస్, తృణముల్ పార్టీల నేతలు తమకు ఆధార్‌కార్డు అవసరం లేదని, అందులో తమ వివరాలు నమోదు చేసుకోబోమని తెగేసి చెప్పారు. మరోవైపు గో రక్షణ పేరిట వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఇది కాషాయీకరణ మాత్రమేననే విమర్శలూ వినిపిస్తున్నాయి.

రాజకీయపార్టీకి తనదైన సిద్ధాంత భావజాలం వెలుగులో ఒక జెండా రంగు ఉండటం సహజమే. కానీ బీజేపీ దాన్ని వదిలేసి కాషాయ జెండాను నెత్తిన ఎత్తుకోవటంతోనే పేచీ. విభిన్న మతాలు, సం స్కృతులకు నెలవైన దేశంలో ఒక మత చిహ్నంగా ముద్రపడిన కాషాయాన్ని, ప్రతి ఇంటా పాడి జంతువైన ఆవును పవిత్రం చేసి పూజనీయమనటం వివాదాస్పదమే.

కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి హిందుత్వ శక్తుల విజృంభణ అనేక రూపాల్లో కొనసాగుతున్నది. అందులో గోరక్షణ ఒకటి. ఆవు పవిత్రమైనదని, పూజ నీయమైనదని గో రక్షకులు బయలుదేరారు. గోరక్షకుల పేరుతో వివిధ రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌శక్తులు పేట్రేగిపోయి దాడులకు తెగబడటం జరుగుతున్నవి. గోమాంసం తన ఇంట్లో దాచుకున్నాడన్న నెపంతో ఆఖ్లాక్ అనే వ్యక్తిపై దాడిచేసి హత్యచేసిన ఉదంతం మొదలు దేశవ్యాప్తంగా అనేక దాడులు జరిగాయి. ఆహారపు అలవాట్లనూ నిర్దేశిస్తున్నారు. ఆవులను కబేళాలకు తరలిస్తున్నారని, ఆవు చర్మం కలిగి ఉన్నారని, గోమాంసం తింటున్నారనీ ఇలా ఆవును రక్షించుకునే పేరుతో మనుషులను బలితీసుకుంటున్న తీరు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నది. విభిన్న మతాలు, జాతుల సహజీవనం కలిగిన గ్రామీణ, పట్టణ ప్రాంతం అనుమానం, అసహనం, భయం నీడలో మగ్గిపోతున్నాయి. ఇలాంటి సంక్లిష్ట సామాజిక వాతావరణంలో మోదీ ప్రభుత్వం ఆవులకూ ఆధార్ నెంబర్ అంటూ సరికొత్త కార్యక్రమం చేపట్టడం మెజార్టీ వాద అనుకూల చర్యగా విమర్శలకు తావిచ్చేదే. 2022 నాటికి వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంలో పశుగణాభివృద్ధికి పెద్దపీట వేసి పాడిని పెంపొందించటం లక్ష్యంగా చెప్పారు. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న వ్యవసాయక సమాజంలో పశుసంపదను వ్యవసాయంతో విడదీసి చూడలేం. వాస్తవమే. అయితే పశుసంపద పెంపు, సంరక్షణకు వాటికి అవసరమైన పశుగ్రాసం, సంరక్షణ, పునరుత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. శాస్త్రీయ పద్ధతిలో మేలు జాతి పాడి పశువులు, గేదెల పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణను ప్రవేశపెట్టాలి. దేశంలో పశుగణాభివృద్ధికి కేవలం 200 కోట్లు కేటాయించి దాంతోనే వ్యవసాయ ఆదాయం పశుసంపదతో రెట్టింపు అవుతుందని చెప్పటం ఉత్త మాటలుగానే భావించాలి. ఆశ్చర్యకరమైన అంశమేమంటే ఆవులకు యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ఇవ్వటం ద్వారా పాల ఉత్పత్తి 20 శాతం పెరుగుతుందని అనటం హాస్యాస్పదం.

ప్రధానిగా మోదీ ఏమి చెప్పినా ఆయన అనుయాయులు మాత్రం కాషాయీకరణను బాహాటంగానే చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా మెజార్టీవాదంతో చెలరేగి దాడులకు దిగుతున్న ఘటనలు అటుంచితే, యూపీలో సీఎం యోగీ మరింతగా తన కాషాయరంగును రాష్ట్రంపై రుద్దుతున్నారు. యోగీ సీఎం అయిన వెంటనే వీపీ సింగ్ హయాంలో నిర్మించిన ఐదంతస్తుల అధికార భవనానికి కాషాయరంగు వేసి కాషాయీకరణకు పూనుకున్నారు. అలాగే 1939లో నిర్మించిన చరిత్రాత్మకమైన ఖైసర్‌భాగ్ పోలీస్‌స్టేషన్‌కు కాషాయరంగును వేశారు. ఎప్పుడు అధికారం మారినా మొదట రంగు మారేది రోడ్డు రవాణా బస్సులేననేది చెప్పాల్సిన పనిలేదు. యూపీలో గత పదిహేనేండ్లలో బస్సులు ఊసరవెల్లుల్లా రంగులు మారుతున్నాయి. మొదట బీఎస్పీ అధికారంలోకి వచ్చినవెంటనే నీలం, తెలుపు రంగుల్లోకి మారాయి. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలోకి రాగానే ఎరుపు,ఆకుపచ్చ వర్ణంలోకి మారిపోయాయి. ఇప్పుడు యోదీ ఆదిత్యనాథ్ రాకతో అవి కాషాయంలోకి మారిపోతున్నాయి. గమనించాల్సిన విషయమేమంటే చివరికి లక్నోలోని హజ్ కార్యాలయాన్నీ వదలలేదు. దానికీ కాషాయ రంగుపులిమి, 'కాషాయం కాంతికీ, శక్తికీ సంకేత'మని మైనారిటీ వ్యవహారాల మంత్రి మొహసిన్ రజా సమర్థించుకున్నారు! రాజకీయపార్టీకి తనదైన సిద్ధాంత భావజాలం వెలుగులో ఒక జెండా రంగు ఉండటం సహజమే. కానీ బీజేపీ దాన్ని వదిలేసి కాషాయ జెండాను నెత్తిన ఎత్తుకోవటంతోనే పేచీ. విభిన్న మతాలు, సంస్కృతులకు నెలవైన దేశంలో ఒక మత చిహ్నంగా ముద్రపడిన కాషాయాన్ని, ప్రతి ఇంటా పాడి జంతువైన ఆవును పవిత్రం చేసి పూజనీయమనటం వివాదాస్పదమే. ఇలాంటి చర్యలు సర్వజనుల సంక్షేమం కోసం అధికారం నెరిపే పార్టీకి, వర్గాలకు అనుసరణీయం కాదు. ఇది గర్హనీయం.

విశ్లేషణ



డాక్టర్ పిడిగెం సైదయ్య

'వ్యయ'సాయమా? వ్యవ'సాయ'మా?

2014-15 సంవత్సరాల్లో వరుసగా కరువులు, 2016-17 సంవత్సరాల్లో గిటుబాటు ధరలు లేవు. దేశంలో వ్యవసాయ వృద్ధిరేటు రెండు శాతం కంటే తక్కువే. అన్నిరంగాల కంటే అతితక్కువ సరాసరి ఆదాయం రైతుది. పంట రుణవిముక్తి కోసం, గిట్టుబాటు సాగు కోసం రైతాంగం ఆశగా ఎదురుచూస్తున్నది. మరోవైపు 2022 నాటికి మనకు స్వాతంత్ర్యం లభించి 75 ఏండ్లు అవుతుంది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం. సాగును కేవలం రైతులకు జీవనాధారంగానే కాకుండా వాణిజ్య హంగులు చేర్చుతాం, ఉత్పత్తి ఆధారిత సాగును 'రైతు ఆదాయ భద్రత' కేంద్రంగా తీర్చిదిద్దుతామని కేంద్రం అంటున్నది. కానీ తాజా బడ్జెట్‌లో ఆ మేరకు వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయింపులు జరుపలేదు. రైతుల ఆదాయ రెట్టింపునకు దిశానిర్దేశం, కార్యాచరణ, అందుకు తగిన ఆర్థిక మద్దతు కన్పించలేదు.

వాతావరణం, మార్కెట్ ఒడిదుడుకులతో సాలీనా రైతుల ఆదాయాలు నాలుగు శాతంపైనే తగ్గిపోనున్నాయి. పంటల దిగుబడులు తగ్గుతున్నాయని ఆర్థిక సర్వే నివేదికతో సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండే. రైతుల ఆదాయాల రెట్టింపునకు వ్యవసాయ వృద్ధిరేటు సాలీనా 10.41 శాతంపైనే ఉండాలి. దానికి బహుముఖ వ్యూహాలతో సాగులో సంస్కరణలు తీసుకురావాలి. రోజురోజుకు పెరిగిపోతున్న పంటల పెట్టుబడి ఖర్చుల నేపథ్యంలో తెలంగాణ తరహాలో 'ప్రత్యక్ష నగదు పెట్టుబడి సహాయం'ను కేంద్రం కూడా ప్రకటించాల్సింది.

రైతు బడ్జెట్‌గా చెప్పే ప్రయత్నం చేసినప్పుడు 'కనీస మద్దతు ధరల'లో పూర్తిస్థాయి సంస్కరణలు మొదలుపెట్టాల్సింది. ఇప్పటివరకు ఒక్క పంటకు కూడా కేంద్రం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతులకు లాభాలు ఇవ్వలేదు. 60వ దశకంలో దిగుమతి ఆధారిత ఆహారవ్యవస్థ నుంచి ఆహారధాన్యాల్లో స్వయం సమృద్ధికి చేరడానికి రైతు ప్రధాన భూమిక. నేడు రికార్డు స్థాయిలో దేశంలో 27.5 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు, 30 కోట్ల టన్నుల పండ్లు, కూరగాయల ఉత్పత్తి ఉన్నది. కానీ రైతుకు వస్తున్న సాలీనా ఆదాయం ఇరువై వేలు మించడం లేదని ఎన్‌ఎస్‌ఎస్‌ఓ తెలుపుతున్నది. ప్రత్యామ్నాయం ఉంటే 70 శాతం రైతులు వ్యవసాయం నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నది సర్వే చెప్తున్న నిజం. రైతును సాగులో నిలబెట్టగలిగేది గిట్టుబాటు ధరే. అందుకే సాగు ఖర్చులు పోగా 50 శాతం లాభం ఉండేలా మద్దతు ధరలు నిర్ణయించాలని ఎప్పటినుంచో రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే విచిత్రంగా యాసంగి పంటలకు ఉత్పత్తిఖర్చుల కంటే 50 శాతం లాభం ఉండే విధంగా ఇప్పటికే నిర్ణయించామనడం అక్షరాల అబద్ధం. దేశంలో వానాకాలంలో 75 శాతానికి పైగా పంటలు పండుతాయి. యాసంగిలో ఆహార ధాన్యాలు, ఇతర మద్దతు ధరలు జాబితాలో ఉన్న పంటలు పండేది తక్కువ. వచ్చే వానాకాలం నుంచి అన్ని పంటలకు ప్రకటిస్తామని, రైతులకు లాభసాటి మద్దతు ధరలు ఉండనున్నట్టు తెలిపారు. మద్దతు ధరల లెక్కింపులో రాష్ట్రాలవారీగా ఉన్న పంటల ఖర్చులు, ఉత్పాదకత పక్కనపెడితే రెండు అంశాలు ప్రధానం. మొదటిది-విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట కోత, రవాణా కూలీ, రైతు కుటుంబం కూలీ ఖర్చులు. రెండవది రైతు తన భూమి కౌలు, పెట్టుబడిపై వడ్డీ, యాజమాన్యపు ఖర్చులు, కుటుంబ కూలీలు. అయితే సీఏసీపీ కేవలం మొదటి తరహా అంశాలనే పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరలు నిర్ణయిస్తుంది. రెండోరకం ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవడంలేదు. అందుకే రైతుకు ధరలు లాభసాటిగా లేవు. మిగతా రంగాల్లో వలె సాగు గిట్టుబాటు కావాలంటే రైతు పెట్టుబడి ఖర్చులకు అదనంగా 50 శాతం లాభం ఉండేలా ధరలు ఉండాలి. నిజంగా యాసంగి పంటలకు ధరలు లాభం ఉండాలి అంటే ఇప్పటికే బడ్జెట్‌లో మద్దతు ధరల కోసం కేటాయించాల్సింది. కానీ అది లోపించింది.

దేశంలోని 22 వేల గ్రామ సంతలను అభివృద్ధి చేసి జాతీయ వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానం చేస్తామని ప్రకటించారు. రెండు వేల కోట్ల రూపాయలు 'వ్యవసాయ మార్కెట్' ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పస్ నిధిగా ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో 86 శాతానికిపైగా చిన్న, సన్నకారు రైతులే. వారి కుటుంబ అవసరాలు తీరగా, మిగిలిన కొద్ది మిగులు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరే అందడం లేదు. అందుకు ప్రధాన కారణం గ్రామాల్లో సంస్థాగత మార్కెట్లు అందుబాటు లేకపోవడమే. దీంతో గ్రామీణ మార్కెట్లు రైతులకు చేరువ అవ్వచ్చు. ఆహారశుద్ధి రంగానికి, మంత్రిత్వ శాఖు రూ.1400 కోట్లు ప్రకటించారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు క్షేత్రం నుంచి బయటపడ్డ తర్వాత 30 శాతం వరకు నష్టం జరుగుతుంది. దీనికితోడు 'విలువల జోడింపు' లేకపోవడంతో ధరలు రావడంలేదు. అందుకే వ్యవసాయక అగ్రగామి దేశాల్లో దాదాపు 80 శాతం వరకు వ్యవసాయ ఉత్పత్తులు ఆహారశుద్ధి చేయబడుతున్నా యి. కానీ దేశంలో మాత్రం మూడు శాతం ఉత్పత్తులు కూడా ప్రాసెస్ కావడం లేదు. ఇందుకు 42 మెగాఫుడ్ పార్కుల ఏర్పాటు ఆలోచన మరింత ఊతమిచ్చేదే. దేశంలో అపార పాడి వనరులున్నాయి. వీటిని గరిష్ఠంగా ఉపయోగించుకున్న ఆనవాళ్లు లేవు. పాడి, ఆక్వాకల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి నిధిగా పదివేల కోట్ల రూపాయలు కేటాయించడం మేలైనదే. మత్స్య, పాడి రైతులకు సైతం కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్న ఆలోచన మంచిదే. దేశంలో 40 శాతానికి పైగా చేస్తున్నది కౌలు రైతులే. వీరిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. అయితే వీరికి పంట రుణాలు అందటం లేదు. ఈ నేపథ్యంలో భూయాజమాన్యల హక్కు లు దెబ్బతినకుండా కౌలు రైతులకు సంస్థాగత రుణాలు అందేదిశగా నీతి ఆయోగ్, రాష్ట్రాలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాయన్న మాటలు ఆచరణలోకి వస్తే మేలు.

ఆకుపచ్చ బంగారంగా పేరొందిన వెదురును అటవీ ప్రాంతాల్లో వ్యక్తులు నరికి వాడుకునేందుకు అటవీ చట్టాలు అనుమతించవు. అయితే నూతనంగా అటవీయేతర ప్రాంతాల్లో, ప్రైవేటు సంస్థలలో రైతులు వెదురును వాణిజ్యంగా సాగు చేసుకునే వీలుండేలా చట్ట సవరణ జరిగింది. దీంతో గిరిజన గ్రామాలు, అడవుల దగ్గరి ప్రాంతాల్లో వెదురు సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చు. గుజ్జు, కాగితం పరిశ్రమల్లో వెదురుకు మంచి డిమాండ్ ఉన్నది. ఇందుకు బడ్జెట్‌లో రూ.1290 కోట్లు ప్రకటించడం నూతనంగా ఉన్నది.

వ్యవసాయం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం తరహాలో రైతుల రుణాలు మాఫీ కేంద్రం చేపట్టాల్సింది. చిన్న రైతుల సాగు దేశంలో ప్రత్యక్ష నగదు సహాయం అవసరం చాలా ఉంది. తెలంగాణ ఇప్పటికే 2018 వానకాలం నుంచి ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.8000 రైతులకు ఇవ్వనుంది. తద్వారా పెట్టుబడి భారం తగ్గించనున్నది. రాష్ట్రపతి ప్రసంగంలో కూడా ఈ పథకాన్ని అభినందించారు.

ఉద్యాన పంటలు దాదాపు అన్ని త్వరగా చెడిపోయే గుణం ఉన్నవి. ముఖ్యంగా టమాటా, ఉల్లి, ఆలుగడ్డలు సంవత్సరమంతా అవసరం ఉంటాయి. అయితే కాలాలు, సాగులో ప్రాంతీయ అసమానతల వల్ల ఉత్పత్తి సరఫరాలో తీవ్ర అంతరాయం వల్ల ధరలలో హెచ్చుతగ్గులు రైతులు, వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. వానకాలం, యాసంగిలో పై మూడు పంటల ఉత్పాదకత ఎక్కువగా ఉండి రైతులకు ఉత్పత్తి ఖర్చులు కూడా తిరిగిరావు. ఎండకాలంలో ఉత్పత్తి తగ్గి వినియోగదారులు ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తుంది. ఈ సమస్యను పరిష్కరించే దిశగా రూ. 500 కోట్లు ప్రకటించారు. అయితే గత ప్రభుత్వాల ధరల స్థిరీకరణ నిధి, మార్కెట్ జోక్యం నిధితో పంటల ధరల్లో వచ్చే తగ్గుదల నుంచి రైతులను, వినియోగదారులను ఆదుకునేవారు. ఆ రెండు నిధులను కలిపి 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో నూతనంగా ప్రకటించిన ట్లుంది తప్ప కొత్త పథకమేమీ కాదిది.

కేంద్రం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 8.5 లక్షల కోట్ల నుంచి, నేటికి 11 లక్షల కోట్ల రుణాలను సంస్థాగత రుణాలకుగాను కేటాయించారు. అయితే ఇప్పటివరకు కేటాయింపుల లక్ష్యంలో 80 శాతం మించి రుణాలు రైతులకు అందలేదు. ఇప్పటికీ రైతుల ఆత్మహత్యలలో ఎక్కువ శాతం అప్పుల ఊబిలో కూరుకపోవడం వల్లనే జరిగినవే. కేటాయింపు లు మొత్తం రైతులకు అందేలా బ్యాంకులకు కేంద్రం సరైన దిశానిర్దేశం చేయాలి.

సాగులో నీటి రంగానిది అత్యంత కీలక భూమిక. వర్షాధార ప్రాంతాల సాగుతో పోలిస్తే సాగునీటి ఆధారిత ఆయకట్టు ప్రాంతాల్లో దిగుబడులు రెండు, మూడింతలు ఉంటాయి. పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రాల్లో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం భారీగా సాయం చేస్తుందని ఆశించారు. అయితే కేవలం రూ.2600 కోట్లు ప్రకటించింది. 30 శాతం కంటే తక్కువ సాగునీటి సదుపాయం ఉన్న 96 అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ప్రతి పొలానికి సాగునీరు కల్పిస్తామన్నారు. ఈ నిధులు ఏ మూలకు రావన్నది నిజం. అలాగే పర్యావరణ మార్పుల వల్ల రైతు సరాసరి వార్షిక ఆదాయం 15-18 శాతం, వర్షాధార ప్రాంతాల్లో అయితే 20-25 శాతం వరకు నష్టం జరుగుతుంది. కాబట్టి పంటల బీమాపై ప్రత్యేక కార్యాచరణ అవసరమని ఆర్థికసర్వే చెబుతున్నది. అయితే అందుకుతగ్గ కేటాయింపులేవు. ఈసారి ప్రధాన మంత్రి పంటల బీమా కింద రూ.1300 కోట్లు కేటాయించారు. 9.8 కోట్ల హెక్టార్ల సాగుభూమిని బీమా చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఇదే మూలకు సరిపోవు. సూక్ష్మనీటి సేద్యానికి రూ.4000 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.3000 కోట్లు, పప్పు దినుసుల సేకరణకు రైతుల నుంచి గత బడ్జెట్‌లో రూ.3500 కోట్లుంటే ఈ బడ్జెట్‌లో రూ.2000 కోట్లకు కోతవేశారు. రూ.1500 కోట్లు కేటాయించారు. దశాబ్దాలుగా పప్పుదినుసులు సాగును దేశంలో నాశనం చేశాడు. దిగుమతులపై ఆధారపడి ఏటా దాదాపు రూ.80 వేల కోట్ల వరకు వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఇప్పటికి గత రెండేండ్ల ప్రోత్సాహంతో ఆయా పంటల విస్తీర్ణం పెరిగింది. సేకరణ లక్ష్యం మేరకు లేకపోవడంతో రైతులు మళ్లీ ఇతర పంటలకు మొగ్గుచూపుతున్నారు.

వ్యవసాయ ఉత్పాదకతకు ప్రధాన భూమిక అయిన సాగునీటికి నాబార్డ్ కార్పస్ ఫండ్‌ను ఇస్తామన్నారు. గత బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు ప్రకటించారు. ఈసారి పెద్దగా పెంచలేదు. ఇక్కడ తెలంగాణ రాష్ట్రమే గత బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 25 వేల కోట్ల రూపాయలకుపైగా కేటాయించింది. వ్యవసాయం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం తరహాలో రైతుల రుణాలు మాఫీ కేంద్రం చేపట్టాల్సింది. చిన్న రైతుల సాగు దేశంలో ప్రత్యక్ష నగదు సహాయం అవసరం చాలా ఉంది. తెలంగాణ ఇప్పటికే 2018 వానకాలం నుంచి ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.8000 రైతులకు ఇవ్వనుంది. తద్వారా పెట్టుబడి భారం తగ్గించనున్నది. రాష్ట్రపతి ప్రసంగంలో కూడా ఈ పథకాన్ని అభినందించారు. ప్రత్యేకమైన తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీతో వచ్చే ఐదేండ్లలో ఇరువై వేల కోట్ల రూపాయల పెట్టుబడితో లక్షా ఇరువై వేల ఉద్యోగాల కల్పన, గిట్టుబాటు ధరలు రైతులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే కేంద్రం తెలంగాణ ప్రారంభించిన ఇలాంటి పలు నూతన కార్యక్రమాలను మార్గదర్శకంగా తీసుకున్నట్టు కనిపిస్తున్నది.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

తెలంగాణకు పిసిరి-తనవాళ్ళకు కొసిరి

బడ్జెట్



డాక్టర్ బైరి నిరంజన్

కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గాంభీర్యంగా ప్రసంగం మొదలుపెట్టి, చమత్కారాలతో యూపీఏను ఇరుకునపెట్టారు. హాస్యాన్ని పండించి, వినసొంపైన కవితలు చెప్పారు. కనుల విందుగా విందును ఏర్పాటుచేసి.. వారి రాష్ట్రాలు బట్టి, పార్టీ ప్రభుత్వాలు బట్టి, వచ్చే ఎన్నికల ఓట్లు సీట్లను బట్టి అయినవారికి (రాష్ట్రాలు) నడి ఇస్తారులో పథకాల భోజనం పెట్టి కొసరికొసరి వడ్డించారు. కానివారికి (వారి ఎన్డీయే ప్రభుత్వం లేని, రాలేని రాష్ట్రాలు) కొస ఇస్తారిలో చాలీచాలని భోజనం వడ్డించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇది తగని రాజనీతి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఏ పథకమైనా వారి ఓట్లకు, సీట్లకు పెంపునకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దారు.

కేంద్ర ప్రభుత్వం రైతు, మహిళ, అభివృద్ధి, ఆరోగ్యరంగాలు ప్రధాన భూమికలుగా చేసుకొని మిషన్-2019 ఎలక్షన్ బడ్జెట్‌ను రూపొందించింది. కాని దీనివల్ల తెలంగాణ ప్రభుత్వానికి ఒనగూరే ప్రయోజనమేమీ లేదు. వారి ఏలికలో ఉన్న యూపీలోని మెట్రో ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు, ముంబై సబర్బన్ ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్లు, 150 కి.మీ. అదనపు సబర్బన్ కలిపే రైల్వే ట్రాక్ కోసం రూ.40 వేల కోట్లు ఇవ్వడానికి అంగీకరించి టోకెన్ ఎమౌంట్ కింద వెంటనే రూ.5 కోట్లు రిలీజ్ చేశారు. పక్కన ఉన్న బెంగళూరుకు రూ.17 వేల కోట్లను సబర్బన్ మెయిల్ ప్రాజెక్టుకు కేటాయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. కానీ హైదరాబాద్ 2వ దశ మెట్రో ప్రాజెక్ట్, ఎంఎంటీఎస్ రైల్వే ప్రాజెక్టులకు నయా పైసా కేటాయించకపోవడం, మోసం కిందికే వస్తుంది. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక నగరంగా, అంతర్జాతీయ నగరంగా పేరు సంపాదించుకుంటున్న హైదరాబాద్‌పై ఈ రకమైన వివక్ష తగదు.

ప్రజల ఆరోగ్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆలోచనలు చేసి కొత్త పథకాన్ని 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమం తీసుకోవడం మంచి పరిణామం. దీనివల్ల దేశంలో ప్రజలు తాము సంపాదించిన ప్రతి 100 రూపాయల్లో 6.5 రూపాయలు వారి ఆరోగ్యం మీద ఆ కుటుంబం ఖర్చు చేస్తున్నది. ఆ మొత్తం కలిసి ఆ కుటుంబానికి కలిసివస్తుంది. కానీ దీని అమలుకు బడ్జెట్ కేటాయింపులు అరకొరగా ఉండటం పలు అనుమానాలకు దారితీస్తున్నది. వాస్తవంగా తెలంగాణ, ఆంధ్రలో 2.45 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ ఉంటే సగటున ఏడాదికి 2 లక్షలు, 2.50 లక్షల పరిమితితో రూ.1800 కోట్లు ఆయా ప్రభుత్వాలు ఖర్చుచేస్తున్నాయి. దీని బ్లూప్రింట్‌గా చెప్పుకొంటున్న ఈ పథకం 5 లక్షల వరకు గరిష్ఠంగా పెంచి అమలుచేస్తామని చెప్పడం జరిగింది. దీనివల్ల పది వేల కోట్ల కుటుంబాలకు సరాసరి రూ.20 వేల కోట్లు అవసరమవుతాయి. దీనికి ప్రామాణికం, అర్హతలు గాని తెలియజేయలేదు. కేటాయింపు రూ.10 వేల కోట్లు ఇస్తానంటున్నారు. దీన్ని 40 శాతం రాష్ట్రాలు కూడా భరించాలని చెప్పడం, తెలంగాణకు పెద్దగా లాభంలేని పథకం. అలాగే మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాల ఏర్పాటుచేస్తామని చెప్పి, 24 కొత్తగా కళాశాలలను ఏర్పాటుచేస్తామని చెప్పి అందులో ఉత్తరప్రదేశ్‌కు 8 దవాఖానలు, వైద్య కళాశాలలుగా మార్చబోతున్నది. ఇది కూడా తెలంగాణకు నిరుపయోగమైన పథకం.

బడ్జెట్‌లో అతి ముఖ్యమైన ప్రధామంత్రి ఆవాస్ సడక్ యోజన కింద అందరికీ 2022 సంవత్సరం వరకు ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. బడ్జెట్లో 51 లక్షల ఇండ్లను ఏర్పాటుచేస్తామనడం వారి గమ్యాన్ని దూరం చేసింది. దేశంలో దాదాపు 3.60 కోట్ల కుటుంబాలకు సొంత ఇండ్లు కూడా లేవు. మరీ ముఖ్యంగా ఇందులో 70 శాతం ప్రజలు గ్రామం నుంచి పట్టణానికి వలస వచ్చినవారే ఇండ్లు లేనివారుగా ఉన్నారు. వారు ముఖ్యంగా మెట్రోపాలిటన్ సిటీలో ఉండటం గమనార్హం. వీటికి పరిష్కారమార్గంగా తెలంగాణ ముఖ్యమంత్రి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి గౌరవప్రదంగా ఉండేలా ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి కేంద్రం తర్ఫీదు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నది. గత రెండేండ్లలో 30.76 లక్షలలో ఇండ్లు నిర్మిస్తామని చెప్పి మొత్తం దేశంలో 1,57,106 ఇండ్లు నిర్మిస్తే అందులో ఒక్క గుజరాత్‌లోనే (పీఎంజీఎంవీ) కింద గత సంవత్సరం 37,135 ఇండ్ల నిర్మాణం చేసింది. ఈ లెక్కన 2032 వరకు కూడా అందరికి ఇండ్లు సాధ్యం కాదు.

బడ్జెట్‌లో అతి ముఖ్యమైన ప్రధామంత్రి ఆవాస్ సడక్ యోజన కింద అందరికీ 2022 సంవత్సరం వరకు ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. బడ్జెట్లో 51 లక్షల ఇండ్లను ఏర్పాటుచేస్తామనడం వారి గమ్యాన్ని దూరం చేసింది. దేశంలో దాదాపు 3.60 కోట్ల కుటుంబాలకు సొంత ఇండ్లు కూడా లేవు.

రూ.77,500 కోట్లు తాగునీటి ప్రాజెక్టుల కోసం కేటాయించిన విత్తమంత్రి ప్రపంచానికి ఆదర్శంగా అద్భుతమైన సమాచార సాంకేతికను జోడించి ఇంటింటికీ తాగునీరు పథకం మిషన్ భగీరథకు కేటాయింపులు చేయకపోవడం శోచనీయం. తమిళనాడుకు కూడా ఈ బడ్జెట్ ద్వారా సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల కింద ఏర్పాటైన పరిశ్రమలకు 25 శాతం వరకు టాక్స్ తక్కువచేయడం చర్మ, వస్త్ర పరిశ్రమలున్న తమిళనాడుకు పరిశ్రమలు వెల్లువెత్తుతాయి. అదే సందర్భంలో కొత్తగా వరంగల్‌లో ఏర్పాటుచేయబోయే టెక్స్‌టైల్ ఏర్పాటు గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరమైన విషయం. భారత మాల కింద ఆ రాష్ట్రానికి యన్‌హెచ్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకం కింద 5 హైకాస్ట్ ప్రాజెక్టులు ఈ రాష్ట్రా నికి రావడం అందులో భాగంగా ఫేజ్-1 కింద 800 కి.మీ. నిర్మాణాలు ఉండటం ఈ రాష్ట్రానికి ఎంతో ఉపయుక్తం. తెలంగాణ రాష్ట్రానికి ఫేజ్-1 కింద 373 కిలోమీటర్ల 5 జాతీయ రహదారులకు 4 వరుసలు కేటాయిం చడం ఆహ్వానించదగ్గపరిణామం. రైల్వేలలో తెలంగాణకు అన్యాయం ఆగలేని ప్రక్రియ. కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీ కల కలగానే ఉన్నది. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు నిరాశ కలిగిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచం ఆశ్చర్యపడేలా నిర్మిస్తున్న కేంద్రానికి చూపు మాత్రం మందగించడం శోచనీయం.

(వ్యాసకర్త: కేయూ వ్యాపార, వాణిజ్య అధ్యాపకులు)

జనగళం

ఆందోళనలో ప్రజలు

పట్టణ, నగరవాసుల ప్రశాంతమైన జీవితాల మధ్య తరచూ 'కార్డన్‌సెర్చ్'లు నిర్వహించడం పోలీసులకు ఆటవిడుపులా తయారైంది. ఉగ్రవాదులు, నేరస్థులు ఉన్నట్లు పక్కా సమాచారం ఉంటే నిర్వహించాల్సిన 'కార్డన్‌సెర్చ్'ను పోలీసులు తరచూ నిర్వహిస్తూ స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అర్ధరాత్రివేళ సరైన పత్రాలు లేవని వాహనాలను సీజ్ చేయడం, ఇండ్లల్లో సోదా చేయడం, మహిళలను కూడా ప్రశ్నలతో వేధించటం లాంటివాటితో ప్రజలు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఈ విషయమై దృష్టిసారించి వీటి నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలి.

- కె.శారద, కరీంనగర్

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చెయ్యాలె

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తప్పక ఉండాలి. కొన్ని మండలాల్లో ఇప్పటికీ జూనియర్ కళాశాలలు లేకపోవడం విషాదం. దీంతో ప్రైవేట్ కళాశాలలు పుట్ట గొడుగుల్లా విస్తరిస్తున్నాయి. కొందరైతే ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు కట్టలేక చదువుకు దూరమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. ఇందులో భాగంగానే ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మంచి పరిణామం

రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం. ప్రోత్సాహం ఇచ్చి మరీ ఇంకుడు గుంతల నిర్మాణానికి పూనుకోవడం మంచి పరిణామం. పల్లపు ప్రాంతాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు వల్ల నీరు వృథా కాదు. నగర వ్యాప్తంగా పల్లపు ప్రాంతాలను గుర్తించి విరివిగా ఇంకుడు గుంతలను తవ్వాలి.

- వీర పూర్ణచందర్‌రావు, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

బీహార్ మావోయిస్టు నేత ఆస్తుల జప్తు

- 5 ఇండ్లస్థలాలు, రూ.86 కోట్లు స్వాధీనం చేసుకున్న ఈడీ
- హవాలా నిరోధక చట్టం కింద మావోయిస్టులపై తొలి కేసు



న్యూఢిల్లీ : బీహార్ మావోయిస్టు నేత సందీప్ యాదవ్ అలియాస్ బడ్కా భయ్యా, ఆయన కుటుంబానికి చెందిన రూ.86 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. మావోయిస్టుల ఆస్తులపై హవాలా లావాదేవీల నిరోధక చట్టాలను అమలు చేయడం ఇదే మొదటిసారి. బీహార్ – జార్ఖండ్ జోన్ మావోయిస్టు ఇన్‌చార్జిగా సందీప్ యాదవ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని ఈడీ సోమవారం తెలిపింది. బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో ఆయన భార్య రాజంతీదేవి పేరిట మూడు ఇండ్లస్థలాలు, గయలో రెండు ఇండ్ల స్థలాలు, ఢిల్లీలోని ద్వారక ఏరియాలో సందీప్ యాదవ్ తన అల్లుడి కోసం ఫ్లాట్ కొనుగోలు కోసం చెల్లించిన అడ్వాన్స్ రూ.10.43 లక్షలు జప్తు చేశామని ఈడీ వివరించింది. కొన్ని వాహనాలు, కుటుంబసభ్యుల ఖాతాల్లోని రూ.1.5కోట్లను జప్తు చేసినట్లు తెలిపింది. సందీప్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులపై వందకు పైగా ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు నమోదై ఉన్నాయని పేర్కొన్నది.

గుర్రానికి 2 కోట్లు ఇస్తానన్న సల్మాన్‌ఖాన్

అమ్మేందుకు నిరాకరించిన యజమాని



అహ్మదాబాద్: అంత డబ్బు ఇస్తామంటే ఎవరైనా సరే తిరస్కరించేందుకు ఇష్టపడరు. కానీ, ఓ గుర్రం కోసం రెండు కోట్లు ఇస్తామంటూ వచ్చిన ఆఫర్లను దాని యజమాని తిరస్కరించారు. కారణం.. అదో అరుదైన సంకరజాతి గుర్రం. పేరు సఖబ్. అలాంటి గుర్రం దేశంలో మరెక్కడా లేదు. ప్రపంచంలోనే ఇలాంటి జాతిఅశ్వాలు మూడే మూడు ఉన్నాయట. ప్రస్తుతం అమెరికాలో ఒకటి, కెనడాలో మరొకటి ఉండగా, మూడోది గుజరాత్ వాసి సిరాజ్ పఠాన్ వద్ద ఉంది. దీన్ని సొంతం చేసుకునేందుకు చాలామంది ప్రయత్నించారు. సాక్షాత్ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ దీన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారంటే దీని ప్రాధాన్యం ఏంటో అర్థమవుతున్నది. ఓ మధ్యవర్తి ద్వారా సల్మాన్‌ఖాన్ ఆఫర్ చేసిన రూ.2 కోట్లను యజమాని తిరస్కరించారు. సఖబ్ గంటకు 43 కిలో మీటర్ల వేగంతో పరిగెత్తుతుంది. రైడర్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఒకే స్థిర వేగంతో దూసుకెళ్లడం దీని ప్రత్యేకత. సఖబ్ తల్లి పాకిస్థాన్ సింధి రకానికి చెందిన గుర్రం కాగా, తండ్రి రాజస్థాన్‌కు చెందిన సుతార్వలి రకం. సఖబ్ ఐదేండ్ల వయసున్నప్పుడు సిరాజ్ పఠాన్ రూ.14.5లక్షలకు పలోత్రా మార్కెట్‌లో దీన్ని కొనుగోలు చేశాడు. సఖబ్ అంటే మహ్మద్ ప్రవక్త గుర్రం అని అర్థం. గతంలో పంజాబ్‌కు చెందిన బాదల్ వంశస్థులు రూ1.11కోట్లు ఇస్తామని అడిగినా సిరాజ్‌పఠాన్ అమ్మలేదు. ఇప్పుడు సల్మాన్‌ఖాన్ ఆసక్తి చూపినా ఆయన తిరస్కరించారు.

మన నక్షత్ర మండలానికి ఆవల

మరిన్ని గ్రహాలు



వాషింగ్టన్: మన పాలపుంత నక్షత్రమండలానికి ఆవల గ్రహాల సమూహం ఉన్నట్టు ఖగోళ శాస్త్రవేత్తలు మొదటిసారిగా కనుగొన్నారు. అమెరికాలోని ఓక్లహామా యూనివర్సిటీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ జిన్యు డాయ్, ఎడ్వర్డో గువెర్రాస్‌లు నాసాలోని చంద్రా ఎక్స్‌రే అబ్జర్వేటరీ నుంచి ఈ గ్రహాలను గుర్తించారు. ఒక్కో గ్రహం చంద్రుడి నుంచి గురుగ్రహం వరకు వేర్వేరు పరిమాణాల్లో ఉన్నట్టు వారు తెలిపారు. మన పాలపుంతకు ఆవల గ్రహాలను కనుగొనడం ఇదే మొదటిసారి అని డాయ్ తెలిపారు. ఈ కొత్త నక్షత్రమండలం 380 కోట్ల కాంతి సంవత్సరాలకు అవతల ఉందని, అక్కడి గ్రహాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఎంతమాత్రం లేదని ఆయన పేర్కొన్నారు.

రూ.280 కోట్ల మోసం కేసులో

వజ్రాల వ్యాపారిపై సీబీఐ కేసు



నీరవ్ మోదీ

ఢిల్లీ: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై చీటింగ్ కేసు నమోదైంది. నేరపూరిత కుట్రగా సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రూ.280 కోట్ల రుణం చెల్లించకుండా నీరవ్ సహా ఆయన భార్య, సోదరుడు, మరో భాగస్వామి తప్పించుకు తిరుగుతున్నారని పంజాబ్ నేషనల్ బ్యాంకు తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నీరవ్ సహా నలుగురిపై నేరపూరిత కుట్రతో పాటు చీటింగ్, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదు చేసింది. నకిలీ 'లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్'తో పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని కాజేశారని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఇటీవలే నీరవ్ ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు కూడా జరిపారు. నీరవ్ స్థాపించిన 'ఫైర్ స్టార్ డైమండ్ జ్యుయెలరీ డిజైనింగ్ సంస్థ'లో విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు కస్టమర్లుగా ఉన్నారు.

ఐదు నెలల్లో ఐదు ప్రయోగాలు

జూన్‌లోగా కక్ష్యలోకి చంద్రయాన్-2.. ఇస్రో చైర్మన్ శివన్ వెల్లడి



హైదరాబాద్: వచ్చే ఐదు నెలల్లో చంద్రయాన్-2 సహా ఐదు అంతరిక్ష ప్రయోగాలు జరుపనున్నామని ఇస్రో చైర్మన్ కే శివన్ తెలిపారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 వాహక నౌకద్వారా జీఎస్ఏటీ-6ఏ, జీఎస్ఎల్‌వీ-ఎంకే3 ద్వారా చంద్రయాన్-2ను, పీఎస్ఎల్‌వీ ద్వారా నావిగేషన్‌కు ఉపయోగించే ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఐ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నట్టు చెప్పారు. చంద్రయాన్-2ను జూన్‌లోగా ప్రయోగిస్తామన్నారు. 5.7 టన్నుల బరువుండే జీఎస్ఏటీ-11 ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ గయానా నుంచి ప్రయోగిస్తామన్నారు. భారత్‌కు 4 టన్నుల బరువున్న ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపే సామర్థ్యం ఉన్నదన్నారు. భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకుని విదేశాల నుంచి ప్రయోగించే అవసరాన్ని క్రమంగా తప్పిస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి ఏటా 15-18 ప్రయోగాలు జరిపేలా లక్ష్యం విధించుకున్నామన్నారు. తక్కువ సైజు న్న ఉపగ్రహాలను ప్రయోగించేందుకు వీలుగా చిన్న రాకెట్ల తయారీపై దృష్టిసారించామన్నారు. తద్వారా ఖర్చు తగ్గుతుందని, ఇంధనం ఆదా అవుతుందన్నారు.

అన్నాడీఎంకే కార్యకర్తలకే సంక్షేమపథకాలు!

తమిళనాడు మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



మదురై/ చెన్నై: అన్నాడీఎంకే పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందుతాయని తమిళనాడు మంత్రి సెల్లూర్ కే రాజు వివాదాస్పదవ్యాఖ్యపై దుమారం రేగింది. ప్రభుత్వ పథకాలను ఒక్క పార్టీ వారికే వర్తింపజేస్తారా? అని విమర్శలు రావడంతో మంత్రి వెనుకకు తగ్గారు. ఆ కార్డు తీసుకుంటేనే వారి కు టుంబంలోని వారికి సంక్షేమపథకాలు అందుతాయన్నట్లు వార్తలు వచ్చాయి. తానలా అనలేదని, తన వ్యాఖ్యలపై తప్పుడు ప్రచారం జరుగుతున్నదని సోమవారం చెప్పారు. పార్టీలకతీతంగానే పథకాలు వర్తింపజేస్తామని డిప్యూటీ పన్నీర్ సెల్వం, మరో మంత్రి జయకుమార్ కూడా చెప్పారు.

సీపీఎం నేత కుమారుడిపై దుబాయి నిషేధం

- రూ.13 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు

తిరువనంతపురం: వరుస వివాదాలతో వార్తలకెక్కుతున్న కేరళ సీపీఎంను మరో వివాదం చుట్టుముట్టింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ కుమారుడు బినయ్‌పై దుబాయి ప్రభుత్వం ప్రయాణ నిషేధం విధించింది. పాస్‌పోర్ట్‌ను తక్షణమే అధికారులకు సమర్పించాలని బినయ్‌ని ఆదేశించింది. రూ.13 కోట్ల మేర ఆర్థిక మోసానికి పాల్పిడినట్లు బినయ్‌పై ఆరోపణలున్నాయి. వ్యాపారాభివృద్ధికి ఓ టూరిజం కంపెనీ నుంచి తీసుకున్న రుణ చెల్లింపులకు బినయ్ ఇచ్చిన చెక్కులు చెల్లకుండా పోయాయి. సదరు కంపెనీ బినయ్‌పై స్థానిక కోర్టులో సివిల్ కేసు నమోదు చేసింది.ఈ వార్తలను బినయ్ సోదరుడు బినీష్ ధ్రువీకరించారు. రుణం చెల్లించకూడదని తామేమీ భావించడం లేదని, ఈ అంశాన్ని రాజకీయం చేయాలని కొన్ని స్వార్థశక్తులు ఎదురుచూస్తున్నాయన్నారు.

10,11 తేదీల్లో మోదీ యూఏఈ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 10, 11 తేదీల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించేందుకు రంగం సిద్ధమైంది. యూఏఈతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి భారత్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నది. తద్వారా రెండు దేశాల మధ్య ఆర్థిక, భద్రత, దౌత్య రంగాల్లో పరస్పర సహకారం పెంపొందించుకునేందుకు వీలవుతుంది. ఇంతకుముందు మోదీ 2015 ఆగస్టులో తొలిసారి ఈ దేశంలో పర్యటించారు. తాజా పర్యటనలోదుబాయిలో జరిగే ఆరవ ప్రపంచ ప్రభుత్వ సదస్సులో మోదీ ప్రసంగిస్తారు. దుబాయిలోని ఒపెరా హౌస్‌లో భారత సంతతి పౌరులను ఉద్దేశించి మాట్లాడతారు.

2019లో మళ్లీ ఎన్డీయేదే అధికారం: నితీశ్



పాట్నా: రాజస్థాన్ ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ ఓటమి పాలైనా, ఆ పార్టీ సారథ్యంలోని ఎన్డీయేకు 2019 ఎన్నికల్లో వచ్చిన ముప్పేమీ లేదని బీహార్ సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2009 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ – జేడీయూ కూటమి ఓడినా 2010 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన సంగతిని గుర్తు చేశారు.

ముస్లింల తిరంగా యాత్రకు అనుమతి నిరాకరణ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో సామాజిక కార్యకర్త షబానా ఖండేల్‌వాల్ నేతృత్వంలో వందల మంది ముస్లింల తిరంగా యాత్రకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించేందుకు జాతీయ జెండాతో వందల మంది ముస్లింలు 'హిందుస్థాన్ జిందాబాద్' అనే నినాదాలతో ర్యాలీ చేపట్టేందుకు యత్నించారు. ప్రదర్శనకు అనుమతి లేకపోవడంతో అమరవీరుల స్తూపం వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు.

దేవత విగ్రహానికి చుడిదార్‌తో అలంకరణ

ఇద్దరు పూజారుల సస్పెన్షన్

నాగపట్నం: ఆగమ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రధాన దేవత విగ్రహాన్ని చుడిదార్‌తో అలంకరించిన ఇద్దరు పూజారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. తమిళనాడులోని నాగపట్నం జిల్లాలో మయిలాడుతురై దేవాలయంలో ఇటీవల ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమిళ నెల థాయ్‌లో శుభప్రదమైన ఫిబ్రవరి రెండున అమ్మవారికి ఓ పూజారి గంధాలంకరణ నిర్వహించారు. అంతకుముందు మరో ప్రత్యేకమైన రోజున (జనవరి 26) మరో పూజారి గుడిలోని ప్రధాన దేవత విగ్రహాన్ని చుడిదార్‌తో అలంకరించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఆగమశాస్త్రం ప్రకారం కేవలం చీరెలతోనే అమ్మవారి విగ్రహాన్ని అలంకరించాలన్నారు. తిరువావదుతురై ఆధీనంలోని మఠం అధిపతి అంబలవన దేసిగ పరమాచార్య స్వామిగల్ సోమవారం ఆ ఇద్దరు పూజారులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్

పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: నీతిఆయోగ్ ప్రధాన కార్యనిర్వహణాధికారి అమితాబ్‌కాంత్ పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 2016 ఫిబ్రవరి 17న సీఈవోగా నియమితులైన అమితాబ్‌కాంత్ పదవీకాలం ఈ నెల 17తో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని 2019, జూన్ 30 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అంగీకారం తెలిపింది.


మాటల్లో కాదు చేతల్లో చూపుతాం

పాక్ కాల్పులపై భారత సైన్యం స్పందన

సైన్యం శౌర్యంపై నమ్మకముంది: రాజ్‌నాథ్

శాంతి ప్రక్రియను కొనసాగించాలి: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ

కవ్వింపులు లేకుండా భారత్ కాల్పులు జరుపుతున్నదన్న పాక్



ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్ శరత్‌చంద్

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్ ఫిబ్రవరి 5:

నలుగురు సైనికులను పొట్టనబెట్టుకున్న పాకిస్థాన్‌కు సరైన రీతిలో జవాబు చెప్తామని భారత సైన్యం పేర్కొంది. తమ ప్రతీకారాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపుతామని సైనిక సిబ్బంది వైస్ చీఫ్ శరత్‌చంద్ పేర్కొన్నారు. ఢిల్లీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉగ్రవాదుల చొరబాట్లకు పాక్ సైన్యం సహకరిస్తున్నదని చెప్పారు. పాకిస్థాన్‌కు దీటైన జవాబు చెప్పడం కొనసాగిస్తామని అన్నారు. జమ్ముకశ్మీర్‌లోని రాజోరి సెక్టార్‌లో పాకిస్థాన్ ఆదివారం విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఓ ఆర్మీ కెప్టెన్, ముగ్గురు జవాన్లు మృతి చెందారు. పాకిస్థాన్ జరుపుతున్న సీమాంతర కాల్పులను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఖండించారు. తమ సైన్యం శౌర్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, పొరుగుదేశానికి సరైన జవాబునివ్వగలదని అన్నారు. పాక్ చర్యలను క్షమించబోమని హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ ఆహిర్ అన్నారు. పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కాల్పుల విరమణను పునరుద్ధరించాలి

భారత్, పాక్ మధ్య శాంతి, సయోధ్య ప్రక్రియను పునరుద్ధరించాలని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం కోరింది. పాకిస్థాన్ పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న అంశం ఆ రాష్ట్ర అసెంబ్లీని కుదిపేసింది. ఉభయ దేశాలు 2003 నాటి కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి ప్రతిపక్ష నేషనల్ కాన్ఫరెన్స్ కూడా మద్దతు తెలిపింది. పాక్ కాల్పులను ఖండిస్తూ ఒక తీర్మానం చేయాలని బీజేపీ సభ్యుడు రవీందర్ రైనా పట్టుబట్టారు. అయితే జమ్ముకశ్మీర్‌లో శాశ్వతంగా శాంతిని నెలకొల్పేందుకు భారత్, పాక్ చర్చలు జరుపాలని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి అబ్దుల్ రెహమాన్ వీరి ఒక ప్రకటన చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ప్రారంభించిన శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. పీడీపీ ఎమ్మెల్యే జావేద్ బేగ్ మాట్లాడుతూ, పాకిస్థాన్‌ను రెచ్చగొట్టడానికి బదులుగా సమస్యల పరిష్కారానికి ఉభయ దేశాలు చర్చలు ప్రారంభించాలని సభ విజ్ఞప్తి చేయాలని సూచించారు. నియంత్రణ రేఖ (ఎల్వోసీ), అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వద్ద కాల్పుల విరమణ పాటించాలని భారత్, పాక్‌లు 2003లో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండాలని ప్రతిపక్ష నాయకుడు ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు.

భారత్‌కు పాక్ నిరసన

భారత సైన్యం కవ్వింపులేవీ లేకుండానే తమపై కాల్పులు జరుపుతున్నదని పాకిస్థాన్ ఆరోపించింది. ఇస్లామాబాద్‌లోని భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీ సింగ్‌ను తన కార్యాలయానికి పిలిపించుకున్న పాక్ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ ఫైజల్ భారత సైన్యం కాల్పులను ఖండిస్తున్నట్టు తెలిపారు. దక్షిణాసియా, సార్క్ దేశాల వ్యవహారాలు చూస్తున్న ఫైజల్ మీడియాతో మాట్లాడుతూ, భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతి చెందారని, నలుగురు గాయపడ్డారని చెప్పారు. భారత్ కాల్పుల్లో ఈ ఏడాది ఇప్పటివరకు 13 మంది పౌరులు మరణించారని చెప్పారు.

కశ్మీర్ సమస్య పరిష్కారంతోనే లోయలో శాంతి

కశ్మీర్ సమస్యను పరిష్కరించకుండా లోయలో శాంతి, సుసంపన్నత సాధ్యం కాదని పాకిస్థాన్ పేర్కొంది. కశ్మీర్ సంఘీభావ దినాన్ని పురస్కరించుకుని పాక్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్, ప్రధానమంత్రి షాహిద్ ఖఖాన్ అబ్బాసీ పంపిన వేర్వేరు సందేశాల్లో ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. స్వయం ప్రతిపత్తి కోసం పోరాడుతున్న కశ్మీర్ ప్రజానీకానికి తమ మద్దతు కొనసాగుతుందని వారు తెలిపారు.



సోమవారం ఢిల్లీకి చేరిన కెప్టెన్ కపిల్ కుందూ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రక్షణమంత్రి నిర్మల సీతారామన్

జీవితం గొప్పగా ఉండాలి.. సుదీర్ఘంగా కాదు!

ఫేస్‌బుక్ పేజీపై రాసుకున్న కెప్టెన్ కపిల్ కుందూ




తల్లి, సోదరితో కెప్టెన్ కపిల్ కుందూ

కొద్దికాలమైనా సరే జీవితాన్ని పరిపూర్ణంగా జీవించాలని నమ్మే కెప్టెన్ కపిల్ కుందూ తన ఫేస్‌బుక్ పేజీపై 'జీవితం గొప్పగా ఉండాలి.. సుదీర్ఘంగా కాదు' అని రాసుకున్నారు. యాదృచ్ఛికమో, విధి నిర్ణయమో.. నిన్నటితరం సూపర్‌హిట్ హిందీ సినిమా 'ఆనంద్'లోని ఆ డైలాగ్ కెప్టెన్ కపిల్ విషయంలో నిజమైంది. అతి చిన్న వయస్సులో సైన్యంలో కెప్టెన్ హోదాకు ఎదిగిన కపిల్ దేశం కోసం ప్రాణాలర్పించి చిరస్మరణీయునిగా నిలిచిపోయారు. మరో ఐదు రోజుల్లో 23వ పుట్టినరోజు జరుపుకోనున్న కెప్టెన్ కపిల్ పాక్ సైన్యం తీసిన దొంగ దెబ్బతో అసువులు బాశాడు. రాజోరి జిల్లా భీంబర్‌గలి సెక్టార్‌లో ఆదివారం పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో కెప్టెన్ కపిల్ మరో ముగ్గురు సైనికులు మరణించారు. పుట్టినరోజు జరుపుకొనేందుకు ఇంటికి వస్తానని, అమ్మ ముందు ఆకస్మికంగా ప్రత్యక్షం కావాలనుకుంటున్నందున తన రాకను రహస్యంగా ఉంచాలని ఇటీవలే తన చెల్లెళ్లకు కపిల్ ఓ లేఖ రాశాడు. కానీ అది సాకారం కాకముందే ఆయన అమరులయ్యారు. తన కుమారునికి సాహసోపేతమైన జీవితం ఇష్టమని, ఏదైనా సృజనాత్మకంగా చేసేవాడని కపిల్ తల్లి చెప్పారు. కుందూ మరణవార్తతో ఆయన స్వస్థలమైన హర్యానాలోని గురుగ్రాం జిల్లా రన్‌సికా గ్రామం చిన్నబోయింది. సోమవారం ఉదయం కుందూ ఇంటి వద్ద గుమిగూడిన గ్రామస్తులు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్థాన్‌ను దెబ్బకు దెబ్బతీయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చాయ్‌వాలా కొడుకు పీఎం అయినప్పుడు

పకోడీవాలాకు ఆకాశమే హద్దు!

జీఎస్టీ గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అయితే.. చెల్లించేవారంతా బందిపోట్లా? ■ రాజ్యసభలో అమిత్‌షా తొలి ప్రసంగం; కాంగ్రెస్‌పై విమర్శలు



రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్‌షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రాజ్యసభలో తన తొలి ప్రసంగంలోనే బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ అమిత్‌షా కాంగ్రెస్‌పై ఘాటైన విమర్శలు చేశారు. ఆ పార్టీ సాగించింది '55 ఏండ్ల తప్పుడు పాలన' అని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వ మూడున్నరేండ్ల పాలనపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా రాజ్యసభలో సోమవారం అమిత్‌షా మాట్లాడారు. గంటన్నరపాటు సాగిన తన ప్రసంగంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఆయన ఎత్తిచూపారు. పేదలు పకోడీలు అమ్ముకుని బతకాలా? అన్న చిదంబరం విమర్శలను తిప్పికొడుతూనే నిరుద్యోగిగా ఉండడం కంటే పకోడీలు అమ్మడం మంచిదేనన్నారు. 'ఏ ఉపాధీ లేకుండా ఉండడం కన్నా పకోడీలు అమ్ముకుని జీవనం సాగించడం మంచిదే. నిరుద్యోగులను బిచ్చగాళ్లతో పోల్చడం కన్నా పకోడీలు తయారు చేయడం సిగ్గుచేటైన విషయమేమీ కాదు. చాయ్‌వాలా కొడుకు ఈ దేశానికి ప్రధాని కాగలిగినప్పుడు, పకోడీవాలాకు అకాశమే హద్దు' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి రాకముందు దేశం పరిస్థితి ఎలా ఉందో గుర్తుచేసుకోవాలని, గత ప్రభుత్వాల వైఫల్యాలకు లెక్కేలేదన్నారు. వివిధ కుంభకోణాల్లో రూ.12లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కావడం నాటి ప్రభుత్వ విధానాలపై అనేక ప్రశ్నల్ని లేవనెత్తిందన్నారు. మూడున్నరేండ్లలో పరిస్థితిని సమూలంగా మార్చగలిగామని షా చెప్పారు. 'ఒకే దేశం, ఒకే పన్ను' అన్న కలను సాకారం చేసిన జీఎస్టీని అతిపెద్ద ఆర్థిక సంస్కరణగా పేర్కొన్నారు. జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ అభివర్ణించడాన్ని అమిత్‌షా తప్పుపట్టారు. 'గబ్బర్‌సింగ్.. షోలే సినిమాలో బందిపోటు. జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అంటే, చట్టబద్ధంగా పన్ను చెల్లిస్తున్న కోట్లాదిమంది ప్రజల్ని మీరు బందిపోట్లుగా భావిస్తున్నారా?' అని ఆయన ప్రశ్నించారు. తాము ప్రజలకు ఇష్టమైన నిర్ణయాలను తీసుకోవడం లేదని, దేశానికి అవసరమైన నిర్ణయాలను మాత్రమే తాము తీసుకుంటున్నామని చెప్పారు.

మోదీ సర్కార్ నేమ్‌చేంజర్ మాత్రమే : ఆజాద్

కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం చేపట్టిన పథకాల పేర్లు మార్చడం తప్ప.. ప్రధాని మోదీ చేసిందేమీ లేదని రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ గులాం నబీ ఆజాద్ విమర్శించారు. మోదీ సర్కార్ గేమ్ చేంజర్ కాదని కేవలం నేమ్ చేంజర్ అని ఎద్దేవా చేశారు.

బీటీ పత్తి ఉత్పత్తి రెట్టింపైంది: కేంద్రం

2002నాటికి, ఇప్పటికీ బీటీ విత్తనాల కారణంగా పత్తి దిగుబడి రెట్టింపైందని, 158 లక్షల బేళ్ల నుంచి 351 లక్షల బేళ్లకు పెరిగిందని కేంద్రమంత్రి మహేశ్ శర్మ రాజ్యసభలో తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం కింద గతేడాది రాష్ట్రాలకు రూ. 51,600 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి రాంకృపాల్ యాదవ్ తెలిపారు. మరోవైపు లోక్‌సభలో సోమవారం నూతన ఎంపీలు కరణ్‌సింగ్ యాదవ్, రఘుశర్మ, సజ్జాద్ అహ్మద్ ప్రమాణస్వీకారం చేశారు.

నైతికత మీ జాగీరు కాదు!

- సమాజ నైతిక విలువల పరిరక్షణ మీ పనికాదు
- వయోజనుల పెండ్లిళ్లలో తలదూర్చొద్దు..
- ఖాప్ పంచాయత్‌లకు సుప్రీంకోర్టు హెచ్చరిక



న్యూఢిల్లీ: ఖాప్ పంచాయత్‌లు సమాజ నైతిక విలువలకు పరిరక్షకులుగా వ్యవహరించొద్దని సుప్రీంకోర్టు హెచ్చరించింది. పెండ్లి ఇద్దరు వయోజనులకు సంబంధించిన అంశమని, దానిని చట్టం చూసుకుంటుందని స్పష్టంచేసింది. ఖాప్ పంచాయత్‌ల జోక్యాన్ని నివారించేందుకు సీనియర్ పోలీస్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తెలిపింది. 'ఓ పెండ్లిని అనుమతించాలా లేక రద్దు చేయాలా అన్నది చట్టం చూసుకుంటుంది. మీరు నైతికతకు టేకేదార్లుగా వ్యవహరించకండి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఖాప్ పంచాయత్‌లు కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నాయని వాటి తరపు న్యాయవాది తెలుపగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

అధికారులు విపత్తు కోసం ఎదురుచూస్తున్నారు

ఢిల్లీ అభివృద్ధి సంస్థ (డీడీఏ) అధికారులు ఏదో విపత్తు సంభవించాలని ఎదురుచూస్తున్నట్టుగా ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీ మాస్టర్ ప్లాన్ 2021కు తాము చేసిన ప్రతిపాదనలను ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించింది. ఉపహార్ అగ్నిప్రమాదం, బావనా, కమలా మిల్స్ ఘటనలు జరిగినా ఎటువంటి గుణపాఠం నేర్చుకోలేదని మండిపడింది. మాస్టర్ ప్లాన్‌లో మార్పుల ప్రతిపాదలపై రెండు వారాల్లోగా అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఆదేశించింది.

మాల్దీవుల్లో ఎమర్జెన్సీ

సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన దేశాధ్యక్షుడు



అబ్దుల్లా యమీన్

మాలే: మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. దేశంలో 15 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ సోమవారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదురవుతున్నా, సుప్రీంకోర్టు ఆదేశించినా రాజకీయ ఖైదీలను విడుదల చేసేందుకు అధ్యక్షుడు అబ్దుల్లా నిరాకరించారు. పైగా తీర్పును తిరుగరాయాలని సుప్రీం కోర్టు జడ్జీలకు మూడు లేఖలు రాశారు. లేఖలు పంపిన వెంటనే దేశంలో ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. మాల్దీవుల్లో యమీన్ ఎమర్జెన్సీని విధించడం ఇది రెండోసారి. తనపై హత్యాప్రయత్నం జరిగినప్పుడు 2015లో కూడా ఆయన ఎమర్జెన్సీ విధించారు. ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని అధ్యక్షుడు రెండు రోజుల్లో పార్లమెంట్‌కు తెలియజేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అయితే పార్లమెంట్‌పై ఇప్పటికే నిరవధిక సస్పెన్షన్ విధించారు. యమీన్‌పై తిరుగుబాటు చేసిన 12మంది ఎంపీల నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో దేశంలో రాజకీయ సంక్షోభానికి తెరలేచింది. రెబల్ ఎంపీలు ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపితే తన అభిశంసనకు అవసరమైన మెజారిటీ వారికి లభిస్తుందన్న భయంతోనే యమీన్ తీర్పును నిరాకరిస్తున్నట్టు తెలుస్తున్నది. మాల్దీవులకు వెళ్లవద్దని భారత ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది.

ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పరీక్షల్లో

స్మార్ట్ వాచ్‌లపై నిషేధం

కోల్‌కతా: ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి స్మార్ట్, డిజిటల్ గడియారాలు ధరించి రాకూడదని కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తమ ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్ని పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు సర్క్యులర్ జారీ చేసింది.

రయాన్ స్కూల్ కేసులో

చార్జిషీట్ దాఖలు

గుర్గావ్: గుర్గావ్‌లోని రయాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గత సెప్టెంబర్‌లో జరిగిన విద్యార్థి హత్యకేసులో సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. స్కూల్‌లో పరీక్షలను వాయిదా వేసేందుకు, టీచర్-తల్లిదండ్రుల సమావేశాన్ని రద్దు చేసేందుకు 16 ఏండ్ల సీనియర్ విద్యార్థి ఈ దారుణానికి పాల్పడినట్టు సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది.

మోదీ అబద్ధాల పుట్ట

ప్రధాని పదవికి అనర్హుడు: సిద్దరామయ్య



బెంగళూరు, ఫిబ్రవరి 5: అబద్ధాల పుట్ట వంటి నరేంద్ర మోదీ నైతికంగా ప్రధాని పదవికి అర్హుడు కాదని కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తనపై నిరాధారమైన, బాధ్యాతారాహిత్య ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. ప్రధాని పదవి స్థాయిని దిగజార్చారని అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలులో 10 శాతం కమీషన్లు తీసుకున్నట్లు ఆధారాలుంటే రుజువు చేయాలని ప్రధాని నరేంద్రమోదీని సవాల్ చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆదివారం బెంగళూరు సభలో వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ పాలనకే రోజులు దగ్గర పడుతాయని, రాజస్థాన్ ఉప ఎన్నికల ఫలితాలే అందుకు సంకేతమని పేర్కొన్నారు. గోవాతో ఉన్న మహదాయి నదీ జలాల సమస్య గురించి మాట్లాడతారని భావించామని.. కానీ అవినీతి కేసుల్లో జైలుకెళ్లి వచ్చిన మాజీ సీఎం బీఎస్ యెడ్యూరప్పను పక్కనబెట్టుకుని వ్యాఖ్యలు చేయడానికి ముందు ప్రధాని మోదీ.. కర్ణాటకలో జరిగిందేమిటో తెలుసుకోవాలని సూచించారు. బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో జైలుకెళ్లి వచ్చిన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నోరు తెరిస్తే అబద్ధాలేనన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉన్నదన్న సంగతి తెలుసుకోవాలన్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు, రాజ్యాంగ పరంగా తమకు కేంద్రం నిధులు కేటాయిస్తున్నదేగానీ, అదనంగా ఏమీ కేటాయించలేదన్నారు.



హైదరాబాద్ నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) కార్యాలయంలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వాహనాన్ని మండలి చైర్మన్ స్వామిగౌడ్, వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ జిల్లాకో వాహనాన్ని ఏర్పాటు చేయాలని మంత్రికి సూచించారు. ఫుడ్ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు సమకూర్చాలని, ఐపీఎంలో వ్యాక్సిన్ల ఉత్పత్తిని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి లక్ష్మారెడ్డి ఐపీఎంలో నెలకొన్న సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. తన విజ్ఞప్తి మేరకు కేంద్రం రెండు మొబైల్ ల్యాబ్‌లను మంజూరుచేసిందని, త్వరలో మరో వాహనం వస్తుందన్నారు. కల్తీలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. ఈ వాహనం రాష్ట్ర మంతటా తిరుగుతూ నమూనాలు సేకరించి అక్కడే పరీక్షించిన నివేదిక ఇవ్వనుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, డీఎంఈ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాడెట్లతో సోమవారం రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు క్యాడెట్లను అభినందించారు. ఢిల్లీ క్యాంప్‌లో వారు అనుభవాలు, జరిగిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌సీసీ మొబైల్ యాప్, జర్నల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాడెట్లు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఏఆర్ రెహమాన్‌తో ఫొటో దిగొచ్చు

హైదరాబాద్ సంస్థతో ప్రత్యేక యాప్ తయారుచేయించిన సంగీత దిగ్గజం



ఏఆర్ ఎక్స్ ఏఆర్ యాప్ సాయంతో సంస్థ ప్రతినిధులు దిగిన ఫొటో

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: దిగ్గజ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్‌తో ఫొటో దిగాలనుకుంటున్నారా..? మీ వీడియోలో ఆయన ఉండాలనుకుంటున్నారా? చిన్న యాప్‌తో మీ కోరిక నెరవేరే అవకాశం వచ్చింది. తనను నేరుగా కలుసుకునే అవకాశంలేని అభిమానులకోసం రెహమాన్ ప్రత్యేక యాప్‌ను తయారు చేయించారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) టెక్నాలజీతో హైదరాబాద్‌కు చెందిన అవతార్ టెక్నాలజీస్ సంస్థ ఈ యాప్‌ను రూపొందించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-76లోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు ఖైరవ్ శంకర్, రోహిణీ శంకర్ పాలెప్పెట్, జాన్ పాలెప్పెట్ వివరాలు వెల్లడించారు. ఇటీవల ఏఆర్ టెక్నాలజీకి విపరీతమైన ఆదరణ లభిస్తున్నదన్నారు. తన అభిమానుల కోసం యాప్ రూపొందించాలన్న ఏఆర్ రెహమాన్ కోరిక మేరకు 'ఏఆర్‌ఎక్స్‌ఏఆర్' అనే పేరుతో యాప్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా అభిమానులు ఉన్నచోటే ఏఆర్ రెహమాన్ ప్రతిరూపాన్ని సృష్టించే అవకాశం ఉంటుందని, సెల్ఫీలు, వీడియోలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఇలాంటి యాప్‌ను మొదటిసారి వాడటం ద్వారా రెహమాన్ రికార్డు సృష్టించారన్నారు. యాపిల్ యూజర్లకు ఈ యాప్ అందుబాటులో ఉంటుందన్నారు.



స్వచ్ఛసర్వేక్షణ్ క్యాంపెయిన్‌లో భాగంగా పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సోమవారం సచివాలయంలో నాన్-వోవెన్ బ్యాగులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి శంకర్ మళ్లీ దొరికిండు

39 ఏండ్లుగా దొంగతనాలు.. 250కి పైగా చోరీలు

రెండుసార్లు పీడీయాక్టు ప్రయోగించినా మారలేదు

తాజాగా 11 దొంగతనాలు ❑ రూ.15 లక్షల సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దొంగతనమే వృత్తిగా 39 ఏండ్లుగా చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ మంత్రి శంకర్(58)ను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్‌చేశారు. అతడు ఇప్పటివరకు 250కి పైగా చోరీలకు పాల్పడ్డాడు. చోరీలు చేయడం.. పోలీసులకు పట్టుబడడం.. జైలు నుంచి వచ్చి మళ్లీ చోరీల బాట పట్టడం అలవాటుగా మార్చుకున్నాడు. ఇప్పటికే రెండుసార్లు పీడీయాక్టు నమోదుచేసినా మారక పోగా.. గత మూడు నెలల్లో హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11 చోరీలు చేశాడు. ఈ ఘరానా దొంగను తాజాగా సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు సోమవారం వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్ చిలకలగూడ ప్రాంతానికి చెందిన శంకర్.. 20 ఏండ్ల వయసులో దొంగతనాలు ప్రారంభించి 1979 డిసెంబర్ 12న మొదటిసారి పోలీసులకు చిక్కాడు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలై ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డి అలియాస్ దొంగ్లీ, బిరేందర్‌సింగ్, దీపక్ సక్సేనా, నాగులు ముఠాతో జట్టుకట్టి దొంగతనాలు చేయడంలో ఆరితేరాడు. ఆ తర్వాత పోలీసులకు పట్టుబడడం, జైలు నుంచి తిరిగి వచ్చిన తర్వాత కొత్త ముఠాలతో జతకడుతూ చోరీలు చేస్తున్నాడు. శంకర్‌పై పోలీసులు ఇప్పటికి రెండుసార్లు పీడీయాక్టు ప్రయోగించారు.

చోరీ సొత్తు తాకట్టు పెట్టి విలాసాలు

శంకర్ 2017 అక్టోబర్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. కాలపత్తార్‌కు చెం దిన రౌడీషీటర్ ఓబేద్‌తో కలిసి సైదాబాద్, ఓయూ, సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 11 దొంగతనాలకు పాల్పడ్డాడు. ఒబేద్ పికప్, డ్రాపింగ్‌కు సహా యపడేవాడని, కొన్నాళ్లుగా శంకర్‌కు ఆశ్రయం ఇచ్చినట్టు పోలీసులు గుర్తించారు. చోరీల్లో దొరికిన బంగారాన్ని శంకర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖాపెట్టి డబ్బు తీసుకొని కార్లు, బైక్‌లపై తిరుగుతూ విలాసవంతమైన జీవనం గడిపేవాడు. అతడికి ముగ్గురు భార్యలు, ఆరుగురు పిల్లలు ఉన్నారని, ప్రస్తుతం మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలిపారు. శంకర్‌ను అరెస్ట్‌చేసి 11 చోరీలకు సంబంధించి 37 తులాల బంగారం, రూ.3.2 లక్షల నగదును రికవరీ చేశామన్నారు. ఈ కేసులతో పాటు పాత కేసుల్లోనూ శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒబేద్ పరారీలో ఉన్నాడన్నారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడే సెకండ్లలో..

శంకర్ దొంగతనాల తీరు ప్రత్యేకంగా ఉంటుంది. ఉదయంపూట కాలనీల్లో రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తాడు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి నాలుగు గంటల మధ్య దొంగతనం చేస్తాడు. ఒక ఇంటిపైకి ఎక్కి ప్రహరీ మీదు గా మరో ఇంటిపైకి దూకుతూ తాళాలను తనిఖీ చేస్తాడు. కాలనీలోని ఒక వరుసలో తాళాలు వేసిన ఇండ్లు లేకుంటే మరో వరుసలోకి వెళ్తాడు. చేతిలో రాడ్, స్క్రూ డ్రైవర్ ఉందంటే కేవలం మూడు సెకండ్లలోనే ఇంటి తాళాన్ని పగులగొట్టేస్తాడు. ఖరీదైన, లేటెస్ట్ తాళాలైనా ఒక నిమిషంలోపే తెరుస్తాడు.



శంకర్ అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసరావు (ఇన్‌సెట్) పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

డాబాపైనే మకాం

ముఠాను తోడుగా తెచ్చుకున్నా.. శంకర్ ఒంటరిగానే ఇంట్లోకి వెళ్తాడు. మిగతావారు ఇంటి బయట ఉంటూ పరిస్థితులు గమనిస్తూ ఉంటారు. దొంగతనం చేసిన తర్వాత ఆ ఇంటి డాబాపైనే కాసేపు తలదాచుకుంటాడు. ఉదయం కాలనీలో మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు రోడ్లపైకి రాగానే వారితో కలిసి కాలనీ నుంచి బయటపడుతాడు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మకాం మారుస్తూ పోలీసుల నిఘా నుంచి తప్పించుకుంటాడు.

మరో 38 పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు

కేబీఆర్ పార్కులో జిమ్ ఏర్పాటు పనులను పరిశీలించిన మేయర్

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌వ్యాప్తంగా మరో 38 పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తామని మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో ఏర్పాటుచేస్తున్న ఓపెన్ జిమ్ పనులను సోమవారం పరిశీలించారు. పార్కు లోపల ఏర్పాటు చేస్తున్న పరికరాలు బాగున్నాయని, బయట వాక్‌వేలో బిగిస్తున్న ఓపెన్‌జిమ్ సామగ్రి ఫినిషింగ్ సరిగా లేదని వెంటనే మార్చాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. తొలివిడతలో నగరంలోని అన్ని ప్రధాన పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే గుల్మోహర్ పార్కు, ఏఎస్ రావు పార్కు, ఇందిరాపార్కు, ఇమ్లీబన్ పార్కు, కృష్ణకాంత్ పార్కు, నెహ్రూనగర్ పార్కుల్లో ఏర్పాటు చేశామన్నారు. వారంరోజుల్లో కేబీఆర్ పార్కు వద్ద పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, సర్కిల్ 18 డీఎంసీ సత్యనారాయణ, క్రీడా విభాగం ఓఎస్డీ ప్రేమ్‌రాజ్, ఏఎంవోహెచ్ రవికాంత్, ఖైరతాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్

ఓయూలో ఏఎస్ఐ వార్షిక సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆస్ట్రానమీ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 63వ వార్షిక సమావేశానికి ఉస్మానియా యూనివర్సిటీ వేదిక కానున్నది. ఈ సమావేశాలు మంగళవారం నుంచి ఈ నెల 9వరకు జరుగనున్నట్టు ఏఎస్ఐ ప్రతినిధులు సోమవారం తెలిపారు. మొదటిరోజు వర్క్‌షాప్, 7న అరోరా డిగ్రీ కాలేజీలో ఆస్ట్రానమీ విభాగంలో ఉపాధి అవకాశాలపై సదస్సు ఉంటుందన్నారు. రోజూ 400 మంది శాస్త్రవేత్తలు తమ పరిశోధనాపత్రాలను ప్రదర్శిస్తారన్నారు. అనంతరం ఏఎస్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దీపాంకర్ బెనర్జీ, ప్రొఫెసర్ నీరజ్, ఓయూ ఆస్ట్రానమీ విభాగం హెడ్ ప్రొఫెసర్ శాంతిప్రియ, సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రాచకొండలోని శివాలయం వద్ద ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న రాచకొండ పర్యాటక ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం రవీంద్రభారతిలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్ తదితరులు ఆవిష్కరించారు.



నాగర్‌కర్నూలు, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో క్రైస్తవులపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎంఐఎం ఎమ్మెల్యే బలాలా, రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ప్రతినిధులు సోమవారం డీజీపీ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

యూనివర్సిటీలను బలోపేతం చేస్తున్నాం

- 1,551 మంది బోధనా సిబ్బందిని నియమిస్తున్నాం
- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- తెలుగు వర్సిటీలో నూతన భవనానికి శంకుస్థాపన

తెలుగుయూనివర్సిటీ: రాష్ట్రంలో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను ఉన్నత స్థాయిలో పటిష్ఠం చేయడానికి రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర దేశాలు, రాష్ట్రాలతో పోటీపడేలా విద్యావ్యవస్థ రూపు దిద్దుకున్నప్పుడే సీఎం కేసీఆర్ కలలుగన్న బంగారు తెలంగాణ నిర్మాణంలో విద్యావ్యవస్థ భాగస్వామి అయినట్టని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పటిష్ఠం చేసే దిశగా వివిధ స్థాయిల్లో 1,551 మంది బోధనా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు రూ.కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. ఇందులోభాగంగా తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రత్యేక పరిపాలన భవనం లేనందున రూ.3.39 కోట్లతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. తెలుగువర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా నిర్మించబోయే భవనంలో పరిపాలన సంబంధ వ్యవహారాలతోపాటు చివరి అంతస్తులో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత పరిపాలనా భవనాన్ని విద్యార్థుల బోధనకు, ప్రయోగిక తరగతుల నిర్వహణకు ఉపయోగిస్తామన్నారు. బాచుపల్లి ప్రాంగణంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా త్వరలో మరో నూతన భవనానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం సంచాలకులు ఉదయ్ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న బహుళ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల, ఆర్థిక విభాగం అధికారి మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు దిలీప్‌రెడ్డి, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీసీఎం కడియం శ్రీహరి. చిత్రంలో తెలుగువర్సిటీ వీసీ సత్యనారాయణ, రిజిస్ట్రార్ అలేఖ్య తదితరులు

కోదండరాం కాంగ్రెస్ ఏజెంట్

- ఆయన 'కాలపరిమితి ముగిసిన ట్యాబ్లెట్': పిడమర్తి రవి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోదండరాం కాంగ్రెస్ ఏజెంట్ అని, ఆ పార్టీని బలోపేతం చేయడంతోపాటు రాజకీయ నిరుద్యోగుల కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి విమర్శించారు. సోమవారం తెలంగాణభవన్‌లో పిడమర్తి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం తర్వాత 'కాలపరిమితి ముగిసిన ట్యాబ్లెట్' లాంటివారు కోదండరాం అని పేర్కొన్నారు. గతంలో రాజకీయ పార్టీలు, విద్యార్థులు, ఉద్యోగులు, జేఏసీలో ఉన్నారని, ప్రస్తుతం అందులో ఎవరూలేరని చెప్పారు. ఉద్యమకారులపై ప్రేమ ఉంటే, స్వతంత్రంగా పోటీచేయాలని, లేకుంటే కాంగ్రెస్‌తో అంటకాగినట్లుగా భావించాల్సి ఉంటుంద చెప్పారు.ఉద్యమకారులకు ఎన్ని టికెట్లు ఇస్తారని ప్రశ్నించారు.

రిజర్వేషన్లపై శ్రీకాకుళంలో ఉద్రిక్తత



శ్రీకాకుళంలో మత్స్యకారుల దీక్షా శిబిరానికి నిప్పుపెట్టిన ఆదివాసీలు

శ్రీకాకుళం: ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ దగ్గర ఉద్రిక్తత నెలకొన్నది. వాల్మీకి, బోయ, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఆదివాసీలు సోమవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. మరోవైపు తమను ఎస్టీల్లో చేర్చాలంటూ కలెక్టర్ కార్యాలయం ఎదుట మత్స్యకారులు ఏర్పాటుచేసిన దీక్షా శిబిరాన్ని ఆదివాసీలు ధ్వంసం చేసి సామగ్రికి నిప్పంటించారు. ఆదివాసీలకు కలెక్టర్ నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

2.29 కోట్ల విలువైన బంగారం పట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆదివారం రెండు రైల్వేస్టేషన్లలో దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న రూ.2.29 కోట్ల విలువైన 7.14 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. వివరాలను సోమవారం వెల్లడించారు. అసోం రాజధాని గౌహతి నుంచి చెన్నైకి వెళ్తున్న రైలులో నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద సోదాలు చేసి అక్రమంగా తరలిస్తున్న 4.65 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని స్టవ్ బర్నర్లలో దాచిపెట్టగా పట్టుకున్నారు.మరో ఘటనలో ఒడిశాలోని కుర్దారోడ్ రైల్వేస్టేషన్ వద్ద గౌహతి నుంచి చెన్నై వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేసి 2.49 కిలోల బంగారు బిస్కెట్లను పట్టుకున్నారు.

మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో నారాయణ ప్రతిభ

హైదరాబాద్: నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో తమ స్కూళ్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ కే పునిత్ తెలిపారు. మొత్తం మూడు విభాగాల్లో మూడు బహుమతులు తమ విద్యార్థులే కైవసం చేస్తున్నారని పేర్కొన్నారు.

పార్లమెంట్‌ను సందర్శించిన 'మీ ప్రశ్న నేను అడుగుతా' విజేతలు

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి చేపట్టిన 'మీ ప్రశ్న నేను అడుగుతా' కార్యక్రమంలో ఎంపికైన చిన్నారులు, వారి తల్లిదండ్రులు సోమవారం పార్లమెంట్‌ను సందర్శించారు. ఎంపీ గత నవంబర్‌లో.. పార్లమెంట్‌లో అడిగేందుకు నియోజకవర్గంలోని విద్యార్థుల నుంచి ప్రశ్నలను ఆహ్వానించారు. వాటిల్లో ఉత్తమమైనవాటిని జీరో అవర్, 377 లేదా స్టార్ క్వచ్చన్ అవర్‌లో అడుగుతానని, విజేతలను సొంత ఖర్చులతో పార్లమెంట్ సందర్శనకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దాదాపు 12 వేల ప్రశ్నలు రాగా వాటిలో ముఖ్యమైన 37 ప్రశ్నలను ఎంపిక చేశారు. గత డిసెంబర్ 2న బోయిన్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉత్తమ ప్రశ్నలు సంధించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఎంపీ సమావేశమయ్యారు. ప్రశ్నలను పార్లమెంట్‌లో అడిగేందుకు పంపించినట్టు చెప్పారు. పార్లమెంట్ సందర్శనకు అనుకూల సమయం ఇవ్వాలని కోరగా బడ్జెట్ సమావేశాలప్పుడు వస్తామని వారు చెప్పారు. ఈ మేరకు ఈ నెల 3న చిన్నారులు, వారి తల్లిదండ్రులు మొత్తం 36 మంది రైలులో ఢిల్లీకి వెళ్లారు. సోమవారం వారిని ఎంపీ మల్లారెడ్డి పార్లమెంట్‌కు తీసుకువెళ్లి, సభ పనితీరును వివరించారు.



పార్లమెంట్ ప్రాంగణంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఎంపీ మల్లారెడ్డి

ఏపీలో కత్తులుదూస్తున్న టీడీపీ, బీజేపీ

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీలు పరస్పర విమర్శలతో కత్తులు నూరుతున్నాయి. సోమవారం రాజమండ్రిలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కార్యాలయాన్ని టీడీపీ నేతలు ముట్టడించి, దిష్టిబొమ్మను దగ్ధం చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఇటీవలచంద్రబాబు అక్రమంగా ఆస్తులు సంపాదించుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేసిన సోము వీర్రాజుకు హెచ్చరికలు ఎక్కువయ్యాయి. తమ దయాదాక్షిణ్యాలతో ఎమ్మెల్సీ అయ్యాక సోమువీర్రాజు నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్సీలు హెచ్చరించారు. వీర్రాజుకు వ్యతిరేకంగా 13 జిల్లాల్లో నిరసనలు, కొనసాగుతున్నాయి. విజయవాడలోని బందర్‌రోడ్డులో తెదేపా నేతలు సోము ఫ్లెక్సీకి చెప్పులదండ వేసి ఫ్లెక్సీతోపాటు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సంయమనం పాటించాలని నేతలకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. దమ్ముంటే తన ప్రశ్నలకు చంద్రబాబు జవాబు చెప్పాలని వీర్రాజు డిమాండ్ చేశారు.

సేద్యం కాని భూముల లెక్కలు తేల్చాలి

- వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సేద్యానికి అనుకూలం కాని భూముల వివరాలను సేకరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టుశాఖల అధికారులతో ఆయన సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూశాఖను సంప్రదించి భూ రికార్డుల ప్రక్షాళనలో తేలిన వివరాల ఆధారంగా గ్రామాల్లో తనిఖీ చేసి సేద్యానికి అనువుగాని భూముల లెక్కలను తేల్చాలన్నారు. 2017-18 వానకాలం, యాసంగి పంటల విస్తీర్ణాన్ని ఉద్యాన పంటలతో కలిపి క్రోడీకరించి వెంటనే పంపించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ వివరాలనే క్యాబినెట్ సబ్-కమిటీకి అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించారని, ఈ దిశలో బడ్జెట్ రూపకల్పనకు వీలుగా గ్రామాలవారీగా వ్యవసాయ పరికరాల లభ్యత వివరాలను క్రోడీకరించి ఈ నెల12లోగా తమకు పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషనర్ ఎం జగన్‌మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకటరామిరెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనోత్పత్తికి నడుం బిగించాలి

సోయాబీన్, శనగ, వేరుశనగలో నాణ్యమైన విత్తనోత్పత్తికి సరిపడా మూల విత్తనాన్ని సరఫరా చేసేందుకు సిద్ధమవ్వాలని రాష్ట్ర విత్తన క్షేత్రాలు, విత్తనాభివృద్ధి సంస్థల అధికారులను వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మూల విత్తనోత్పత్తి, సరఫరాపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆదిలాబాద్, ముధోల్, రుద్రూరు వ్యవసాయ పరిశోధన స్థానాల్లో వెయ్యి క్వింటాళ్ల సోయాబీన్ బ్రీడరు విత్తనోత్పత్తి చేయాలని ఆదేశించారు.

వచ్చే జూన్‌లోగా 'ఇస్తా' కేంద్రం: రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న 'ఇస్తా' (ఐఎస్‌టీఏ) ల్యాబ్‌ను అత్యాధునిక పరికరాలతో సహా వచ్చే జూన్‌నాటికి పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఆదేశించారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 6 ఫిబ్రవరి 2018

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi









మార్పునకు

నెలసరి..
రుతుక్రమం..
పీరియడ్స్..
ఏ పేరుతో పిలిచినా ఆడవాళ్లకు
ఆ మూడు రోజులు నరకమే..
చెక్.. చెక్.. అంటూ 24X7
చూసుకోవాల్సిందే!
రక్తస్రావం ఆపడానికి ఒకప్పుడు
బట్ట వాడేవారు..
వాటి స్థానాన్ని ఇప్పుడు
శానిటరీ నాప్‌కిన్స్ వచ్చేశాయి..
కానీ ఈ మాట అనడానికే ఆడవాళ్లే
సిగ్గుపడుతున్న కాలం..
మగ సెలెబ్రిటీలు ప్యాడ్స్ చేతబూని..
'ప్యాడ్‌మాన్ చాలెంజ్' అంటూ ప్రతీఒక్కరికీ
సవాలు విసురుతున్నారు..
సరికొత్త సవాలుకి శ్రీకారం చుట్టిందెవరు?
ఈ ప్యాడ్‌మ్యాన్ వెనుక ఉన్న అసలు కథ ఇది..

సరికొత్త సవాల్!



ఎ. మురుగనాథమ్
@murugaofficial
నా చేతిలో ఉన్నది ప్యాడ్. దీనికి నేను సిగ్గుపడాల్సిన పని లేదు. ఇది నాచురల్‌గా వచ్చే పీరియడ్స్ టైమ్‌లో వాడుతారు. ఈ విషయాన్ని కాపీ.. పేస్ట్ చేసి మరికొందరికీ సవాల్ విసరండి అని రాశాడు.
ఇతడే ఈ చాలెంజ్‌కి మూల పురుషుడు.. పైగా ప్యాడ్ మ్యాన్ సినిమాకి స్ఫూర్తి..
మురుగనాథమ్ ముందుగా చాలెంజ్ విసిరింది అక్షయ్ కుమార్, సోనమ్‌కపూర్, రాధికాఆప్టే, ఎమ్ఆర్ఎస్‌ఫన్నీ బోన్స్‌లకే..

* * *



నన్ను ట్యాగ్ చేసినందుకు సంతోషం..
నా చేతిలో ఉన్నది ప్యాడ్.. దీనికి ఇలా చేతబట్టుకోవడం నాకు సిగ్గనిపించడం లేదు. పీరియడ్ అనేది నాచురల్‌గా జరుగుతుంది.
అక్షయ్‌కుమార్ ట్వీట్..
తను మరికొందరికి ఈ చాలెంజ్ విసిరాడు..

* * *

చాలెంజ్ స్వీకరించా.. ఇదిగో నా చేతిలో ప్యాడ్..
దీన్ని చివరకీ రాజకుమారి కూడా వాడుతుంది. ఇది నాచురల్!
అదితీరావు హైదరీ ట్వీట్..

ఆమిర్‌ఖాన్, హ్యూమాఖురేషీ, ఆయుష్మాన్ ఖురానా, అలియాభట్, దీపికా పదుకోన్ ఇలా సెలెబ్రిటీలతో మొదలైన ఈ ఉద్యమం ఇండస్ట్రీల సీఈవోలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మామూలు ప్రజానీకాలకూ చేరింది. అసలు ఆ మూడు రోజుల గురించి ఆడవాళ్లే మాట్లాడాలనుకోరు. పైగా మెడికల్ షాపులోకి వెళ్లి ప్యాడ్స్ ఇమ్మని ధైర్యంగా అడుగలేరు. అలాంటి ప్యాడ్‌ని వీళ్ల చేతబట్టుకొని చాలెంజ్ విసిరేలా చేసిన వ్యక్తి మురుగనాథమ్. ఈయన కథే ప్యాడ్‌మ్యాన్ సినిమాగా బాలీవుడ్‌లో ఈనెల 9న రాబోతున్నది.

తమిళనాడు రాష్ట్రం.. పుదూరులోని పప్పనాయికెన్ చిన్న గ్రామంలో జన్మించాడు అరుణాచలం మురుగనాథమ్. ఇద్దరు ఆడపిల్లల మధ్య పుట్టినవాడు. చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో ఇంటి బాధ్యతను మీదేసుకున్నాడు. పొలం పనులు చేశాడు. ఆహార పొట్లాలు పంచాడు. చివరకి వెల్డింగ్ వర్క్‌షాపులో పనికి కుదిరాడు. అతడు చేసే గ్రిల్స్, కిటికీ డిజైన్లు బాగా అమ్ముడుపోయేవి. దాంతో సొంతంగా వెల్డింగ్ షాపు పెట్టుకొని జీవిస్తున్నాడు మురుగనాథమ్. 1992లో శాంతి అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఆరు సంవత్సరాల తర్వాత ఒకరోజున టీవీ చూస్తూ కూర్చున్న అతనికి భార్య చాటుగా ఏదో తీసుకెళ్లడం గమనించాడు. ఏంటని అడిగితే.. 'మీకు సంబంధించిన విషయం కాదు.. వదిలేయండి' అని సమాధానమిచ్చింది. కానీ ఆ తర్వాత తెలిసిందేమంటే రుతుక్రమం రావడంతో ఒక చిన్న గుడ్డ ముక్క తీసుకెళ్లిందని. ఆ విషయం గురించే మళ్లీ 'బయట దొరికే శానిటరీ నాప్‌కిన్‌లు వాడొచ్చు కదా' అని అడిగాడు. 'మన ఇంట్లో ఏదో ఒక సరుకు రాకూడదనుకుంటే అప్పుడు దాన్ని నేను వాడగలను' అంటూ అతని మాటల్ని అక్కడితో కట్ చేసింది. కానీ అతని మనసులో ఆ ఆలోచన కంటిన్యూ అవుతున్నదని ఆమెకు తెలియదు.

లక్ష్య నిర్దేశన..

వాణిజ్య ప్రకటనల్లో పరిగెత్తుతూ ఉంటారు. ఆ సమయంలో ఆడవాళ్లు చాలా కాలం వెళ్లదీస్తుంటే.. ఈ ప్రకటనల్లో ఇలా ఎందుకు చూపిస్తున్నారనేది అర్థం కాలేదు మురుగనాథమ్‌కి. అందుకే నిజంగా ఒకసారి ఆ నాప్‌కిన్స్ చూడాలనుకొని మెడికల్ షాపులోకి వెళ్లాడు. వాళ్లు దాన్ని ఒక పేపర్‌లో చుట్టి అతని చేతికిచ్చారు. అలా మొదటిసారి ప్యాడ్స్‌ని టచ్ చేశాడు. వాటిని చూసి ఈజీగానే తయారుచేయొచ్చని అనుకున్నాడు. పైగా వాటికయ్యే ఖర్చు కూడా తక్కువే అవుతుందనిపించింది అతనికి. ఈ లెక్కన ఆ సంస్థలు మనల్ని దోచుకుంటున్నాయనే విషయం కూడా అర్థమైంది. ఎవరికీ తెలియకుండా తన షాపులోనే ఈ తయారీ చేపట్టాడు. చివరకి చేసి భార్యకి ఇస్తే పెద్దగా నవ్వి కొన్ని రోజులు ఆగాలని చెప్పింది. కానీ తను పడిన శ్రమ ఫలితం తెలుసుకోవాలని తోబుట్టువులను అడిగాడు. వాళ్లు అసలు ఆ విషయం గురించే అతడితో మాట్లాడడానికి ఒప్పుకోలేదు. పైగా ఇంకోసారి ఇంటి గడుప తొక్కొద్దని వాళ్ల ఇంటి నుంచి తరిమేశారు.



తనే ప్రయోగశాల..

ఇంట్లో ఉన్నవాళ్లు తన ప్రయోగానికి ఒప్పుకోలేదు. స్నేహితులు నడిపే మటన్ షాపుకి వెళ్లి మేక రక్తాన్ని ఒక తిత్తిలో నింపుకొచ్చేవాడు. తనే దాన్ని నడుముకి కట్టుకొని అండర్‌గార్మెంట్‌లో ప్యాడ్ పెట్టి సైకిల్ తొక్కేవాడు. మధ్యమధ్యలో ఆ తిత్తిలోంచి రక్తం నాప్‌కిన్ మీద పడేలా ప్రయోగం చేశాడు. ఆడవాళ్ల ఇబ్బంది ఏంటో తనకు తెలియదు. ఇలా తను ప్రయోగం చేయడం భార్యకి తెలిసి మళ్లీ వస్తానంటూ పుట్టింటికి చేరిపోయింది. ఇదే విషయం ఊళ్లో తెలిసి వెలివేసినంత పని చేశారు అతడిని. కానీ అతను మాత్రం ఆ ప్రయోగాన్ని వదులుకోవాలనుకోలేదు. ఒక వైద్య కాలేజీ అమ్మాయి దగ్గరకు వెళ్లి తన ఆలోచన చెప్పాడు. ఆ అమ్మాయి మురుగనాథమ్‌కి సహాయం చేయడానికి ఒప్పుకొన్నది. అలా 35మంది అమ్మాయిలు ఈ నాప్‌కిన్‌ల తయారీకి సహకరిస్తానని చెప్పారు. అతడు తయారుచేసిన నాప్‌కిన్‌లను వాడి ఒక సంచిలో వేసి ఇచ్చేవారు. వాటిని తీసుకొని పరిశోధనలు మొదలుపెట్టాడు. దీనికి మూడేళ్ల కాలం పట్టింది. అంతకాలం ఒక్కడే చాయ్, బ్రెడ్‌తో కాలం వెళ్లదీశాడు.

విజయం వాకిట్లో..

శానిటరీ నాప్‌కిన్‌లు అందరికీ అందాలనే సంకల్పంతోనే మురుగనాథ్ వీటి తయారీ మొదలుపెట్టాడు. కానీ మిగతా వాటిల్లా లేవు. చివరకు దానిమీద పైన్ ట్రీ సారం వాడుతున్నారని తెలుసుకున్నాడు. దాన్ని తెప్పించుకొని తయారు చేయాలనుకున్నాడు. కానీ అది ఎలా చేయాలో అర్థం కాలేదు. అందుకే సొంతంగా ఒక యంత్రాన్ని తయారుచేశాడు. ఫైబర్ తీసేసిన గుజ్జుతో నాప్‌కిన్ సీల్ చేయడం మొదలుపెట్టాడు. అవి వాడిన తర్వాత ఫీడ్‌బ్యాక్ అదిరిపోయింది. తన ఆలోచనను అమ్ముకుంటే కొన్ని కోట్ల రూపాయలు అతని ముంగిట వాలుతాయి. కానీ అలా చేయలేదు. తక్కువ ధరలో నాప్‌కిన్‌లు అందరికీ అందాలనే ఉద్దేశంతో తనే సొంతంగా ఒక యూనిట్ మొదలుపెట్టాడు. అతని సక్సెస్‌తో పాటే కుటుంబ సభ్యులూ దగ్గరయ్యారు. ఇప్పుడు అతనికి ఒక పాప. 2006లో ఈ నాప్‌కిన్‌ల మీద పేటెంట్ తీసుకున్నాడు. దాదాపు 23 రాష్ట్రాల్లో ఇతడి యూనిట్స్ ఉన్నాయి. 106 యూనిట్ల లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.




ఇక 2014లో టైమ్ మ్యాగజైన్ ఇచ్చే '100 మోస్ట్ ఇనుఫ్ల్యూయెన్షియల్ పీపుల్ ఇన్ ద వరల్డ్'లో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. 2016లో కేంద్రప్రభుత్వం ఇతడిని పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది.

* * *

ఆ మూడు రోజుల గురించి ఈ ప్యాడ్‌లను తయారుచేశాడు. ఇప్పుడు సెలబ్రెటీలు ఉద్యమమే చేస్తున్నారు. ఇది హర్షించదగ్గ విషయమే. ఆ సమయంలో ఆడవాళ్లలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఒత్తిడికి లోనవుతారు. డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. మూడ్ స్వింగ్స్ ఉంటాయి. అలాంటి ఆడవాళ్లను పట్టించుకోకుండా 'ప్రతీ నెలా వచ్చేదేలే' అని వదిలేయకండి. ఆ మూడు రోజులు ఆమెకు చేతనైనంత సహాయం చేయండి. వారికి అనుగుణంగా మసిలితే ఆడవాళ్లకు మీరిచ్చే నిజమైన ఆలంబన అవుతుంది.

సౌమ్య నాగపురి

ఒక మెడికల్ షాపులోకి ఒక వ్యక్తి వస్తాడు..
అందులో ఉన్న ఒకతడిని 'ప్యాడ్స్' ఉన్నాయా? అని అడుగుతాడు.
షాపు అతను ఇది 'స్పోర్ట్స్ షాప్ కాదు.. ఇది మెడికల్ షాప్' అంటాడు..
దానికి ఆ వ్యక్తి 'ఆడవాళ్లు వాడే శానిటరీ న్యాప్‌కిన్స్.. ఆ ప్యాడ్స్' అడుగుతున్నా అని చెబుతాడు.. 'మగవాళ్లు అర్థం చేసుకొని ఇవి అడుగుతున్నారంటే.. ఆడవాళ్ల సమస్యలు కాస్త తగ్గుతాయి' అంటాడు షాపతను..
ఆ వ్యక్తి 'కాస్త చెక్ చేసి తీసుకోవచ్చా' అంటూ ప్యాడ్ ప్యాక్స్ చూస్తుంటాడు..
ఇదేదో యాడ్‌లాగా అనిపిస్తున్నది కదా! కానీ ప్యాడ్ మ్యాన్ చాలెంజ్ తీసుకొని..
బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, రాజ్‌కుమార్ రావు చేసిన వీడియో..
అందరూ ప్యాడ్‌లు పట్టుకొని ఫొటోలు తీస్తుంటే వీళ్లు మాత్రం ఇలా క్రియేటివ్‌గా వీడియో చేశారు..



బిట్స్ కార్నర్

ధ్యానంతో వ్యక్తిత్వమా?



మెడిటేషన్‌తో మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిళ్లు తగ్గిపోతాయి. ఎంతటి క్లిష్టతరమైన సమస్యను తేలికగా పరిష్కారం చూపే ధోరణి అలవడుతుంది. మరి వ్యక్తిత్వం మారుతుందా?

ధ్యానంతో మానసిక లాభాలు ఎన్నో పొందవచ్చునేమో కానీ.. సమాజాన్ని ప్రభావితం చేసేలా వ్యక్తిత్వం ఏర్పరచలేకపోవచ్చు అంటున్నారు నిపుణులు. ఉత్తమ గుణాల పట్ల ప్రేరణ కలిగించొచ్చు.. ప్రభావితం చేయొచ్చుగానీ ఉత్తమ వ్యక్తిని వందకు వందశాతం చేస్తుందనడంలో ఎలాంటి ఆధారాలు లేవని చెప్తున్నారు. 'ధ్యానం-వ్యక్తిత్వం' అనే అంశంపై లండన్‌కు చెందిన కన్వెంట్రీ యూనివర్సిటీ అధ్యయనం చేపట్టింది. క్రమం తప్పకుండా ధ్యానం చేస్తున్న వందలాది మంది విద్యార్థుల మానసిక ప్రభావం.. ప్రవర్తన వంటి అంశాలను విశ్లేషించారు. సామాజికాంశాల పట్ల వాళ్లకున్న ఆసక్తిని.. అవగాహనను పరిగణనలోకి తీసుకున్నారు. ధ్యానంతో ఒక వ్యక్తికి సంబంధించి మంచి అలవాట్లు ఏర్పడడంలో పనిచేస్తుందని.. చాలామందికి ఇదొక ఔషధంగా పనిచేస్తుందని చెప్పారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లుగా సమాజోద్ధరణకు ఇది దోహదం చేస్తుందనే విషయాన్ని అంగీకరించలేమని చెప్పారు.

ఎనభయేండ్ల గ్రాడ్యుయేట్!



గ్రాడ్యుయేషన్ చేయాలన్నది ఆమె కల. యవ్వనంలో ఉన్నప్పుడు అలాంటి డిగ్రీలు ఎన్ని చేయడానికైనా వెనుకాడరేమో. కానీ ఆమెది యవ్వనదశ కాదు. వృద్ధాప్యం కూడా దాటిపోయింది. ఇప్పడామె వయసు 81 సంవత్సరాలు. కానీ సాధించింది. ఎలా?

చైనా రాజధాని బీజింగ్‌కు చెందిన జుయా మిన్‌జియూ యువతిగా ఉన్నప్పుడు అర్థంతరంగా ఆమె చదువు ఆగిపోయింది. పెండ్లయింది. పిల్లలు కూడా అయ్యారు. చదువు లేకపోయినా అందర్నీ బాగా చదివించింది. కానీ తాను గ్రాడ్యుయేషన్ చేయాలన్న కోరిక మాత్రం అలాగే మిగిలిపోయింది. చైనా ప్రభుత్వం కల్పిస్తున్న మోడ్రన్ డిస్టేన్స్ ఎడ్యుకేషన్ ఆమె కల నెరవేరేలా చేసింది. ఎనభై యేండ్లు దాటినా కూడా వయసు ఆమె గ్రాడ్యుయేషన్‌కు ఎలాంటి అడ్డంకిగా మారలేదు. థియాజిన్ యూనివర్సిటీలో 'ఈకామర్స్' గ్రాడ్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నది. 2014లో ప్రథమ సంవత్సరం ప్రారంభించిన ఆమె రెండ్రోజుల క్రితం కోర్సు పూర్తి చేసుకున్నది. 'ఎన్నో కష్టాలు పడ్డాను. ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నాను. ఎట్టకేలకు నా కల నెరవేరింది. మా క్లాస్‌లో నేను పెద్ద వయసు విద్యార్థిని కావడంతో అందరూ కామెంట్ చేసేవాళ్లు. అధ్యాపకుల కన్నా కూడా నేనే పెద్దదాన్ని కావడంతో ఒకానొక దశలో ఈ కోర్సు పూర్తవుతుందో కాదో అనుకున్నా' అని ఆలోచించి కష్టపడి చదివి.. మిగతా విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభతో జుయా డిగ్రీ పట్టా సంపాదించింది.

అడుగండి చెబుతా



ఈ బాధ తీరేనా?!

నా వయసు 60 సంవత్సరాలు. పిల్లలందరూ స్థిరపడ్డారు. ఈ వయసులో నాకు ఎవరికీ చెప్పుకోలేని సమస్య మొదలైంది. మూత్ర విసర్జనకు సంబంధించిన ఆలోచన మనసులోకి రాగానే వెంటనే బాత్రూమ్‌కి పరుగెత్తాల్సి వస్తున్నది. మూత్రం ఇంకా లోపలే ఉండిపోయినట్టు అనిపిస్తుంది. మంటగా కూడా ఉంటుంది. ఎవరికీ చెప్పుకోలేక సిగ్గుతో చచ్చిపోతున్నాను. నా సమస్యకు పరిష్కారం ఏంటో దయచేసి తెలుపగలరు.

– ధనలక్ష్మి, నిజామాబాద్

మీ సమస్యకు మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు ప్రధాన కారణం కావొచ్చు. ఇక పోతే మెనోపాజ్ దశలోకి వచ్చిన తరువాత హార్మోన్లు ఉండవు. కాబట్టి శరీరంలో పలు భాగాల్లో చర్మం మందం తగ్గి, పలుచబడుతుంది. మూత్రవ్యవస్థ, జననాంగం చుట్టుపక్కల భాగాలలోని చర్మం కూడా చాలా పలుచబడుతుంది. మెనోపాజల్ సిండ్రోమ్‌లో భాగంగా పదే పదే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు రావడం, మూత్రానికి వెంటవెంటనే వెళ్లాలనిపించడం, మూత్ర విసర్జన తరువాత కూడా మూత్రం ఇంకా లోపలే ఉండిపోవడం (అర్జ్ ఇన్‌కాంటినెన్స్), మూత్రం లీక్ కావడం, యురెత్రా సన్నబడిపోవడం (యురెత్రల్ స్టినోసిస్) లాంటి సమస్యలు వస్తాయి. లోకల్‌గా పరీక్షలు చేస్తే సమస్య తెలిసిపోతుంది. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లకు యాంటిబయాటిక్స్ ఇచ్చి చికిత్స అందించవచ్చు. అర్జ్ ఇన్‌కాంటినెన్స్‌ని మందుల ద్వారా తగ్గించవచ్చు. సన్నబడిన యురెత్రాకు డైలటేషన్ చికిత్స చేసి సరిచేస్తారు. అవసరాన్ని బట్టి హార్మోన్ ఆయింట్‌మెంట్లను ఇస్తారు. మధుమేహం ఉన్నప్పుడు కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ఒకసారి షుగర్ టెస్టు కూడా చేయించుకోండి. సిగ్గుపడిపోయి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయవద్దు. పదే పదే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ల వల్ల కిడ్నీలు దెబ్బతినవచ్చు. మహిళల్లో కిడ్నీ ఫెయిల్యూర్‌కి గల ప్రధాన కారణాల్లో ఇదే ముందుంటుంది. అందుకే వెంటనే గైనకాలజిస్టును కలువండి.

డాక్టర్ లలిత
యూరోగైనకాలజిస్టు
హైదరాబాద్

నమస్తే తెలంగాణ

జీవనరేఖ

[హైదరాబాద్]

మంగళవారం 6 ఫిబ్రవరి 2018

పోపుల పెట్టెలో 10

హెడ్డింగ్ చూసి పోపుల పెట్టెలో అమ్మ దాచి పెట్టిన డబ్బులు అనుకోకండి. దాంట్లో ఉండే పదార్థాలతో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల ముచ్చట ఇది. అవేంటో తెలిస్తే మీరు తప్పకుండా పోపుల పెట్టెతో కిచెన్ బయట కూడా స్నేహం చేస్తారు.



పోపుల పెట్టెలో కనిపించే దాల్చిన చెక్కను బిర్యానీ ఘుమఘుమలకే వాడేద్దామనుకొంటే పొరపాటే. ఎందుకంటే దాన్ని మామూలుగా కూడా తినొచ్చు. అలా చేస్తే రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.



ఈ బాక్సులో కనిపించే అల్లం ఉపయోగం గురించి ఆయుర్వేదం గట్టిగానే చెబుతున్నది. వాంతులు, వికారం, విరేచనాల వంటి ఆరోగ్య సమస్యలకు ఇది చెక్ పెడుతుంది.



వెల్లుల్లికి గుండెకు మంచి నేస్తం. పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. దీనిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తాయి.



యాలకులకు ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫాన్ని కరిగించే శక్తి ఉంటుంది. శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే పిల్లలకు యాలకులు కలిపిన పాలను తాగించాలి.



కాస్త ఖరీదైన సుగంధ ద్రవ్యం కుంకుమ పువ్వు. దేశవిదేశాల్లో రుచికరమైన, ఘుమఘుమలాడే వంటకాల కోసం వాడే ఈ పువ్వులో క్యాన్సర్ నిరోధక లక్షణాలు మెండు. ఇది అందానికి, ఆరోగ్యానికి మేలైనది.



లవంగాలు శ్వాస సంబంధిత సమస్యలకు మంచి మందు. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. నోటిని, శ్వాసను తాజాగా ఉంచడంలో తోడ్పడుతాయి.




జీలకర్ర మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది. దీనిలోని క్యూమిక్ డీహైడ్ అనే పరిమళం లాలాజల గ్రంథులను క్రియాశీలం చేస్తుంది. ఆకలిని పుట్టిస్తుంది.



ఆవాలు విటమిన్ల నిలయాలు. కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులను తగ్గిస్తాయి. శ్వాసలో ఏర్పడే అవరోధాలను దూరం చేస్తాయి.



నల్లమిరియాలు జీర్ణక్రియ సజావుగా జరిగేలా చూస్తాయి. ఆహారం తేలికగా జీర్ణమయ్యేందుకు హైడ్రోక్లోరిక్ యాసిడ్ విడుదల చేసేలా ఉదరాన్ని ప్రేరేపిస్తాయి.



పెద్ద జీలకర్రలా ఉండే సోపును కూడా కూరల్లో వాడుతుంటారు. రుతుస్రావ సమయంలో కలిగే ఇబ్బందులను ఇది తొలిగిస్తుంది. వీటితో తయారు చేసిన నూనెకు పొత్తికడుపులో నొప్పిని తగ్గించే శక్తి ఉంటుంది.

ఇక చెవిలో శబ్దాల్లేవ్!



ఆమెకు 60 ఏళ్లు. చెవిలో ఏవేవో శబ్దాలు వినబడుతున్నాయి. పదేళ్లుగా ఇదే తంతు. రకరకాల డాక్టర్లను కలిసింది. చివరికి డాక్టర్లు జబ్బేంటో నిర్ధారణ చేసి, చెవిలోపల 5 సెం.మీ.ల కణితి పెరిగిందని తేల్చారు. ఆపరేషన్ కోసం ముంబయి వెళ్లాల్సిందే అన్నారు. హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయడానికి వీలుపడని తన జబ్బేంటో ఆమెకు అర్థం కాలేదు. ముంబయి దాకా వెళ్లాలంటే పరిస్థితులు సహకరించలేదు. రోజులు అలానే గడిచిపోయాయి.


కానీ ఒకరోజు..

అంటే నాలుగు నెలల క్రితం...

ముఖంలో ఎడమవైపు పక్షవాతం వచ్చింది. దాంతో ఆందోళనగా డాక్టర్ దగ్గరికి వచ్చారు. ముంబయి దాకా వెళ్లే పనిలేకుండా ఆ సర్జరీ ఇక్కడ కూడా చేయగలిగే పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయని సంతోషించింది. డబ్బు గురించి చింత లేదు.. 'మీరెంత వరకు ఇవ్వగలిగితే అంత ఇవ్వండి చాలు.. మీ సమస్య తీరడం ముఖ్యం' అన్నారు డాక్టర్. ఆమె ఆనందానికి అవధుల్లేవు. చకచకా ఆపరేషన్‌కి ఏర్పాట్లు జరిగాయి. జనవరి 27న ఆపరేషన్ విజయవంతం అయింది. ఆమె చెవిలోని కణితి బయటకు వెళ్లిపోయింది. ఇప్పుడామె చెవి ఏ శబ్దాలూ లేకుండా ప్రశాంతంగా ఉంది. ముఖానికి వచ్చిన పక్షవాతం కూడా చాలావరకు మెరుగుపడింది.

ఇంతకీ ఈ ఆపరేషన్ కథాకమామిషేంటంటే...

వైద్యరంగం నిత్యం కొత్త పుంతలు తొక్కుతూనే ఉంది. ఆధునిక ఆపరేషన్లు నెమ్మదిగా మనకూ అందుబాటులో వస్తున్నాయి. అందుకు ఉదాహరణే లేటరల్ స్కల్ బేస్ సర్జరీలు. ఇదివరకు ఇలాంటి కొన్ని ఆపరేషన్లు చేయగలిగే పరిస్థితులు మన దగ్గర ఉండేవి కావు. చెవి చుట్టుపక్కల వచ్చిన ట్యూమర్లు మెడ భాగంలోకి వ్యాపించినప్పుడు లేటరల్ స్కల్ బేస్ సర్జరీ చేయాలి. దీనికి అనుభవం, శిక్షణ ఉన్న నలుగురైదుగురు నిపుణుల వైద్య బృందం, సాంకేతిక సాధనాలు ఉండాలి. ఇదివరకు ఇవన్నీ అందుబాటులో లేకపోవడం చేత ముంబయి వెళ్లి చికిత్స చేయించుకునేవాళ్లు. కాని ఇప్పుడు ఇక్కడ కూడా దీనికి ప్రత్యేక యూనిట్ ఉంది. ఇప్పుడా సర్జరీలను మనం కూడా చేస్తున్నాం. హైదరాబాద్‌లోనే అలా చేసిన మొట్టమొదటి లేటరల్ స్కల్ బేస్ సర్జరీ ఇది. లేజర్‌తో చేసిన నావిగేషన్ అసిస్టెడ్ ఆపరేషన్. ఇప్పుడు దీనికోసం ప్రత్యేక విభాగం, డాక్టర్ల బృందం ఉన్నారు.



పుట్టుకతోనే...

చెవిలో కణుతులు సాధారణంగా కొన్ని జన్యుపరమైన కారణాల వల్ల ఏర్పడవచ్చు. అయితే ఇవి బినైన్ కణుతులు. అంటే ఇవి క్యాన్సర్ కణుతులు కావు. క్యాన్సర్ లాగా రక్తం ద్వారానో, శోషరసం ద్వారానో ఇతర శరీర భాగాలకు వ్యాపించవు. వీటివల్ల చుట్టుపక్కల భాగాలపై ఒత్తిడి పడినప్పుడు మాత్రమే ఈ బినైన్ కణుతుల వల్ల హాని కలుగుతుంది. ఇది కూడా అలా ఏర్పడిందే.

కణితి ఎక్కడ?

మెదడు, మెడ మధ్యలో వాటి రెండింటినీ కలుపుతూ ఉండే ఎముకనే లేటరల్ స్కల్ బేస్ అంటారు. మెదడు, ముక్కుల మధ్యలో ఉండే ఎముక ఆంటీరియర్ స్కల్ బేస్. దీనికి సంబంధించిన సర్జరీలు అంతగా సంక్లిష్టమైనవి కావు. కాని లేటరల్ స్కల్ బేస్ సర్జరీలు మాత్రం కొంచెం క్లిష్టమైనవి. ఒకరిద్దరు డాక్టర్లతో అయ్యే పని కాదు. కణితి ఇంటర్నల్ కెరొటిడ్ ధమని చుట్టూ, ఇంటర్నల్ జుగులార్ వీన్‌లో ఉంది. ఇంటర్నల్ కెరొటిడ్ ధమని మెడ నుంచి తలకి రక్తం సరఫరా చేస్తుంది. ఇంటర్నల్ జుగులార్ సిర మెడ నుంచి గుండెకు రక్తాన్ని తీసుకెళ్తుంది. ఈ కణితి కెరొటిడ్ ఆరిక్యులర్ నరం దగ్గర ఉండడం వల్ల దానిపై ఒత్తిడి పడింది. ఈ నరం జుగులార్ వీన్, ఊపిరి తీసుకునే దగ్గర, నాలుక, ముఖం.. వీటికి సంబంధించిన నరాల చుట్టూ ఉంటుంది. అందుకే ఆయా రక్తనాళాలకు సమస్యలతో పాటుగా ముఖంలోని నాడిని ట్యూమర్ తినేయడం వల్ల ముఖానికి ఒకవైపు పక్షవాతం వచ్చింది.

ఆధునిక సర్జరీ.. ఇదీ లాభం!

సంప్రదాయిక శస్త్రచికిత్సల మాదిరిగా కాకుండా ఈ ఆపరేషన్‌ను లేజర్‌తో కంప్యూటర్ నావిగేషన్‌ని ఉపయోగించి చేశాం. నావిగేషన్ వల్ల లోపలి భాగాలను సరిగ్గా గుర్తించి త్వరగా చేరగలుగుతాం. లేజర్ వాడడం వల్ల రక్తస్రావం తక్కువగా ఉంటుంది. సంప్రదాయిక ఆపరేషన్ వల్ల అయితే అయిదారు బాటిల్స్ రక్తం ఎక్కించాల్సి వచ్చేది. దీనికి రెండు బాటిల్స్ చాలు. లేజర్ ఆపరేషన్ వల్ల సేఫ్టీ ఎక్కువ. కాంప్లికేషన్స్ తక్కువ. ఆపరేషన్‌కి 10.30 గంటలు పట్టింది.

ఆపరేషన్ ఎలా?

ముందుగా చెవి వెనుక కోత పెట్టాం. కణితి మెడలోకి కూడా వెళ్లడం వల్ల మెడలోని రక్తనాళాలను కూడా కంట్రోల్ చేయాల్సి వచ్చింది. మెదడుకు వెళ్లే రక్తనాళమైన కెరొటిడ్ ధమని బాహ్య, అంతర ధమనులుగా విడిపోతుంది. బాహ్య కెరొటిడ్ ధమని భాగానికి క్లాంప్ వేసి ట్యూమర్‌కి రక్తప్రసరణ నిలిపివేశాం. అలా ఆ రక్తనాళాన్ని బ్లాక్ చేశాం.

జుగులార్ సిర మార్గం చెవి ఎముక నుంచి ఉంటుంది. అందువల్ల చెవి ఎముకను డ్రిల్ చేసి సర్జరీ ద్వారా దాన్ని బ్లాక్ చేశాం.

మాస్టాయిడ్ ఎముక లోపల ముఖానికి వెళ్లే నాడిని తినేసింది. అందువల్ల ముఖంలోని నరాన్ని బ్లాక్ చేసి ఆరోగ్యకరమైన ముఖ నరాన్ని గుర్తించి దాని చివరను దగ్గర్లో ఉన్న గ్రేట్ ఆరిక్యులార్ నర్వ్ నుంచి భాగాన్ని తీసి అతికించాం. ఇలా కెరొటిడ్ ఆరిక్యులర్ నాడిని కట్ చేసి తీసి, వేరే నాడితో కేబుల్ గ్రాఫ్ట్ చేశాం. దీనివల్ల చెవికి కొంత సెన్సేషన్ తగ్గినప్పటికీ పెద్దగా సమస్య ఉండదు. ఆపరేషన్ తరువాత 60 నుంచి 70 శాతం రికవర్ అవుతుంది.

చివరగా ఇంటర్నల్ జుగులార్ వీన్‌ని బ్లాక్ చేసి ట్యూమర్‌ని ఒక్కో నరం నుంచి వేరు చేస్తూ బయటికి తీశాం. చెవిని బయటినుంచి పూర్తిగా మూసేయాలి. లేకుంటే చెవిలోని గులిమి లోపలికి వెళ్లి ఇన్‌ఫెక్షన్ రావొచ్చు.





డాక్టర్ కె.ఆర్. మేఘనాథ్
సీనియర్ ఇఎన్‌టి సర్జన్
మా ఇఎన్‌టి హాస్పిటల్స్, హైదరాబాద్

సలహా

క్యాన్సర్‌ను వీరు జయించారు..

మీకూ సాధ్యమే!





ప్రముఖ క్రికెటర్ యువరాజ్ సింగ్ 2011లో సెమినోమా (ఊపిరితిత్తులు, గుండె మధ్య కణితి)కి గురైనప్పుడు అందరూ ఆందోళన చెందారు. ఆరోగ్యవంతమైన జీవనశైలి గడుపుతున్నా క్యాన్సర్ వస్తుందా? అని భయపడ్డారు. తర్వాత ఆయన ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. పూర్తిగా కోలుకుని 'ది టెస్ట్ ఆఫ్ మై లైఫ్'8 అనే పుస్తకాన్ని రచించారు. ఇంతకుముందులాగే ఆయన క్రీడా జీవితం గడుపుతున్నారు.

అనేక భాషల్లో నటించి ఎందరికో అభిమాన నటి అయిన మనీషా కొయిరాలా 2012లో అండాశయ క్యాన్సర్‌కు గురయ్యారు. సర్జరీ తర్వాత ట్రీట్‌మెంట్స్ తీసుకుని ఇప్పుడు క్యాన్సర్ మీద అవగాహన కలిగించే అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత సైక్లిస్ట్ లాన్స్ ఆర్మ్‌స్టాంగ్ 16 ఏళ్ల నుండే రేసుల్లో పాల్గొనేవాడు. 25 ఏళ్ల వయసులోనే మెదడు, ఊపిరితిత్తులు, తర శరీర భాగాల్లో అంతా పాకిపోయి లేట్ స్టేజ్‌లో వృషణాల క్యాన్సర్ బయటపడినప్పుడు ఇక ఆయన బతకడం కష్టం అనుకున్నారు. కాని పట్టుదలతో, ఆత్మస్థైర్యంతో అన్ని రకాల కాంబినేషన్‌తో ట్రీట్‌మెంట్ తీసుకుని ఆ మహమ్మారిపై విజయం సాధించారు. తరువాత ఆరుసార్లు టూర్ డిఫ్రాన్స్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ గెల్చుకున్నారు.

ఒకప్పటి సౌత్ ఆఫ్రికా దేశాధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి విజేత, భారతరత్న నెల్సన్ మండేలా పిఎస్ఎ పరీక్షతో ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ముందే పసిగట్టి ఏడు వారాల రేడియేషన్ థెరపీ తర్వాత 1990లో ప్రొస్టేట్ గ్రంథిని తొలగించుకుని క్యాన్సర్ నుంచి విముక్తిని పొందారు. 95 ఏళ్ల వయసులో డిసెంబర్ 5, 2013లో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో మరణించారు.

నటి గౌతమి, గ్రామి అవార్డ్ దక్కించుకున్న పాటల రచయిత, గాతని షెరిల్ క్రౌ, జీన్ మ్యుటేషన్ పరీక్షతో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని మాస్టెక్టమీ చేయించుకున్న హాలివుడ్ నటి ఏంజెలీనా జూలీ బ్రెస్ట్ క్యాన్సర్ మీద విజయం ప్రకటించిన చాలామందిలో కొందరు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒకప్పటి ప్రెసిడెంట్ నీలం సంజీవరెడ్డి 1977లో లంగ్ క్యాన్సర్‌ను, ఆసిన్ (నటి), మమతా మోహన్‌దాస్ (నటి, సింగర్), లీసా రే (టొరంటో నటి, మోడల్) మల్టిపుల్ మైలో మాకు స్టెమ్ సెల్



ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకుని క్యాన్సర్‌ను ఎదిరించిన ప్రముఖులలో నిలిచారు.

\+ + +

మనకు తెలిసిన ఈ ప్రముఖ విజేతలతో పాటు తెలియనివాళ్లలో కూడా గుండెధైర్యంతో జీవితంలో అనేక ఒడిదుడుకులతో పాటు క్యాన్సర్‌ను జయించిన విజేతలు ఎందరో. వీరిలో కొందరు జీన్ మ్యుటేషన్, ఇతర పరీక్షలతో ముందే ప్రమాదాన్ని గుర్తించి క్యాన్సర్ రాకుండా చికిత్స తీసుకున్నవారైతే మరికొందరు శరీరమంతా పాకి ఇంక ఏ విధంగా ఆశలు లేవన్న స్థితి నుంచి బయటపడి సాధారణ జీవితం గడుపుతున్నవారూ ఉన్నారు.

ఇలాంటి విజేతలలో ఉండే లక్షణాలు ఏమిటని ఆలోచిస్తే వారికి సోకింది క్యాన్సర్ అని తెలిసినా కుంగిపోకుండా మనో నిబ్బరంతో ఎదుర్కోవడమే. ముందుగా కొంత ఆందోళనకు గురైనా తర్వాత వారు ఈ సమ



స్యను ఎలా ఎదుర్కోవాలి? చికిత్సలు ఎలా తీసుకోవాలి? ఏయే జాగ్రత్తలు పాటిస్తే మంచిది? ఆహారం పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలి? ఇలాంటి విషయాల్లో చక్కని అవగాహన పెంపొందించుకుని డాక్టర్ సలహాలు పాటిస్తూ, చికిత్స తీసుకుంటూనే నటించినవారు, నర్తించినవారు, ఆటల్లో పాల్గొన్నవారు, పుస్తకాలు వ్రాసినవారు ఉన్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం..


క్యాన్సర్ వ్యాధిగ్రస్తులవడానికి కచ్చితమైన కారణం ఇదీ అని తెలియదు. ఈ వ్యాధికి గురైనవారిలో చక్కటి ఆరోగ్యవంతమైన జీవనశైలి గడుపుతూ ఉన్నవారు, దురలవాట్లకు లోనైనవారు, వయసు పైబడినవారూ ఉంటారు. అయితే మనం చేయాల్సిందల్లా మంచి జీవనశైలితో పాటు అవగాహనతో ముందే పసిగట్టగలగడం. ఏ క్యాన్సర్‌నైనా తొలిదశలో గుర్తిస్తే ఆ కణం మీద విజయం సాధించం తేలికే. పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్ అలవాట్లు, అధిక బరువు, ఎక్కువ మంది లైంగిక భాగస్వాములు ఉన్నవారికి ఈ ముప్పు మరింత ఎక్కువని తెలుసుకుంటే మంచిది. పర్యావరణ పరిస్థితులు, వారు చేసే వృత్తి, వంశపారంపర్య లక్షణాలు, ఇతర మందులు, మానసిక ఒత్తిడి, అలవాట్లు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, ఇలా అనేక విషయాలతో ముడిపడి ఈ సమస్య వచ్చే రిస్క్ ఉంటుంది. అయితే మనలో చాలామందికి అవగాహన లేమితో పాటు అపోహలు అనవసరమైన అనుమానాలు ఎక్కువే.

ఇప్పటి వైద్య విధానాలతో ఇతర దీర్ఘకాలిక వ్యాధుల మీద, క్యాన్సర్ మీద పట్టు సాధించగలుగుతున్నారు. నయం చేయడం అన్ని సందర్భాలలో సాధ్యం కాకపోయినా అదుపులోకి బాగా తీసుకురాగలుగుతున్నారు. కీమోథెరపీ మందులలో కొత్తదనాలు చోటు చేసుకుని వ్యక్తిగత చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. సైడ్ ఎఫెక్ట్స్ చాలావరకు తగ్గుతున్న ఈ కీమో మందుల ధరలు ఇంకా అదుపులోకి రావాల్సి ఉంది. ఇతర శరీర భాగాల మీదా చాలా తక్కువ ప్రభావం చూపే రేడియేషన్ థెరపీలు అందుబాటులోకి వచ్చేశాయి. ఐఎంఆర్‌టి, సైబర్‌నైఫ్ వంటి రేడియో రోబోటిక్ సర్జరీలతో దుష్ఫలితాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇక సర్జరీలు, శరీర భాగాలను తొలగించినపుడు చేసే రీకన్‌స్ట్రక్షన్ సర్జరీలతో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. చిన్న కోతతో చేసే సర్జరీలు కీహోల్ సర్జరీలు క్యాన్సర్‌కు చేయగలగడమే కాకుండా వెంటనే వారికి ఏమాత్రం ఆత్మవిశ్వాసం సన్నగిల్లకుండా తొలగించిన శరీర భాగాలను పునర్నిర్మించగలుగుతున్నారు.

మీరే విజేతలు!

తొలిదశలో కనుగొనగలగడం, అనుభవజ్ఞుడైన డాక్టర్‌ను సంప్రదించడం, మందులు, చికిత్సలు కరెక్టుగా తీసుకోవడంతో పాటు వీలైతే వారి వృత్తులకు వెళ్లడం, కౌన్సెలింగ్, గ్రూప్ కౌన్సెలింగ్‌లకు హాజరు కావడం, యోగా, ధ్యానం వంటివి ప్రాక్టీస్ చేయడం, నలుగురితో ఉండడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం చేస్తే మంచిది. క్యాన్సర్ అని తెలియగానే మానసిక కుంగుబాటుకు గురై ఆత్మహత్య ధోరణిలో వెళ్లేవాళ్లలో ఎక్కువగా స్త్రీలు ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల సహాయంతో మంచి ఆహారం తీసుకుంటూ, ఇతర వ్యాపకాలు పెంపొందించుకుని చికిత్సలు తీసుకుంటే క్యాన్సర్‌ను జయించిన విజేతలూ మీరూ కావొచ్చు.

డా. సి.హెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్
9848011421



ఆహారం.. ఐదు సూత్రాలు

ఆరోగ్యంగా ఉండాలంటే సమయానికి ఆహారం తీసుకోవాలి. కానీ, తీసుకున్న ఆహారం ఆరోగ్యానికి ఉపయోగపడాలంటే ఈ ఐదు సూత్రాలు పాటించాల్సిందేనంటున్నారు నిపుణులు.

ఏం తింటున్నామన్నది కాదు, ఎంత తింటున్నాం, ఎలా తింటున్నాం అనేది చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడమే కాదు, ఆరోగ్యకరమైన పద్ధతిలో తింటేనే మేలు చేకూరుతుంది.

ఎంత తినాలి?

1 సాధారణంగా కడుపు ఖాళీగా ఉన్నప్పుడు మెదడు అత్యుత్తమంగా పనిచేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. కడుపు ఖాళీగా ఉన్నప్పుడు.. గ్రెలిన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుందిట. అది ఆకలవుతుందన్న విషయాన్ని మెదడుకు చేరవేయడమే కాకుండా మెదడులోని హిప్పోక్యాంపస్ అనే ప్రాంతాన్ని ఉత్తేజితం చేసి మరింత సమర్థవంతంగా పనిచేసేలా చేస్తుందట. అలాగని తినకుండా ఉండాలని కాదు. సరైన విధానంలో ఆహారం తీసుకొంటే ఆరోగ్యానికి మంచిది. ముప్పై ఏళ్ల లోపు వారైతే రోజుకు మూడు పూటలా తినాలి. ముప్పై పైబడిన వారైతే రెండు పూటలే తినడం ఉత్తమం. తీసుకొన్న రెండున్నర గంటల్లో అరిగిపోయేలా, 12 నుంచి 18 గంటల్లో శరీరంలో నుంచి పూర్తిగా బయటికి వెళ్లిపోయేలా ఆహారాన్ని స్పృహతో తీసుకోవాలి. ఇలా చేస్తే శరీరం, మనసు అత్యుత్తమంగా పనిచేస్తాయి.

2 నమిలి తినండి

ఆహారాన్ని నమలడం అనేది జీర్ణప్రక్రియలో ముఖ్యమైన ప్రక్రియ. పిండి పదార్థం ఎక్కువగా ఉండే ఆహారాలు లాలాజలం ద్వారానే 30శాతం జీర్ణమవుతాయి. ఒక ముద్ద ఆహారాన్ని 24 సార్లు నమలాలట. దీని వెనుక శాస్త్రీయ కారణం కూడా ఉంది. నోట్లోనే బాగా నమిలితే, జీర్ణవ్యవస్థ మందకొడిగా పనిచేయదు. చురుగ్గా పనిచేసి ఆహారం త్వరగా అరిగిపోయేలా చేస్తుంది. తిన్న తర్వాత నిద్రకు ఉపక్రమించవద్దు. కనీసం రెండు గంటల వ్యవధిని ఇవ్వాలి.

కాలానికి తగ్గట్టు.. 3


కాలానికనుగుణంగా ఆహారం వండుకొని భోజనం చేస్తుంటారు. వర్షాకాలంలో ఒక మాదిరి, చలికాలంలో ఒక మాదిరి, వేసవికాలంలో ఒక మాదిరి కాయగూరలతో శరీరానికి సరిపడేట్లు వండుకొంటారు. ఇలా శరీర అవసరాలకు తగ్గట్టుగా, మారే వాతావరణానికి అనుగుణంగా తినడం శ్రేయస్కరం. శరీరం తనని తాను ఋతువులకు అనుగుణంగా మలుచుకొనేందుకు ఇది ఉపయోగపడుతుంది.

4 సమతుల ఆహారం

తగినన్ని కూరగాయలు, పప్పుదినుసులను.. వివిధ రకాలైన ధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన సమతుల ఆహారం అందుతుంది. కొన్ని గింజలకే పరిమితం కాకుండా విభిన్న రకాలైన ధాన్యాన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తవు. కేవలం అన్నమే కాకుండా అందుకు సరిసమానంగా కూరగాయలనూ తీసుకోవడం ద్వారా శరీరానికి సమతుల ఆహారం అందుతుంది.

మూస పద్ధతి వద్దు 5

ఆహారం శరీరానికి సంబంధించి ఏది తినాలనే విషయాన్ని దాన్ని అడుగడమే ఉత్తమమైన విషయం. మూసపద్ధతిలో ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం కంటే వివేకవంతంగా ప్రవర్తించి స్పృహతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.



మాకు రాయండి

ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలతో పాటుగా వివిధ రకాల జబ్బుల గురించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నది మన జీవనరేఖ. అంతేగాకుండా వ్యాధుల నివారణోపాయాలు, ఆధునిక చికిత్సలు, కొత్త పరిశోధనల గురించిన సమాచారాన్ని అందిస్తూ మీకూ, మీ కుటుంబానికి ఉపయోగపడుతున్నదని భావిస్తున్నాం.

మీకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేసేందుకు, మీ కథల్ని మరింతమందిలో స్ఫూర్తి నింపేందుకు నడుం కట్టింది జీవనరేఖ. అందుకే మీకు వైద్య, ఆరోగ్య సంబంధమైన సందేహాలు, సమస్యలేవి ఉన్నా మాకు రాసి పంపండి. నిపుణుల చేత సూచనలిప్పిస్తాము. అంతేకాదు.. మీరేవైనా జబ్బుల్ని ధైర్యంగా ఎదుర్కున్నా మాకు చెప్పండి. మీ ధైర్యం పదిమందికి ఆశ కల్పించగలుగుతుంది.

డాక్టర్లు, హాస్పిటల్స్‌తో మీకు కలిగిన అనుభవాలు మంచివైనా, చెడ్డవైనా మాతో పంచుకోండి. పేషెంట్ డైరీలో భాగంగా ప్రచురిస్తాం.




మా చిరునామా
జీవనరేఖ
నమస్తే తెలంగాణ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్ రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034
jeevanarekha@ntnews.com

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 6 ఫిబ్రవరి 2018

ఈ లెన్సులు గ్లూకోజ్ విలువ తెలుపుతాయ్!

కళ్లకు అమర్చే లెన్సు గ్లూకోజ్‌ను కంట్రోల్ చేయడమేంటని ఆశ్చర్యపోతున్నారా!! తాజా పరిశోధన అదే చెబుతున్నది.

దృష్టిలోపాన్ని సరిచేసే కాంటాక్ట్ లెన్సుల గురించే మనకు ఇప్పటివరకూ తెలుసు. కానీ ఇప్పుడు రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ ఎలా ఉన్నాయో చెప్పే లెన్సులు రాబోతున్నాయి. తాజా పరిశోధనలు చెప్తున్న వీటి సంగతులేంటంటే...



కన్నీటి ద్వారా శరీరం నుంచి బయటకు వెళ్లిపోయే గ్లూకోజ్ లెవల్స్‌ను కనిపెట్టగలిగే కొత్త స్మార్ట్ లెన్స్‌ను కనిపెట్టారు దక్షిణకొరియా శాస్త్రవేత్తలు. దీనికోసం ఒక అధునాతన టెక్నాలజీతో కూడిన లెన్స్‌ను ప్రయోగాత్మకంగా రూపొందించారు. ఈ లెన్స్‌లో ఉండే ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ కళ్ల నుంచి కారే కన్నీటిలో గ్లూకోజ్ లెవెల్స్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటాయి.

దీనిలో మూడు భాగాలుంటాయి. ఒకటి కాంటాక్ట్ లెన్స్. ఇది గ్లూకోజ్ లెవల్స్‌ను సెన్స్ చేస్తుంది. రెండో భాగం రీడర్. ఇది కాంటాక్ట్ లెన్స్‌కి పవర్‌ని ప్రసారం చేస్తుంది. మూడవ భాగం యూజర్ డిస్‌ప్లే. దీనిపైన పేషెంటు డేటాను చూసుకోవచ్చు. రీడర్, యూజర్ డిస్‌ప్లే భాగాలు రెండూ ఒకే పరికరంలో ఉంటాయి. దీనికి ఆకుపచ్చ ఎల్ఈడీ లైట్ కూడా ఉంటుంది. ఇది గ్లూకోజ్ లెవల్స్‌ను బట్టి వెలుగుతూ అలర్ట్ చేస్తుంది. అదిచ్చే సంకేతాలను బట్టి ఇన్సులిన్ స్థాయిలను సరి చూసుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా కళ్లజోడు, ధరించిన ఆభరణాలు, దుస్తులు రీడర్‌గా పనిచేస్తాయి. లెన్సు సమాచారాన్ని ప్రసారం చేయడానికి ఇది దానికి దగ్గరగా ఉండడం అవసరం. డిస్‌ప్లే డివైస్ ఒక స్మార్ట్‌ఫోన్ కావొచ్చు. లేదా గ్లాస్ కావొచ్చు. దీన్ని తలపై ధరించొచ్చు లేదా కళ్లకు ఎదురుగా అమర్చుకోవచ్చు.

ఈ స్మార్ట్ కాంటాక్ట్ లెన్సులు ప్రామాణిక కాంటాక్ట్ లెన్సుల పరిమాణంలోనే ఉంటాయి. ఒకేవిధమైన పదార్థంతో తయారుచేయబడి ఉంటాయి. నార్మల్ కాంటాక్ట్ లెన్సులు పెట్టుకున్నట్టుగానే ఫీల్ ఉంటుంది.

ఇది డయాబెటిక్ రోగులకు మంచి చేసే లెన్సు. రక్తంలో షుగర్ లెవల్స్ తెలుసుకోవడానికి సూది గుచ్చి టెస్టు చేసి చూసుకోవాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు గ్లూకోజ్ లెవల్స్‌ను మానిటర్ చేసే ఈ లెన్సు వల్ల.. స్పృహ తప్పకుండా, కోమాలోకి వెళ్లకుండా కాపాడుతుంది. అయితే ఈ లెన్స్‌ను జంతువులపై ప్రయోగాత్మకంగా పరిశీలించి చూశారు పరిశోధకులు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు. త్వరలోనే మనుషులకూ దీన్ని పూర్తిస్థాయిలో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే యాపిల్, శ్యామ్‌సంగ్, సోనీ కంపెనీలు ఈ కాంటాక్ట్ లెన్స్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది.

స్మార్ట్ విండోస్‌తో విద్యుత్

ఇటీవల కాలంలో సోలార్ విద్యుత్ వినియోగం ఒక ఉద్యమంలా సాగుతున్నది. అందుకు కారణమవుతున్న క్రిస్టాలిన్ మెటీరియల్స్ (పెరోవ్‌స్కైట్స్)కు ధన్యవాదాలు చెప్పాల్సిందే. అయితే తాజాగా ఇవి స్మార్ట్ విండోస్‌గా రూపాంతరం చెందుతున్నాయి. ఇంతకీ అసలు విషయమేమిటంటే..



ప్రత్యేకమైన పలకలను ఏర్పాటు చేయడం ద్వారా సోలార్ విద్యుత్‌ను తయారు చేయడం చూసుంటారు. కానీ ఈ కొత్త స్మార్ట్ విండోస్ గురించి తెలిస్తే మాత్రం షాకవుతారు. ఇటీవల కాలంలో ఏ మాల్‌ను చూసినా, భవంతిని చూసినా అద్దాల మేడను తలపించేలా కట్టేస్తున్నారు. అయితే గోడలకు బదులుగా ఉపయోగించే భారీ అద్దాలు.. షోకేస్‌కే కాకుండా మరోవిధంగా పనికొచ్చేలా ఉండాలంటే ఈ స్మార్ట్ విండోస్‌ను ఉపయోగించుకోవచ్చు. లేలేత రంగుల్లో తయారయ్యే ఈ స్మార్ట్ విండోస్ సూర్యుడి వేడి తగులగానే ముదురు రంగులోకి మారిపోయి.. దాని చాటున ఉన్నవారంతా చల్లగా ఉండేలా చేస్తుంది. అంతేనా! మెల్లగా సూర్యకాంతిని గ్రహించుకొని విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తుంది. అంటే సోలార్ కమ్ స్మార్ట్ విండోస్ అన్నమాట. ఒకేసారి అటు స్మార్ట్ విండోస్‌గానూ, సోలార్ విండోస్‌గానూ పనిచేస్తాయి. సంగ్రహించుకొన్న సౌరశక్తిని మెల్లగా విద్యుత్‌శక్తిగా మారుస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇంతకు ముందు ఇలాంటి స్మార్ట్ విండోస్ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి ఉండేవి. అయితే అవి ముదురు రంగులోకి మారేందుకు బాహ్య విద్యుత్‌శక్తి అవసరమయ్యేది. ధర విషయంలో, పనిచేసే అంశంలో అవి అంతగా సక్సెస్ కాలేదు. కానీ అధునాతన టెక్నాలజీతో రూపొందిన ఈ పెరోవ్‌స్కైట్స్.. స్మార్ట్ విండోస్, సోలార్ విండోస్ ఒకేసారి పనిచేసే వీలుంటుంది. సౌరశక్తిని గ్రహించుకొని భవనంలోకి ఎండవేడిమిని రానివ్వకుండా చేయడమే కాదు, అవసరమైన విద్యుత్‌నూ తయారు చేసుకొనే టెక్నాలజీ దీనిలో ఉంటుంది. ఇవి ఇంకా పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి వచ్చేందుకు కాస్త సమయం పట్టొచ్చంటున్నారు పరిశోధకులు.



'అసలే గర్భిణివి.. కదలకుండా, మెదలకుండా పడుకో.. లేకుంటే గ్రహణ మొర్రి బిడ్డ పుడతాడు...' 'గ్రహణం వచ్చేస్తుంది.. ఈలోపే భోజనం చేసేయాలి...' 'ఫలానా ఫలానా వాళ్లు బయట తిరుగకూడదు. గ్రహణం వల్ల చెడు ప్రభావం పడుతుంది...' సూర్యునికో, చంద్రునికో గ్రహణం పడుతున్నదంటే ఇలాంటి రకరకాల అభిప్రాయాలూ, భయాలూ వ్యక్తమవుతుంటాయి. మొన్న సంపూర్ణ చంద్రగ్రహణం నాడు ఏర్పడిన బ్లడ్‌మూన్ సమయంలో కూడా చాలామందిలో ఇలాంటి భయాలే కనిపించాయి. కొన్ని రకాల రాశుల వాళ్లపై ప్రత్యేక ప్రభావాలుంటాయని కూడా అన్నారు. అయితే ఇటువంటి నమ్మకాల్లో ఎటువంటి నిజం లేదంటున్నారు శాస్త్ర రంగ నిపుణులు. గ్రహణ సమయంలో సంభవించే మార్పులేవీ మానవ జీవనగమనంపై ఏ ప్రభావాలనూ చూపవని చెప్తున్నారు.

గ్రహణాలూ.. నమ్మకాలూ..!

సంపూర్ణ చంద్రగ్రహణం ఆకాశంలో ఒక అద్భుత దృశ్యం. ఒకేసారి సూపర్ మూన్, చంద్రగ్రహణం రావడం వల్ల రెడ్‌మూన్ కూడా వచ్చింది. ఇవన్నీ కలిసి రావడం ఆకాశ పరిశోధకులకు తమ ప్రయోగాలకు మంచి అవకాశం కలిసొచ్చింది. ఆకాశంలోని వింతలను పరిశీలించాలనే కుతూహలం గల ఔత్సాహికులకు ఆనందం కలిగింది. ప్రపంచమంతా ఈ చంద్రగ్రహణాన్ని వీక్షించి మధురానుభూతులు పొందారు. కానీ అనేక చోట్ల పాత నమ్మకాలతో చంద్రగ్రహణాన్ని చూడడానికి భయపడి బయటకు రాకుండా ఇండ్లలోనే ఉండిపోయారు. జ్యోతిషులు అన్ని దేశాల్లోనూ వీటిపై మూఢ నమ్మకాలను ప్రచారం చేశారు. మన దేశంలో గ్రహణ సమయంలో బయటకు రాకూడదని, బయటకు వస్తే దుష్ప్రభావం కలుగుతుందనీ, పుష్యమి, అశ్లేష మొదలైన నక్షత్రాల వారికి, కర్కాటక మొదలైన రాశుల వారికి దోషాలు ఉంటాయని, వాటికి పరిహారాలు, శాంతులు చేయించుకోవాలని ప్రచారాలు జరిగాయి. గ్రహణం సమయంలో రేడియేషన్ వెలువడుతుందని, కాస్మిక్ కిరణాలు వస్తాయని అందుకే గర్భిణులు బయటకు రాకూడదని, గ్రహణం మొర్రి పిల్లలు పుడుతారని కూడా ప్రచారం చేశారు. గ్రహణం పట్టే సమయంలో ఆహారం తీసుకోకూడదని, తీసుకొంటే జీర్ణకోశంపై చెడు ప్రభావం కలుగుతుందని కూడా చెప్పారు. ఇలాంటివే రకరకాల నమ్మకాలు వివిధ దేశాల్లో అనేకం ఉన్నాయి. ఈ నమ్మకాలకు మూలం రాహు, కేతువులనే అసురులు సూర్య, చంద్రులను మింగడం వల్ల గ్రహణాలు ఏర్పడుతాయని ప్రచారంలో ఉండడమే. పాము మింగుతుందని, చైనాలో అయితే డ్రాగన్ మింగుతుందని నమ్మకాలు ఉన్నాయి. కొన్ని ఆఫ్రికా తెగలవాళ్లు గ్రహణం సమయంలో సూర్యుడి శక్తి తగ్గిపోతుందని, బాణాలకు గుడ్డలు కట్టి మంటపెట్టి ఆకాశంలోకి వేస్తారు. దానితో సూర్యుడికి శక్తివచ్చి మళ్లీ మామూలైపోతాడని వారి నమ్మకం. మన దగ్గర భద్రాచలం, చత్తీస్‌గఢ్ అడవుల్లోని గిరిజనులు గ్రహణాల వలన మంచి జరుగుతుందని సంబరాలు చేసుకొంటారు. ఇంతకీ గ్రహణానికి సంబంధించి




గ్రహణాలకు కారణమేమిటి?

రాహు, కేతువులనే అసురుల కారణంగానే సూర్య, చంద్ర గ్రహణాలు ఏర్పడుతాయని వందల ఏళ్లుగా నమ్ముతున్నారు. పరాశరస్మృతి, వరాహమిహిర బృహత్జాకం ఇవే అంశాల ఆధారంగా రచింపబడినాయి. కొన్ని శతాబ్దాల కాలం ఇవే ప్రామాణికాలుగా ఉన్నాయి. కానీ ఆర్యభట్ట (క్రీ.శ. 476- 550) మొదటిసారి గ్రహణాలకు కారణం భూమి, చంద్రుడి నీడలు అని కనుగొన్నాడు. సూర్య, చంద్రులలాగే భూమి కూడా గోళాకారంలో ఉంటుందని దాని నీడే చంద్ర గ్రహణ సమయంలో చంద్రుని మీద పడుతుందని చెప్పాడు. తదనంతరం ఈ విషయాన్ని బ్రహ్మగుప్తుడు వంటి జ్యోతిష్య గ్రంథకర్తలు తమ గ్రంథాల్లో ఎద్దేవా చేశారు. కానీ నిజమేమిటో నేడు అందరికీ తెలుసు.

ఆకాశంలో నీడలాట

ఆకాశంలో భూమి, చంద్రుల నీడలాటే గ్రహణాలు. సూర్యుడు ఒక నక్షత్రం. సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతుంటాయి. అలాగే భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నది. భూమి చుట్టూ తిరిగే ఉపగ్రహం చంద్రుడు. ఇలా ఇవి ఒకదాని చుట్టూ ఒకటి పరిభ్రమించేటప్పుడు సూర్యునికి భూమికి మధ్యలో చంద్రుడు వస్తే.. చంద్రుని నీడ భూమిమీద పడుతుంది. సూర్యుడికి, చంద్రునికి మధ్యలో భూమి వస్తే భూమి నీడ చంద్రుని మీద పడుతుంది. ఈ నీడలు ఇలా పడడం వల్లనే గ్రహణాలు ఏర్పడుతాయి. ఎండలో మనం వెళుతున్నప్పుడు గొడుగు పట్టుకొంటే గొడుగు నీడ మన మీద పడినట్టన్నమాట. అంటే మనకు గొడుగు గ్రహణ కారకం అన్నమాట.



ఏది నిజం? ఏది అబద్ధం? ఈ ప్రచారాల వెనుక ఉన్న వైజ్ఞానిక అంశాలను పరిశీలిద్దాం.

నమ్మకం **గర్భిణులు కదలకూడదు. వారిపై, గర్భస్థ శిశువుపై చెడు ప్రభావం పడుతుంది.**

నిజం గ్రహణ సమయంలో ప్రత్యేకంగా వెలువడే కిరణాలు ఏమీ ఉండవు. కనుక ఏ ప్రభావమూ ఉండదు. ఇందులో భయపడాల్సిందేమీ లేదు. ఇది ఏదో ఊహాజనితమైన సమాధానం కాదు. వైజ్ఞానికంగా నిరూపితమైన అంశం. గర్భంతో ఉన్నప్పుడు కొన్ని పనులు చేయొద్దనీ, కదలకుండా పడుకోవాలని చెప్తుంటారు. గర్భిణులు బయటకు వస్తే గ్రహణ మొర్రితో పిల్లలు పుడుతారనేది అపోహ మాత్రమే. నేతి బీరకాయకు నెయ్యికి ఎలా సంబంధం ఉండదో, గ్రహణానికి, గ్రహణ మొర్రికి కూడా ఎలాంటి సంబంధం ఉండదు. మొర్రి అనేది జన్యు సంబంధమైన లోపాల వలన వస్తుంది. ముఖ్యంగా మేనరికపు పెళ్లి చేసుకొన్నవారి సంతానంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది గ్రహణం వల్ల వస్తుందనే అపోహతోనే గ్రహణ మొర్రిగా నేటికీ మూఢనమ్మకంగా కొనసాగుతున్నది. ఆ సమయంలో కూరగాయలు కోయకూడదని, లోహపు వస్తువులు వాడొద్దని, ఇంట్లోనే పడు



కొని ఉండాలని చెప్పడం మూఢాచారాలే. వీటికి వైజ్ఞానికంగా ఎలాంటి ఆధారం లేదు. ప్రతీ గ్రహణానికి ప్రకృతి సత్యాలు తెలుసుకొనేందుకు శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. కాబట్టి గ్రహణం సమయంలో దాన్ని పరిశీలించడం ద్వారా మేలే తప్ప నష్టమేం లేదు. అనేక గ్రహణాల సమయంలో వైజ్ఞానికవేత్తలు వేలాది పరిశోధనలు జరిపారు. ఇంకా జరుపుతూనే ఉన్నారు. ఇలాంటి అనేక పరిశోధనలు, ప్రయోగాలు జరిపిన నాసా, గ్రహణ సమయంలో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని తేల్చి చెప్పింది.

నమ్మకం **మనుషుల కన్నా జంతువులకు గ్రహణ శక్తి ఎక్కువ. అందుకే గ్రహణ సమయంలో చెబు ప్రభావం వల్లనే జంతువులు వింతగా ప్రవర్తిస్తాయి.**

నిజం గ్రహణం పట్టే సమయంలో కొన్ని జంతువులు వింతగా ప్రవర్తిస్తాయి కదా అనే అనుమానం రావొచ్చు. దీనిపై కూడా పరిశోధనలు జరిగాయి. 1991లో శాస్త్రవేత్తలు తిమింగలం వంటి సముద్ర జీవులు, పులులు, పలు రకాల పక్షులు గ్రహణం సమయంలో వింతగా ప్రవర్తించడంపై పరిశోధన చేశారు. ఔల్ మంకీ అనే ఒకరకమైన కోతులు సూర్యగ్రహణ సమయంలో వింత వింతగా ప్రవర్తించడం గమనించారు శాస్త్రవేత్తలు. వీటి విపరీత ప్రవర్తనకు కారణమేమిటో కనుగొనేందుకు 2010లో పరిశోధనలు జరిపారు. అయితే ఒక్కసారిగా వాతావరణంలో మార్పు సంభవించడం, పగటి పూట కూడా సూర్యుడు కనిపించకపోవడం వల్లే అవి ఆందోళనకు గురై వింతగా ప్రవర్తిస్తున్నాయి తప్ప ఇతరత్రా కారణాలేమీ లేవని తేల్చారు.

నమ్మకం **గ్రహణ సమయంలో ఆహారపదార్థాలు పాడవుతాయి. అందుకే వాటి మూతల పైన దర్భ పెట్టాలి.**

నిజం గ్రహణం సమయంలో ఆహార పదార్థాలు పాడైపోతాయన్నది పూర్తిగా అపోహే. వండి ఉంచిన ఆహారంలో గ్రహణం పట్టేటప్పుడు దర్భ వేయడం ద్వారా.. అవి చెడిపోకుండా ఉంటాయనే ప్రచారమూ ఉన్నది. గ్రహణ సమయంలో వాటిపై సూక్ష్మక్రిముల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అందుకే ఆ సమయంలో ఆహారం తీసుకోకూడదని చెబుతారు. వండిపెట్టిన ఆహారంలో దర్భను వేస్తే.. అది సూక్ష్మక్రిముల ప్రభావాన్ని తగ్గిస్తుందని చెబుతారు. అయితే అది శాస్త్రీయంగా నిరూపితం కాలేదు.

- సాధారణంగా ఎండాకాలంలో వండుకొన్న ఆహారం త్వరగా పాడైపోతుంది. కానీ ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు మాత్రం అలా జరుగదు. గ్రహణాల సమయంలో నీడల వలన ఉష్ణోగ్రత తగ్గుతుందే కాని, పెరుగదు. పరిశోధనల్లో తేలిందేమిటంటే సాధారణంగా 35-40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతల్లో బాక్టీరియా పెరుగుదల ఎక్కువగాను, ఐదు డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలో సూక్ష్మక్రిముల ప్రభావం తక్కువగా ఉంటుంది. గ్రహణ సమయాల్లో కూడా ఉష్ణోగ్రతలు పెరుగడమంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. కాబట్టి ఆహారం పాడైపోయే అవకాశం ఉండదు. ఆహారం చెడిపోవడానికి , గ్రహణాలకు ఎటువంటి సంబంధం లేదనేది నిరూపిత సత్యమే.

నమ్మకం **గ్రహణాలు మనపై చెడు ప్రభావం చూపుతాయి. కాబట్టి ఆ సమయంలో బయట తిరుగకూడదు.**

నిజం గ్రహణాల సమయంలో గురుత్వ బలాల్లో మార్పు వస్తుందని, దాని ప్రభావం మనుషుల మీద ఉంటుందని చెబుతారు కొంతమంది. గ్రహణ సమయంలో కాంతి వలన గానీ, గురుత్వ బలాల వల్లగానీ ఎలాంటి ప్రభావం మనుషుల మీద ఉండదని వైజ్ఞానికంగా నిరూపితమైంది. మామూలుగా భూమి, చంద్రుల పరిభ్రమణాల్లో ఎప్పుడో అరుదుగా సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలోకి వస్తారు. అలా వచ్చినప్పుడే గ్రహణాలు సంభవిస్తాయి. కనుక ఆ రోజు గురుత్వబలాలు మనుషుల మీద ఎక్కువగా ఉంటాయని, ఈ వాదం చేసేవారు చెబుతుంటారు. నిజమే గ్రహణాల సమయంలో ఈ మూడు ఒకే సరళరేఖలో ఉంటే 180 డిగ్రీల కోణంలో ఉంటాయి. ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఈ మూడు 180 డిగ్రీల కోణంలో ఉన్నప్పుడే గ్రహణాలు ఏర్పడుతాయి. అయితే వాటి ప్రభావం వల్ల ప్రతీ పౌర్ణమి రోజు గురుత్వ బలాల వల్ల సముద్రంలో ఆటుపోట్లు వస్తాయి. అదేవిధంగా మన శరీరంలో కూడా 70 శాతం నీరు ఉంటుంది. కాబట్టి మనమీద కూడా గురుత్వ బలాల ప్రభావం ఉంటుందని వాదిస్తున్నారు. దీని గురించి తెలియాలంటే గురుత్వబలాల ప్రభావం ఎందుకుంటుంది? ఎంత ఉంటుందనేది తెలుసుకోవాలి.

గురుత్వ బలాల్లో మార్పు.. ఆకర్షణ!

ఏదైనా వస్తువు పెద్దదవుతున్న కొద్దీ, దాని ద్రవ్యరాశి ఎక్కువ అవుతున్నకొద్దీ, దాని ఆకర్షణ బలం ఎక్కువవుతుంది. అందుకే గ్రహాలన్నీ ఎంతో భారమైన సూర్యుడి చుట్టూ తిరుగుతాయి. అంతేకాని ఒకదాని చుట్టూ ఇంకొకటి తిరుగవు. అలాగే రెండు వస్తువుల మధ్యదూరం పెరుగుతున్న కొద్ది, వాటి మధ్య ఆకర్షణ తక్కువ అవుతుంది. అందుకే చందమామ సూర్యుని జోలికి వెళ్లకుండా దగ్గరగా ఉన్న భూమి చుట్టూ తిరుగుతుంది. దూరం పెరుగుతున్న కొద్దీ గురుత్వం ఎందుకు తగ్గుతుంది? దూరానికి గురుత్వానికి ఉన్న సంబంధం ఏమిటి? న్యూటన్ దీని గురించి పరిశోధించి ఒక సత్యాన్ని తెలిపాడు. ఏ రెండు వస్తువుల మధ్య అయినా గురుత్వాకర్షణ బలం (F) వాటి ద్రవ్యరాశుల (M1, M2) లబ్దానికి అనులోమానుపాతంలోనూ, వాటి మధ్య దూరపు వర్గానికి (R^2) విలోమానుపాతంలో ఉంటుంది. దూరం పదింతలు ఉంటే బలం పదో వంతుకు తగ్గుతుంది. ఇది నేడు విశ్వవ్యాప్తంగా నిరూపితమైన సత్యం. దీని ప్రభావం మన మీద ఎంత ఉంటుందనేది తెలియాలంటే న్యూటన్ సూత్రం $F=G(M1,M2/D^2)$ ను అర్థం చేసుకోవాలి. భూమి నుంచి సూర్యుడి దూరం గరిష్టంగా 15,20,98,155 కి.మీ., కనిష్టంగా 14,71,01,455 కి.మీలుగా ఉన్నాయి. అదే చంద్రుడి దూరం గరిష్టంగా 4,06,282 కి.మీ., కనిష్టంగా 356749 కి.మీలుగా ఉన్నాయి. సూర్యుని చుట్టూ భూమి, భూమి చుట్టూ చంద్రుడు తిరిగే కక్ష్యలు దీర్ఘవృత్తాకారంలో ఉంటాయి. కనుక ఈ గరిష్ట, కనిష్ట దూరాలు ఉంటాయి. అయితే పైన తెలిపిన సూత్రాల ప్రకారం లెక్కగడితే సూర్యచంద్రుల గురుత్వ బలాలు భూమి మీద ఎలా ఉంటాయో తెలుస్తుంది. సూర్యగ్రహణం రోజున సూర్యుడు, చంద్రుడు భూమికి ఒకేవైపున ఉండడం వల్ల భూమిపై వీరిద్దరి గురుత్వ బలాలు ఒకేవైపు ఉంటాయి. భూమిని ఈ రెండూ ఒకేవైపునకు లాగుతాయి. అయినా భూమి గురుత్వబలం కూడా ఈ రెండింటినీ తన వైపు లాగుతుంది. చంద్రగ్రహణం సమయంలో సూర్యుని గురుత్వబలం ఒకవైపు, చంద్రుని గురుత్వబలం ఇంకోవైపు భూమిని లాగుతాయి.

ఆటుపోట్ల సంగతేమిటి?

మరి పౌర్ణమి రోజున సముద్రంలో ఆటుపోట్లకు కారణమైన గురుత్వ బలాలు మన మీద ఎలా ఉంటాయనే విషయాన్నీ తెలుసుకోవాలి. గురుత్వబలాలు దూరం, బరువుపైన ఆధారపడి ఉంటాయనే విశ్వ గురుత్వ బలసూత్రం ప్రకారం చంద్రుడి గురుత్వబలం మనపైన మన బరువులో 0.0003 వంతు ఉంటుంది. ఇది పరిగణనలోకి తీసుకోదగినది కాదు. అంటే మనమీద బలం ఏమీ ఉండదని అర్థం. అందుకే ఆటుపోట్లు అత్యధిక నీరు ఉండి, బరువు కలిగిన సముద్రంలో వస్తాయికాని, తక్కువ నీరు ఉండి బరువు తక్కువగా ఉండే చెరువు, కుంటల్లో, కుండల్లో రావు. అందువల్ల చంద్రుని గురుత్వ బలం మనమీద పెద్దగా ఉండదు. ఉదాహరణకు తుఫాన్ సమయంలో పెద్దపెద్దచెట్లు విరిగిపడినా గడ్డిపోచలు అలాగే ఉంటాయి. అటువంటిదే ఇది కూడా.

అందుకే నమ్మకాలను నమ్మకాలుగానే చూడాలి. సైన్స్ మాత్రం సత్యాలను కనుగొంటుంది. అనేక పరిశోధనలతో నిరూపిస్తుంది. నిరూపణకు నిలబడనిది సైన్స్ కాదు. సత్యాలు నిరూపితమైనా నమ్ముతామనడాన్ని మూఢనమ్మకం అంటాం. గ్రహణాల గురించిన వాస్తవాలను నాసా, ఇస్రో, అంతర్జాతీయ అస్ట్రానామికల్ యూనియన్‌తో పాటు అనేక ఖగోళ పరిశోధనా సంస్థలు పరిశోధనాత్మకంగా తెలుసుకొన్నాయి. వాటిని అందరం అధ్యయనం చేయాలి. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి.



టి. రమేష్
ప్రధాన కార్యదర్శి
ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్

సుడోకు

డైలీ సుడోకు 118 సమాధానం

8	1	7	3	2	5	6	9	4
9	3	6	7	4	8	1	5	2
5	2	4	9	6	1	8	7	3
7	8	2	1	3	4	5	6	9
3	6	5	2	8	9	4	1	7
4	9	1	6	5	7	2	3	8
1	5	8	4	9	3	7	2	6
2	7	9	8	1	6	3	4	5
6	4	3	5	7	2	9	8	1

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -119

	3		8		5			
2	8			3			5	
			7					8
	7					1		
1		6	3		9	5		4
		4					8	
9					4			
	1			7			2	9
			1		8		4	

ట్వీట్



'లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో' పాట ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజున విడుదల చేయనున్నాం. ఈ పాట వినగానే చాలా బాగా నచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాం.

అల్లు అర్జున్
@alluarjun



అల్లు అర్జున్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,896,022

కామన్‌మ్యాన్ వాయిస్

ఇంత చిన్న వయసులో ఎన్ని కష్టాలు
ఈ పసిప్రాయంలో ఆ బాలుడికి.. అమెరికా పానా బాధ్యత కూడా అప్పగిస్తావా?
సార్వ భౌ మాధికారం అని పలుకడం రాని పసివానికి ప్రపంచ బాధ్యతలు..
నీకిది న్యాయమా దేవుడా!

– Murali Buddha

ఒక బోర్లించిన బోర్న్‌వీటాలాంటి భవనం కట్టి..
నేనే హైదరాబాద్‌ను డెవలప్ చేసిన అని వోగ్రే పచ్చ పువ్వా..
పద్మశ్రీ ఫయిజుద్దీన్ మొత్తం భారత్‌కూ, హైదరాబాద్‌కు చేసిన సేవలు చదువండి..
ఇంకోసారి నేనే హైదరాబాద్‌ను డెవలప్ చేసిన అంటే సీరి సిన్తకు కట్టుడే..

– డా.కోదాటి సాంబయ్య

వైరల్ వీడియో



వింత శబ్దాలు వాటి వెనకున్న కారణాలు తెలియాలంటే ఈ వీడియో చూడండి.

BAMA BOOM MYSTERY Revealed in Telugu | Interesting Facts About Bama Boom | Vikram Aditya | EP#119

Total views : 168,941+

Published on Feb 3, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 6 ఫిబ్రవరి 2018



కల్యాణ్, ఆకుల శివ, సాయిధరమ్‌తేజ్, వినాయక్, లావణ్య త్రిపాఠి, నాగరాజు

వారే నాకు పంచభూతాలు!

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకుడు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. లావణ్య త్రిపాఠి కథానాయిక. ఈ నెల 9న విడుదలకానుంది. ఆదివారం రాజమండ్రిలో ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ 'చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్‌గారు కలిస్తే ఎలా వుంటుందో సాయిధరమ్‌తేజ్ స్టైల్ అలా వుంటుంది. మెగా కుటుంబంలోని కష్టపడే తత్వం తేజులో కనిపిస్తున్నది. చిరంజీవిగారిలా అతను అందరిని కలుపుకొని పోతుంటాడు. చిరంజీవి, పవన్‌కల్యాణ్ స్థాయిలో సాయిధరమ్‌తేజ్ పేరు సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో 'ఛమకు ఛమకు' పాట చేసేటప్పుడు చిరంజీవిగారే గుర్తుకొచ్చారు. పవన్‌కల్యాణ్‌గారు సినిమాలు చేయనని అంటున్నారు. ఆయన రాజకీయంగా ఎంత ఎదిగినా ప్రజా సమస్యలపై పోరాడుతూ సమయం చిక్కినప్పుడల్లా సినిమాలు చేయాలని ఆశిస్తున్నాను' అన్నారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ 'వినాయక్‌గారి దర్శకత్వంలో ఈ సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. చిరంజీవిగారు స్థాపించిన సామ్రాజ్యంలో జెండా రెపరెపలనే నా గుండె చప్పుడులుగా భావించి కష్టపడుతుంటాను. ఎప్పటికీ ఇలాగే శ్రమిస్తాను. చిరంజీవి, పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, వరుణ్...వీరు నాకు పంచభూతాలు' అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని 'ఛమకు ఛమకు' పాట ఫ్యాన్స్‌కు పండగలా వుంటుంది. ఇప్పటి వరకు సాయిధరమ్‌తేజ్ చేసిన సినిమాలకు పూర్తి భిన్నంగా వుండే చిత్రమిది. పాటలు చూస్తుంటే చిరంజీవిగారి సాంగ్స్ గుర్తుకొస్తున్నాయి. ఈ సినిమా కొత్త రికార్డులకు సృష్టిస్తుందన్న నమ్మకం వుంది' అన్నారు. సాయిధరమ్‌తేజ్‌ను చూస్తుంటే తనకు చిరంజీవి గుర్తుకువస్తున్నాడని మురళీమోహన్ తెలిపారు. గొప్ప చిత్రంలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని లావణ్యత్రిపాఠి చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

త్రివిక్రమ్ మార్క్ ప్రేమకథ



త్రివిక్రమ్, నితిన్, పవన్‌కల్యాణ్

నితిన్ కథానాయకుడిగా పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. మేఘా ఆకాష్ కథానాయిక. సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'అందమైన ప్రేమకథా చిత్రమిది. త్రివిక్రమ్ అద్భుతమైన కథను అందించారు. ఒక పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఇప్పటివరకు హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ప్రధాన ఘట్టాలను చిత్రీకరించాం. ఈ నెల 12న ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను, టీజర్‌ను 14న విడుదలచేయనున్నాం. ఏప్రిల్ 5న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. 'ప్రేమ, వినోదం మిళితమైన కుటుంబ కథా చిత్రమిది. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని దర్శకుడు పేర్కొన్నారు. నరేష్, లిజి, రోహిణి, రావురమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్. ఎస్. తమన్, కెమెరా: నటరాజ సుబ్రమణియన్, కూర్పు: ఎస్.ఆర్.శేఖర్, సమర్పణ: నిఖితారెడ్డి.



కాదంబరి కిరణ్‌కు చెక్‌ను అందిస్తున్న సంతోష్‌కుమార్

సినీ పరిశ్రమలో కష్టాల్లో ఉన్నవారికి ఆర్థికంగా చేయూతనందించి వారి జీవితాల్లో వెలుగులునింపే సమున్నత లక్ష్యంతో సినీనటుడు కాదంబరి కిరణ్ 'మనం సైతం' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాల్ని టీన్యూస్ ఎండీ, టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ప్రశంసించారు. తనవంతు విరాళంగా రెండులక్షల పదహారు వందల రూపాయల్ని 'మనం సైతం'కు అందజేసి సహృదయాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను సోమవారం కాదంబరి కిరణ్‌కు అందజేశారు.



మంచు విష్ణు

'ప్రస్తుతం సినిమా తీయడం కంటే విడుదల చేయడమే కష్టసాధ్యంగా మారింది. వారానికి ఒక సినిమా అనే రోజులు ఎప్పుడో పోయాయి. పట్టణాల్లో హిందీ, ఇంగ్లీష్ సినిమాల తాకిడికి తట్టుకొని నిలబడటం తెలుగు సినిమాలకు గగనమైపోతున్నది. అనారోగ్యకరమైన పోటీ పెరిగిపోయింది. యాభై, వంద రోజులు కనుమరుగైపోయాయి. నాలుగు వారాలు ఆడితే అదే గొప్పగా మారిపోయింది' అని అన్నారు మంచు విష్ణు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'గాయత్రి'. మోహన్‌బాబు కథానాయకుడిగా నటించారు. మదన్ దర్శకుడు. ఈ నెల 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో మంచు విష్ణు 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలివి...

నటనకు పనికివస్తానా? లేదా?..

ఈ సినిమాతో డిసైడ్ అవుతుంది!

'గాయత్రి' విడుదల కోసం ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నట్లున్నారు?

• నటుడిగా నన్ను నేను నిరూపించుకునే చిత్రమిది. నటనకు పనికివస్తానా? లేదా?అన్నది ఈ సినిమాతో డిసైడ్ అవుతుంది. సినిమాలో నేను కనిపించేది పదిహేను నిమిషాలే అయినా కథను నా పాత్ర ప్రభావితం చేస్తుంది. నటుడిగా నాకు మర్యాదను తీసుకొచ్చే సినిమా అవుతుంది.

సవాల్‌తో కూడిన పాత్ర అనుకోవచ్చా?

• ఒకే తరహా పాత్రలకే పరిమితమైపోకుండా నటుడిగా భిన్నత్వంతో కూడిన సినిమాలు చేయాలనుంది. శక్తివంతంగా సీరియస్ కోణంలో సాగే పాత్రలో నటించాలనే నా కల 'అనుక్షణం' సినిమాతో తీరింది. ఆ సినిమా తర్వాత నాలోని నటుడికి సవాల్ విసిరే పాత్రను మళ్లీ 'గాయత్రి'లో చేశాను.

ఈ సినిమాలో మీరు మోహన్‌బాబుగారి యుక్తవయసు పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిసింది?

• ఇందులో నాన్న రెండు పాత్రల్లో కనిపిస్తారు. ఒకటి మంచివాడుగా సాఫ్ట్‌తరహాలో సాగితే... మరొకటి ప్రతినాయక ఛాయలతో క్రూరంగా సాగుతుంది. రెండు పాత్రలు భిన్న పార్శ్వాలతో సాగుతాయి. నాన్న పాత్రలో కనిపించడానికి ఆయన బాడీలాంగ్వేజ్, హావభావాలను అనుకరించకుండా నా శైలిలో నటించాను. ఆయన స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా నటించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. భయాలేవి పెట్టుకోకుండా నటించాను.

ఇంతకీ గాయత్రి కథేమిటి?

• ఓ తండ్రికి, కూతురికి మధ్య జరిగే కథ ఇది. తన కూతురి కోసం ఓ తండ్రి పడే తపనను దర్శకుడు మదన్ హృద్యంగా తెరపై ఆవిష్కరించారు. పాత్రల మధ్య నాటకీయతను చక్కగా చూపించారు. నాకు, శ్రియకు మధ్య వచ్చే సన్నివేశాలు అందంగా సాగుతాయి.

నటుడిగా మీకు ఎలాంటి పాత్రలంటే ఇష్టం?

• యాక్షన్ కామెడీ కథల్లో సులువుగా ఇమిడిపోతాను. గాడ్‌గిఫ్ట్ అది. అలాగని ఎప్పుడూ అలాంటి సినిమాల్లోనే నటిస్తూ వెళితే రొటీన్ అవుతుంది. అల్లుడుగారు, బొమ్మరిల్లు, అసెంబ్లీరౌడీ, జగదేకవీరుడు అతిలోకసుందరి లాంటి హృదయాల్ని స్పృశించే కథలతో సినిమాలు వచ్చి చాలా సంవత్సరాలైంది. రచయితలు, దర్శకులు అలాంటి కథల్ని సృష్టించాలి.

ఒకేసారి మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉండటం ఎలా అనిపిస్తున్నది. ఏడాదికి ఇన్ని సినిమాలు చేయాలనే ప్రణాళికలు పెట్టుకుంటారా?

• ఈ ఏడాది 'గాయత్రి'తో పాటు 'ఆచారి అమెరికా యాత్ర' 'ఓటర్' పూర్తయ్యాయి. మరో సినిమాకు అంగీకరించాను. ఓ సంవత్సరంలో నేను నటించిన నాలుగు సినిమాలు విడుదల కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతి ఏడాది ఇలాగే కాకపోయినా కనీసం రెండైనా సినిమాలు చేయాలని ఉంది.

'దేనికైనా రెడీ' తర్వాత మరోసారి బ్రాహ్మణుల నేపథ్యంతో 'ఆచారి అమెరికా యాత్ర' చేయబోతున్నారు. ఈ సినిమా రూపకల్పనలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

• రాజకీయాల పరంగా తమ ఉనికిని చాటుకోవడానికి కొందరు 'దేనికైనా రెడీ' సినిమాను అడ్డుకున్నారు. బ్రాహ్మణుల్ని కించపరిచే సన్నివేశాలున్న చాలా సినిమాల్ని వదిలిపెట్టి మా చిత్రంపై అభ్యంతరాలు వ్యక్తంచేశారు. వినోదాన్ని నమ్మే ఆ ప్రయత్నం చేశాం. ఆ సినిమాతో ఎదురైన అనుభవాల దృష్ట్యా 'ఆచారి అమెరికా యాత్ర' రూపకల్పనలో జాగ్రత్తలు తీసుకున్నాం. కులాన్ని, మతాలకు వ్యతిరేకంగా వుండే సన్నివేశాలు కనిపించవు. 'బారిష్టర్ పార్వతీశం' నవల అంటే నాకు చాలా ఇష్టం. అలాంటి కామెడీ కథతో సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది.

వెబ్‌సీరిస్‌లు, అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి డిజిటల్ మాధ్యమాల ప్రభావం సినిమాలపై ఎంతవరకు ఉంటుందని అనుకుంటున్నారు.

• సాంకేతికంగా ప్రపంచంలో ప్రతిరోజు కొత్త కొత్త మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భవిష్యత్తులో డిజిటల్ రివల్యూషన్ పరంగా ఇండియా ఆధిపత్యం పెరుగుతున్నది. వెబ్‌సిరీస్‌లు సినిమాలతో పాటుగా చక్కటి ఆదరణను చూరగొంటున్నాయి. నవ్యమైన ఆలోచనలతో వాటిని రూపొందిస్తూ నవతరం దర్శకులు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. అలాగని వాటి ప్రభావం సినిమాలపై పెద్దగా ఉండదని అనుకుంటున్నాను. థియేటర్‌లో సినిమా చూస్తే వచ్చే సంతృప్తి వేరుగా ఉంటుంది. మంచి కథ లభిస్తే వెబ్‌సిరీస్‌లలో నటించడానికి నేను సిద్ధమే.

అవ్రామ్ భక్త మంచు అనికొడుకుకు వైవిధ్యంగా పేరు పెట్టారు?

• అవ్రామ్ అంటే ఎవరూ ఆపలేనివాడు అని అర్థం. అలాగే నాన్నగారి పేరులోని భక్త కలిసివచ్చేట్లుగా ఆ పేరు పెట్టాను.

వారసత్వానికి అమ్మాయి, అబ్బాయి అనే తేడాలుండవని ఈ మధ్య ట్విట్టర్‌లో చాలా ఘాటుగా స్పందించారు?

• వారసుడేపుట్టాలని కొందరు నాకు పంపించిన మెసేజ్‌లు చూడగానే చాలా కోపం వచ్చింది. వారసత్వాన్ని కొనసాగించడానికి మగాడు కావాల్సిన అవసరం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటున్నారు. ఇంటి పనులు, పిల్లల చదువులతో పాటు ఉద్యోగబాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

సినిమాల్లో పడి పిల్లలకు దూరమయ్యాననే భావన ఎప్పుడైనా కలిగిందా?

• క్లబ్, పబ్‌లు వెళ్లే అలవాటు నాకు లేదు. సినిమాలు తప్ప నాకు మరో ప్రపంచం తెలియదు. కొత్త కథలు వినడం, సాంకేతికంగా సినీ రంగంలో వస్తున్న మార్పులు తెలుసుకుంటాను. విరామం దొరికితే పిల్లలతో ఎక్కువగా గడుపుతాను. వారి ఫేవరేట్ హీరోను నేనే. నాన్నతో చనువుగా ఉన్నా ఆయనంటే తెలియని భయం వారిలో ఉంటుంది. 'ఆచారి అమెరికా యాత్ర' సినిమా చూసి నాన్న 'యూ ఆర్ వెరీ ఫన్నీ' అన్నారు.





జితన్‌రమేష్, శృతియుగల్

మానవీయ విలువలతో 'ఒక్కటే లైఫ్'

ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' ఉపశీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్‌రామ్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'టెక్నాలజీ పేరుతో పరుగులు తీస్తున్న నేటితరం మానవ సంబంధాలకు, భావోద్వేగాలకు ప్రాధాన్యతనివ్వడం లేదు. మానవీయ అంశాల్ని జీవితంలో ముఖ్యంగా పరిగణించాలని ఈ సినిమా ద్వారా తెలియజేస్తున్నాం. సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత వుంటుంది' అన్నారు. 'ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచే చిత్రమవుతుంది' అని నిర్మాత అన్నారు. శృతియుగల్, సుమన్, నల్ల వేణు, జబర్దస్త్ రామ్, బాబి, రిషి, శ్యామ్, దిశ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అమ్రీష్, కూర్పు: నందమూరి హరి, ఆర్ట్: విజయ్‌కృష్ణ, కెమెరా: వై.గిరి, రచన: సతీష్.


ARIAANA - VIVIANA - VIDYA NIRVANA PRESENT
SREE LAKSHMI PRASANNA PICTURES
#MB42
ఫిబ్రవరి
9
విడుదల
గాయత్రి
GAYATRI
DR M MOHAN BABU
MADAN RAMIGANI
VIJAY BANDLA
SUBBA ARUMILLI
SARVESH MURARI
'DIAMOND' RATNABABU
PARUCHURI BROTHERS
S S THAMAN
KANAL KANNAN
CHINNA
MR VARMA
WORKING TITLE
U/A
sillymonks

టీఎస్ఆర్టీసీకి స్ఫూర్తి అవార్డు



సోమవారం బస్‌భవన్‌లో టీఎస్ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావుకు స్ఫూర్తి అవార్డు అందజేస్తున్న సేవ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కే శ్రీధర్, సలహాదారుడు కే విజయ్ తదితరులు

సంస్థ ఎండీకి అందజేసిన సేవ్ లైఫ్ ఫౌండేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు భద్రత, ఇంధనపొదుపు, వాయుకాలుష్య నివారణలో పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)కు సేవ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థ స్ఫూర్తి అవార్డు బహూకరించింది. సోమవారం బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కే శ్రీధర్, సలహాదారుడు కే విజయ్.. టీఎస్ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావుకు అవార్డును అందజేసి ఆయనను ఘనంగా సత్కరించారు. సంస్థ కార్మికులు, సిబ్బంది, అధికారుల కృషితోనే టీఎస్ఆర్టీసీకి పేరు ప్రఖ్యాతులు లభిస్తున్నాయని, ఈ అవార్డు వారికే చెందుతుందని రమణారావు చెప్పారు.



సోమవారం టీన్యూస్ కార్యాలయంలో జాంఢ్ర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీ న్యూస్ ఎండీ, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్

జాంఢ్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర జాంఢ్ర సంఘం 2018 క్యాలెండర్‌ను టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీ న్యూస్ ఎండీ జోగినపల్లి సంతోష్‌కుమార్ సోమవారం టీ న్యూస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జాంఢ్ర సంఘం ప్రతినిధులు అనూప్‌కుమార్, పొట్ల రామస్వామి, శ్యామలాదేవి, దొడ్డి ప్రవీణ్, దేవరకొండ వెంకటేశ్, శ్యాం, లింగం, విభూతిరాజు ఉన్నారు.

దర్యాప్తులో టెక్నాలజీ కీలకం

అదనపు డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేసుల దర్యాప్తులో టెక్నాలజీ పాత్ర కీలకమని అదనపు డీజీపీ రవిగుప్తా అన్నారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 229 మంది కానిస్టేబుళ్లకు పోలీసు అకాడమీలో టెక్నాలజీపై నెలరోజుల శిక్షణ సోమవారం ముగిసింది. టెక్నాలజీ వాడకంతో కేసుల దర్యాప్తులో వేగం పెరిగిందని అదనపు రవిగుప్తా తెలిపారు. కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడంతో ఎంతో ప్రయోజనమున్నదని పోలీసు అకాడమీ డైరెక్టర్ జితేందర్ అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శైలేంద్రకుమార్ జోషిని సోమవారం సచివాలయంలో టీఎన్జీవో కేంద్రసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్ నాయకులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ బాంబుపేలుళ్ల కేసు..

ఉగ్రవాది షఫీముజబర్ అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద బాంబుపేలుళ్లకు కుట్రపన్నిన కేసులో 16 ఏండ్లుగా తప్పించుకొని తిరుగుతున్న టెర్రరిస్టును సోమవారం సీఐడీ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. 2002 దిల్‌సుఖ్‌నగర్ బాంబుపేలుళ్ల కుట్రలో ఒమన్ నివాసి, ఉగ్రవాది షఫీముజబర్ నిందితుడిగా ఉన్నాడు. ఒమన్‌లోని సుల్తానట్‌లో పట్టుకోగా, ఆదివారం ఢిల్లీకి తరలించారు. సోమవారం ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన రాష్ట్ర సీఐడీ పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు.

ఐదు సబ్‌జైళ్ల మూసివేత

- జైళ్లశాఖ నిర్ణయం
- సత్ఫలితాలిస్తున్న సంస్కరణలు
- తగ్గిపోతున్న నేరస్థుల సంఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదేపదే నేరాలకు పాల్పడే పాత నేరస్థుల సంఖ్య తగ్గడంతో రాష్ట్రంలోని ఐదు సబ్‌జైళ్లు మూసి వేయాలని జైళ్లశాఖ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం, మూడున్నరేండ్లుగా చేపట్టిన కృషి, సంస్కరణల వల్ల జైళ్లకు తరచుగా వచ్చే నేరస్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రికార్డుల ప్రకారం.. జైళ్లల్లో 6848 మంది ఖైదీలు ఉండే సామర్థ్యం ఉండగా, సంస్కరణల ఫలితంగా ఇప్పుడు 5,348 మంది ఖైదీలు మాత్రమే మిగిలారు. వచ్చే ఐదేండ్లలో ఈ సంఖ్యను కూడా సగానికి తగ్గిస్తామంటూ అధికారులు ధీమాను వ్యక్తం చేశారు. కొన్ని సబ్ జైళ్లలో ఖైదీల సంఖ్య గణనీయంగా తగ్గడంతో వాటిని మూసివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. మూసివేతకు సిద్ధంగా ఉన్న జైళ్లలోని ఆ కొద్దిపాటి ఖైదీలను జిల్లా జైళ్లకు మార్చాలని భావిస్తున్నారు. పదేపదే నేరాలకు పాల్పడి జైలుకు వచ్చేవారి ప్రవర్తనలో మార్పునకు అధికారులు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్య, ఉపాధిశిక్షణ ఇవ్వడే కాకుండా విడుదలైన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో పాతనేరస్థులు నేరజీవితం నుంచి వైదొలుగుతున్నారు. నేరస్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పటింది. సామాజిక కార్యక్రమాల్లోనూ వారిని భాగస్వాములను చేస్తూ.. ప్రజలతో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సంస్కరణలతో ఖైదీల మానసికస్థితి, పరివర్తనలో మార్పును తీసుకువస్తున్న జైళ్లశాఖ.. నేరాలు తగ్గించడంతోపాటు వచ్చే ఐదేండ్లలో ఖైదీల సంఖ్యను 2500కు తగించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నది.

మూసివేయాలని నిర్ణయం తీసుకున్న సబ్ జైళ్ల వివరాలు

సబ్‌జైలు	జిల్లా	సామర్థ్యం	ప్రస్తుత ఖైదీల సంఖ్య
ఆర్మూర్	నిజామాబాద్	10	02
బోధన్	నిజామాబాద్	17	02
నర్సంపేట	వరంగల్	30	07
పరకాల	వరంగల్	30	02
మధిర	ఖమ్మం	20	10

మన జైళ్లశాఖ దేశంలోనే నంబర్‌వన్

తెలంగాణ జైళ్లశాఖ నేడు దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని డీజీ వీకే సింగ్ తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో మూడున్నరేండ్లుగా చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయని సోమవారం హైదరాబాద్‌లో తెలిపారు. సంస్కరణలతో ఖైదీల్లో చాలా మార్పులు తీసుకువస్తున్నట్టు తెలిపారు. మూడు జిల్లాలలో ఉన్న ఐదు సబ్ జైళ్లలో ఇద్దరు, ముగ్గురు ఖైదీలే ఉన్నారని తెలిపారు. ఈ ఐదు సబ్‌జైళ్లను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

పురుషోత్తంరెడ్డికి ఆశ్రయమిస్తే చర్యలు

ఆచూకీ తెలిస్తే 9440446109కు ఫోన్‌చేయండి: ఏసీబీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తప్పించుకొని తిరుగుతున్న హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డికి ఎవరైనా ఆశ్రయం కల్పిస్తే ఐపీసీ 212 సెక్షన్ కింద చర్యలు తప్పవని అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) హెచ్చరించింది. నేరం చేయడమే కాదు... నేరస్థులకు ఆశ్రయం ఇవ్వడం కూడా నేరమేనని ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం చెప్పారు. పురుషోత్తంరెడ్డి ఇంటితోపాటు అతడి బామ్మర్ది, మరికొందరి బంధువుల ఇండ్లలో ఇటీవల చేపట్టిన సోదాల్లో దాదాపు రూ.25 కోట్ల (మార్కెట్ ధర) విలువజేసే ఆస్తులను ఏసీబీ గుర్తించింది. పురుషోత్తంరెడ్డితోపాటు అతడి బంధువులను పట్టుకునేందుకు అన్నిమార్గాల్లో నిఘా పెట్టామని, వారికి సంబంధించిన సమాచారం ఉంటే 9440446109కు ఫోన్‌చేసి తెలుపాలని అశోక్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

'జైళ్లలో మానవ హక్కులు' సదస్సు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సోమవారం చంచల్‌గూడలో బ్యూరో ఆఫ్ పోలీసు రిసోర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 'జైళ్లలో మానవ హక్కులు' అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల సదస్సును రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ ప్రారంభించారు. జైళ్లలో మానవ హక్కులు, వ్యక్తిత్వ వికాసం, జైలు వార్డర్ నుంచి ఐజీ వరకు జైళ్ల శాఖ విధి విధానాలపై ప్రముఖులు మాట్లాడతారని ఐజీ ఆకుల నర్సింహ తెలిపారు.

20 నుంచి ఆర్ఎస్ఐలకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 20వ నుంచి తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ ప్రారంభం అవుతుందని టీఎస్ఎస్పీ ఐజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 9న పూర్తి సర్టిఫికెట్లు, సంబంధిత పత్రాలు, డీడీ, ఫొటోలతో జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్ 10-సీ శౌర్యభవనంలో ఉన్న టీఎస్ఎస్పీ ఐజీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట రూ. 15 వేల డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకురావాలన్నారు. గతంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వని వారు 12 పాస్ పోర్టు ఫొటోలు, ఇండెమ్నిటీ బాండ్ తీసుకురావాలని ఆయన సూచించారు.

సెన్సెక్స్	నిఫ్టీ
34,757	10,666
↓ 310	↓ 94

ముడి చమురు (బ్రెంట్) ↓ 67.71 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,455
22 క్యారెట్లు	30,305
వెండి (కిలో)	38,730

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.37	67.68
బహ్రెయిన్ దినార్	158.08	181.15
కువైట్ దినార్	176.98	220.32
సౌదీ రియాల్	15.52	18.40
యూఏఈ దిర్హామ్	15.89	18.57

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	66.00
రిటైల్ లైవ్	88.00
డ్రెస్డ్	128.00
స్కిన్‌లెస్	145.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	360-00
రంగారెడ్డి	360-00
మెదక్	360-00
కరీంనగర్	362-00
వరంగల్	362-00
రిటైల్ ప్రైస్	4-40

వెంటాడిన బడ్జెట్

మదుపరులలో తొలగని భయాలు

సెన్సెక్స్ మరో 310 పాయింట్లు పతనం

ముంబై, ఫిబ్రవరి 5: బడ్జెట్ ప్రకంపనాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు గజగజ వణుకుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న భయాలు కూడా వరుస నష్టాలకు ఆజ్యం పోస్తున్నాయి. దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను ప్రకటన నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకే మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 309.59 పాయింట్లు పడిపోయి 34,757.16 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 94.05 పాయింట్లు దిగజారి 10,666.55 వద్ద నిలిచింది. దీంతో గడిచిన నాలుగు ట్రేడింగ్‌లలో సెన్సెక్స్ 1,208 పాయింట్లకుపైగా, నిఫ్టీ 361 పాయింట్లు వరకు కోల్పోయినట్లైంది. గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు హారతి కర్పూరంలా కరిగిపోగా, స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల విలువ రూ.5,04,253 కోట్లు క్షీణించి రూ.1,47,95,747 కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, విప్రో, హెచ్‌యూఎల్, మహీంద్రా, టాటా స్టీల్‌లు నాలుగు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. రంగాల వారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్ 2.65 శాతం, బ్యాంకెక్స్ 1.11 శాతం, మెటల్, రియల్టీ, ఐటీ, మౌలిక, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగాల షేర్లు నష్టపోయాయి. బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ రంగాల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

ఐఫోన్లు మరింత ప్రియం

- రూ.3,210 వరకు ధరలు పెంచిన సంస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఐఫోన్లు మరింత ప్రియమయ్యాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో మొబైళ్లపై కస్టమ్స్ సుంకాన్ని పెంచుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆపిల్..తమ ఐఫోన్ల ధరలను రూ.3,210 వరకు సవరించింది. కంపెనీకి చెందిన గడియారాల ధరలు సైతం రూ.2,510(7.9 శాతం) వరకు పెరిగాయి. కంపెనీ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో 256 జీబీ వెర్షన్ ఐఫోన్ ఎక్స్ మోడల్ ధర గరిష్ఠంగా రూ.3,210 పెరుగడంతో రూ.1,08,930కి, ఐఫోన్ 6 (32జీబీ వెర్షన్) ధర రూ.1,120 అధికమవడంతో రూ.31,900కి చేరుకున్నాయి. పెరిగిన ధరలు సోమవారం నుంచే అమలులోకి వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

దేశీయ వ్యాపారంపై పెగాసిస్టమ్స్ దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 5: భారత్‌లో పూర్తిస్థాయి వ్యాపార కార్యకలాపాలను త్వరలోనే ప్రారంభిస్తామని పెగాసిస్టమ్స్ ఇండియా ఎండీ సుమన్ రెడ్డి పీటీఐకి తెలిపారు. ప్రస్తుతం ఈ టెక్నాలజీ సంస్థకు హైదరాబాద్, బెంగళూరుల్లో రెండు డెవలప్‌మెంట్ సెంటర్లుండగా, వీటిలో 1,500 మంది పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లోనే 1,100 మంది ఉద్యోగులున్నారు. ఉద్యోగుల్ని మరింతగా పెంచుకుంటామని సుమన్ రెడ్డి చెప్పారు.

టీవీఎస్ నుంచి సరికొత్త స్కూటర్



చెన్నై, ఫిబ్రవరి 5: స్కూటర్ మార్కెట్ పరిధిని మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో టీవీఎస్ మోటార్..సరికొత్త వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 125 సీసీ సామర్థ్యంతో రూపొందించిన 'ఎంటోర్క్' ధరను రూ.58,750గా నిర్ణయించింది. యువతను దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన ఈ స్కూటర్..ఇప్పటికే మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన స్కూటీ పెప్, జూపిటర్‌లతో పాటు లభించనున్నదని టీవీఎస్ మోటార్ ప్రెసిడెంట్, సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ తెలిపారు. మార్కెట్లోకి విడుదల చేసిన తొలి ఏడాదిలో 2 లక్షల యూనిట్లను విక్రయించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది.

సామ్‌సంగ్ వారసుడి విడుదల

సియోల్, ఫిబ్రవరి 5: అవినీతి కేసులో జైలుశిక్షను అనుభవిస్తున్న ప్రముఖ ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ వారసుడు, సంస్థ వైస్ చైర్మన్ లీ జే-యాంగ్‌ను తక్షణమే విడుదల చేయాలని దక్షిణ కొరియా అప్పీళ్ల కోర్టు ఆదేశించింది. ఈ కేసులో లీకి ఐదేండ్ల జైలుశిక్ష పడింది. అయితే ఈ వ్యవహారంపై జరిపిన విచారణలో అప్పీళ్ల కోర్టు లీపై ఉన్న ఆరోపణలను కొట్టివేసి, సోమవారం విడుదలకు ఆదేశించింది.

ఇప్పుడు కాదు.. ఏప్రిల్ 1 తర్వాతే

అప్పుడు అమ్మిన షేర్లకే ఎల్‌టీసీజీ పన్ను • స్పష్టతనిచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:



దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను.. ఏప్రిల్ 1 తర్వాత అమ్మే షేర్లపై వచ్చిన లాభాలకే వర్తిస్తుందని సోమవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈ నెల 1న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఎల్‌టీసీజీని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన షేర్లను తిరిగి అమ్మినప్పుడు వచ్చే లాభాలు రూ.లక్ష దాటితే అందులో 10 శాతం ఎల్‌టీసీజీ పన్నుగా చెల్లించాలని జైట్లీ బడ్జెట్‌లో ప్రకటంచారు. ఈక్విటీ నేపథ్యం కలిగిన మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చిన ఆదాయంపైనా 10 శాతం పన్ను చెల్లించాల్సిందేనన్నారు. అయితే జనవరి 31 వరకు జరిగిన షేర్ల అమ్మకాలపై వచ్చిన లాభాలకు పన్ను చెల్లించనక్కర్లేదని వెల్లడించారు. ఈ క్రమంలో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుండగా, భీకర నష్టాలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జనవరి 31న స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో నమోదైన ఆయా షేర్ల గరిష్ఠ విలువల ఆధారంగా లాభాలను గణిస్తామని, ఈ ధరల ప్రామాణికంగానే ఎల్‌టీసీజీ పన్ను ఉంటుందని, ఏప్రిల్ 1 అనంతరం షేర్ల అమ్మకాలకే దీన్ని వర్తింపజేస్తామని కేంద్రం తెలియజేసింది. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 మధ్య జరిగే షేర్ల అమ్మకాలకు ఎల్‌టీసీజీలోని సెక్షన్ 10లోగల క్లాజు (38) ప్రకారం పన్ను మినహాయింపునిస్తామని వివరించింది. ఎల్‌టీసీజీ పన్ను దెబ్బతో సెన్సెక్స్ ఏకంగా 1,200 పాయింట్లకు పైగా పతనమైంది. సోమవారం కూడా మార్కెట్లు నష్టాలకే పరిమితం కావడంతో మదుపరుల్లో నెలకొన్న భయాలను పోగొట్టే ప్రయత్నం చేసింది మోదీ సర్కారు. తరచుగా అడిగిన ప్రశ్నల (ఎఫ్‌ఏక్యూ)పై వివరణ ఇవ్వడంలో భాగంగా ఎల్‌టీసీజీ అమలుపై స్పష్టతనిచ్చింది. కాగా, పన్ను ఎగవేతలను అరికట్టడంలో భాగంగానే ఎల్‌టీసీజీని కేంద్రం.. పద్నాలుగేండ్ల తర్వాత మళ్లీ తీసుకువచ్చింది. కొనుగోలు చేసిన షేర్లను ఏడాదిలోపే తిరిగి అమ్మేస్తే వచ్చే లాభాలపై ప్రస్తుతం 15 శాతం ఎల్‌టీసీజీ పన్ను పడుతున్నది. ఏడాది తర్వాత అమ్మితే మాత్రం ఎల్‌టీసీజీ వర్తించడం లేదు. కానీ తాజా నిర్ణయంతో ఇక ఎప్పుడు అమ్మినా.. లాభం రూ.లక్ష దాటితో అందులో 10 శాతం పన్ను చెల్లించాల్సిందే.

పన్నుల్లో అసమానతలను తొలగిస్తాం

వేతన జీవులు, వ్యాపార వర్గాలు చెల్లిస్తున్న పన్నుల్లో అసమానతలను తొలగిస్తామని ఆర్థిక కార్యదర్శి అధియా అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడుతున్నదని తెలిపారు. 7 లక్షల సంస్థల్లో 50 శాతం సంస్థలు దాఖలు చేస్తున్న ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నుల్లో ఆదాయం ఏమీ లేనట్లుగా లేదా ప్రతికూలాత్మక ఆదాయాన్ని చూపిస్తున్నారని చెప్పారు. కాగా, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు తర్వాత పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగిందన్న అధియా.. జీఎస్టీకి దన్నుగా ప్రభుత్వం ఆదాయాన్ని త్యాగం చేసిందన్నారు.

నష్టాలకు ఎల్‌టీసీజీ కారణం కాదు!: అధియా

ప్రస్తుత స్టాక్ మార్కెట్ నష్టాలకు ఎల్‌టీసీజీ పన్ను కారణం కాదని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందుతున్న బలహీన సంకేతాలేనని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా అన్నారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కదలాడుతున్నాయని, ఈ ప్రభావంతోనే భారతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయన్న ఆయన ఎల్‌టీసీజీ ప్రకటనప్పుడే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నిజానికి 10 శాతం ఎల్‌టీసీజీ పన్నును తక్కువగా అభివర్ణించిన అధియా.. స్టాక్ మార్కెట్లలో లేని సంస్థల లావాదేవీలపై, స్థిరాస్తుల అమ్మకంపై ప్రస్తుతం 20 శాతం పన్ను పడుతున్నదని గుర్తుచేశారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ.. సోమవారం నిర్వహించిన బడ్జెట్ తదనంతర సమావేశంలో అధియా పాల్గొన్నారు. భారతీయ స్టాక్ మార్కెట్లకు అంతర్జాతీయ ఒడిదుడుకుల నుంచి మినహాయింపేమీ లేదన్న ఆయన అమెరికాసహా ఐరోపా, ఆసియా మార్కెట్ల నష్టాల ప్రభావమే అధికమని అభిప్రాయపడ్డారు. ఆదివారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఎల్‌టీసీజీ పన్ను ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం రెండేండ్లలో రెండింతలు కాగలదన్న విశ్వాసాన్ని అధియా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.20,000 కోట్లుగా, 2019-20లో రూ.40,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. 2017-18 మదింపు సంవత్సరం కోసం దాఖలైన ఐటీ రిటర్నుల ప్రకారం పన్ను మినహాయింపు ఆదాయం రూ.3.76 లక్షల కోట్లుగా ఉందన్న ఆయన ఇది చాలా ఎక్కువని, ఇదంతా కూడా స్టాక్ మార్కెట్ లిస్టింగ్ షేర్ల నుంచి పొందుతున్నదేనని, దీనికి ఎల్‌టీసీజీ కింద మినహాయింపు వస్తున్నదన్నారు.

ఎయిర్‌టెల్‌లో వాటా పెంచుకున్న సింగ్‌టెల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశీయ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌లో వాటాను మరింత పెంచుకున్నట్లు సింగపూర్‌కు చెందిన టెలికం సేవల సంస్థ సింగ్‌టెల్ ప్రకటించింది. 1.7 శాతానికి సమానమైన 8.54 కోట్ల షేర్లను కొనుగోలు చేయడానికి సింగ్‌టెల్ రూ.2,649 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. దీంతో ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 48.9 శాతానికి చేరుకోగా, భారతీకి 50.1 శాతం వాటా ఉన్నది. వచ్చే నెల చివరినాటికి ఈ ఒప్పందం పూర్తికానున్నట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. రుణాలను తగ్గించుకోవడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. డిసెంబర్ 31 నాటికి కంపెనీకి రూ.91,714 కోట్ల అప్పు ఉన్నది. గడిచిన రెండు దశాబ్దాలకు పైగా సింగ్‌టెల్‌తో కలిసి పనిచేస్తున్నామని, ఈ తాజా పెట్టుబడులతో బంధం మరింత బలోపేతం కానున్నదని భారతీ టెలికం ఎండీ దేవన్ ఖన్నా తెలిపారు. దీంతో కంపెనీ షేరు ధర 4.2 శాతం లాభపడి రూ.439.5 వద్ద ముగిసింది.

మినహాయింపులన్నీ రద్దయితేనే..

కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించడంపై జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించవచ్చని, అయితే పారిశ్రామిక రంగానికి ఇస్తున్న మినహాయింపులన్నింటినీ నిలిపివేసినప్పుడే ఇది సాధ్యమవుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. భారత వాణిజ్య, పారిశ్రామిక మండళ్ల సమాఖ్య సోమవారం ఇక్కడ నిర్వహించిన సార్వత్రిక బడ్జెట్ 2018-19 అనంతర సమావేశంలో జైట్లీ ప్రసంగిస్తూ.. 30 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నును నాలుగేళ్లలో 25 శాతానికి తగ్గిస్తానని 2015లో హామీ ఇచ్చానని, ఇదే సమయంలో అన్ని మినహాయింపులను రద్దు చేసుకోవాలన్న షరతును కూడా విధించానని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ద్రవ్యలోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.2 శాతానికి పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని అందుకోలేకపోవడానికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు 11 నెలల పాటే జరగడం, వ్యయాన్ని మాత్రం 12 నెలలకు లెక్కగట్టడమే కారణమన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వసూళ్లు ఊపందుకుంటాయని, దీంతో భవిష్యత్తులో ద్రవ్యలోటు లక్ష్యాన్ని అధిగమించడం సులభతరమవుతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే పెట్రోలియం ఉత్పత్తులపై తక్షణమే కొత్త పరోక్ష పన్నును విధించే అవకాశం కూడా లేదని జైట్లీ చెప్పారు.

పన్నురేట్లు చాలా తగ్గాయ్

- ఎగ్గొట్టేందుకు ప్రయత్నించవద్దు
- ఉద్యోగుల కంటే బాధ్యతగా వ్యవహరించాలి
- పారిశ్రామిక, వ్యాపార వర్గాలకు సీబీడీటీ చీఫ్ సుశీల్ చంద్ర హితవు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలోని పెద్ద కంపెనీలకు ప్రభుత్వం అనేక మినహాయింపులను ఇవ్వడంతో వారు చెల్లించాల్సిన పన్ను రేటు ఇప్పటికే 26 శాతానికి తగ్గిందని, కనుక పన్నులను ఎగ్గొట్టేందుకు ఎవరూ చట్టాల్లోని నిబంధనలను దుర్వినియోగం చేయరాదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ సుశీల్ చంద్ర పారిశ్రామిక, వ్యాపార వర్గాలకు హితవు పలికారు. ప్రభుత్వానికి సకాలంలో పన్నులను చెల్లించడంతో పాటు పన్నుల విషయంలో బాధ్యతతో వ్యవహరించే సమాజాన్ని నిర్మించడంలో ఉద్యోగుల కంటే పారిశ్రామిక, వ్యాపార వర్గాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక బడ్జెట్ 2018-19 అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య సోమవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. 'పన్ను చెల్లింపుల విషయంలో మీరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఆటోమేటిక్‌గా పన్నురేట్లు వాటంతట అవే తగ్గుతాయి. పన్ను చెల్లింపుల విషయంలో క్రమశిక్షణతో వ్యవహరించే సమాజాన్ని నిర్మించేందుకు మేము మీతో కలిసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో వేతన జీవుల కంటే పారిశ్రామిక, వ్యాపార వర్గాలపైనే ఎక్కువ బాధ్యత ఉందన్న విషయాన్ని మీరు గుర్తెరగాలి' అని స్పష్టం చేశారు. సంవత్సరానికి రూ.250 కోట్లలోపు టర్నోవర్ కలిగివున్న వ్యాపారులు చెల్లించే కార్పొరేట్ పన్నును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈసారి బడ్జెట్‌లో 25 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ రంగంలోని వేర్వేరు క్యాటగిరీల వారు చెల్లించే పన్నులను కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి దశలవారీగా తగ్గించింది. దీంతో ఇప్పుడు కేవలం 7 వేల కార్పొరేట్ సంస్థలు మాత్రమే 30 శాతం పన్ను శ్లాబులో ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన వేర్వేరు మినహాయింపులను కూడా గమనంలోకి తీసుకుంటే ఇప్పుడు దేశంలోని పెద్ద కంపెనీలు చెల్లించాల్సిన పన్ను రేటు కేవలం 26 శాతం మాత్రమేనని సుశీల్ చంద్ర పేర్కొన్నారు.

సకాలంలో రిటర్నులు దాఖలు చేస్తేనే..

ఇదిలావుంటే, ప్రాఫిట్ లింక్డ్ డిడక్షన్స్ (లాభం ఆధారిత మినహాయింపుల) కోసం క్లెయిమ్ చేసుకునే కంపెనీలు తప్పనిసరిగా సకాలంలో ఆదాయం పన్ను రిటర్నులను దాఖలు చేసి తీరాలని ఆయన స్పష్టం చేశారు. సీ-డిడక్షన్స్ శీర్షిక కింద ఒక తరగతిలోని వారందరికీ కల్పిస్తున్న మినహాయింపు ప్రయోజనాన్ని చాప్టర్-5ఏ కొన్ని ఆదాయ వర్గాల వారికి కల్పించేందుకు వీలుగా ఆదాయం పన్ను చట్టంలోని సెక్షన్-80ఏసీ పరిధిని విస్తరించాలని, అయితే సకాలంలో ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారికి తప్ప మిగిలిన వారికి ఈ ప్రయోజనాన్ని కల్పించేందుకు అనుమతించరాదని సార్వత్రిక బడ్జెట్ 2018-19లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కనుక ఈ నిబంధన ప్రకారం సకాలంలో ఐటీ రిటర్నులు దాఖలు చేయకపోతే చాప్టర్-5లోని పార్ట్-సీ కింద ఏ ప్రాఫిట్ లింక్డ్ డిడక్షన్సనూ అనుమతించడం జరగదని ఆయన వివరించారు.





సోమవారం టీఎస్‌ఎంఎఫ్‌సీ కార్యాలయంలో మైనారిటీ కమిషన్ చైర్మన్ ఖమ్రుద్దీన్, హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్‌లను సన్మానిస్తున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్

మైనారిటీ కమిషన్, హజ్ కమిటీ చైర్మన్లకు సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఖమ్రుద్దీన్, తెలంగాణ రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్‌లను తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ సన్మానించారు. సోమవారం టీఎస్‌ఎంఎఫ్‌సీ కార్యాలయంలో వీరిద్దరినీ అక్బర్ హుస్సేన్‌తో పాటు టీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ నేతలు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీనేతలు బాసిత్, అబ్రార్, బాబుజానీ, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల నుంచి వచ్చే హజ్ యాత్రికులకు రవాణా చార్జీలు

హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్

బేగంబజార్: హజ్‌యాత్రకు వెళ్లేందుకు 31 జిల్లాల నుంచి హైదరాబాద్ వచ్చే యాత్రికులకు రవాణా చార్జీలను అందజేస్తామని హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హజ్ కమిటీకి తొలి చైర్మన్‌గా నియమితులైన ఆయన సోమవారం హజ్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. యాత్రికులు హైదరాబాద్‌కు వచ్చేదుకు ఇబ్బందులకు గురవుతున్నందున వ్యక్తిగతంగా రవాణాచార్జీలు అందజేస్తానని ప్రకటించారు. తనకు హజ్ కమిటీ బాధ్యతలను అప్పజెప్పిన సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం మహమూద్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర హజ్‌కమిటీని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు.

42 లక్షల గొర్రెల పంపిణీ

› మొదటిపేజీ తరువాయి...

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చూపిన చొరవ వల్ల ప్రగతి సాధ్యమైందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. లబ్ధిదారులు సబ్సిడీ గొర్రెల యూనిట్లను అమ్ముకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా	పంపిణీ యూనిట్లు
1.కామారెడ్డి	8,195
2.జగిత్యాల	9,739
3.కుమ్రంభీం-ఆసిఫాబాద్	2,052
4. జోగుళాంబ గద్వాల	8,665
5.వరంగల్(అర్బన్)	4,896
6.నిజామాబాద్	8,254
7.మంచిర్యాల	4,874
8.రాజన్న సిరిసిల్ల	6,716
9. భద్రాద్రి కొత్తగూడెం	4,406
10. జయశంకర్ భూపాలపల్లి	7,364
11.ఆదిలాబాద్	3,251
12. మేడ్చల్	2,193
13. సంగారెడ్డి	11,195
14.మహబూబాబాద్	8,161
15. వరంగల్ (రూరల్)	7,925
16.జనగామ	6,573
17.పెద్దపల్లి	6,448
18.సిద్దిపేట	9,608
19. మెదక్	5,532
20. వికారాబాద్	5,470
21. యాదాద్రి భువనగిరి	7,369
22.వనపర్తి	5,343
23.నాగర్‌కర్నూల్	8,513
24.మహబూబ్‌నగర్	11,451
25.నల్లగొండ	13,264
26. ఖమ్మం	6,141
27.కరీంనగర్	4,640
28.సూర్యాపేట	5,095
29.నిర్మల్	2,201
30. రంగారెడ్డి	4,701
మొత్తం	**2,00,235**

వరంగల్‌కు కొత్తందాలు!

› మొదటిపేజీ తరువాయి...

రూపాంతరం చెందుతుంది. స్మార్ట్ సిటీ కింద రూ.1,108 కోట్లు, పీపీపీ విధానంలో రూ.906 కోట్లు, కన్వర్జెన్స్ కింద రూ.726 కోట్లు.. ఇలా మొత్తం రూ.2,740 కోట్ల ఖర్చుతో నయా వరంగల్ ఆవిష్కృతం కానున్నది.

కమాండ్ కంట్రోల్ సెంటర్:

హైదరాబాద్ తరహాలో వరంగల్‌లోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ) ఏర్పాటుచేస్తారు. పురపాలిక సేవలకు దీనిని విస్తరిస్తారు. వరంగల్‌ను ఇంటెలిజెంట్ సిటీగా ఆవిష్కరించే కార్యక్రమానికి రూ.136 కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. 2019 సెప్టెంబర్‌లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేస్తారు. రూ.16.3 కోట్లతో పురపాలక సేవలకు ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థను ఏర్పాటుచేస్తారు.

56 కి.మీ. రహదారుల అభివృద్ధి

గ్రేటర్ వరంగల్‌లో దాదాపు 56 కిలోమీటర్ల మేరకు రహదారుల్ని అభివృద్ధిచేయనున్నారు. వాహనాల రాకపోకలు సులభంగా జరుగడానికి, చక్కటి క్రాసింగులు, ఫుట్‌పాత్‌లు, రోడ్డు పక్కల పబ్లిక్ టాయిలెట్లు తదితర సౌకర్యాలతో రహదారులను తీర్చిదిద్దుతారు. రహదారులపై ఎక్కడా వైర్లు కనిపించవు. భూమిలోపలే ప్రత్యేక డక్టులను ఏర్పాటుచేస్తారు. మొదటి విడుతలో నాలుగు కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.60.89 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ పనులను 2019 జనవరిలోపు పూర్తిచేయాలని మంత్రి నిర్దేశించారు. ఇక రెండో దశలో రూ.80 కోట్లతో ఆరు కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులు 2019 సెప్టెంబర్‌లోపు పూర్తవుతాయని అంచనా. మిగతా రోడ్లను మూడో విడుత కింద చేపడుతారు.

భద్రకాళి జియో బయోడైవర్సిటీ, కల్చరల్ పార్కు

హృదయ్ పథకంలో భాగంగా భద్రకాళి చెరువును అత్యంత సుందరంగా డిజైన్‌చేసే బాధ్యతను ఆర్కిటెక్ట్ కిశోర్‌ప్రధాన్ తీసుకున్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద భద్రకాళి చెరువును విహార ప్రాంతంగా అభివృద్ధి చేస్తారు. సుమారు నాలుగు కిలోమీటర్ల మేరకు నడుచుకుంటూ వెళ్లే విధంగా తీర్చిదిద్దుతారు. ఇందులో1.1 కిలోమీటర్ల నడకదారిని రూపొందిస్తారు. మిగతా విస్తీర్ణంలో స్మార్ట్ సిటీ కింద చేపడుతారు. దీనికి మొత్తం మూడు ప్రవేశ మార్గాలు, ఆటస్థలాలు, టాయ్ ట్రైన్, సోలార్ లైటింగ్ వంటివి ఏర్పాటు చేస్తారు. దీనికి రూ.68 కోట్లు ఖర్చవుతుందని అంచనా. హృదయ్ కింద రూ.15 కోట్లు ఖర్చు చేస్తారు. భద్రకాళి చెరువు ముందున్న ప్రాంతం అభివృద్ధి కింద ల్యాండ్‌స్కేపింగ్‌తో కొత్తగా గట్టును ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పనులు మొదలైతే 2019 మార్చిలోపు పూర్తవుతాయి. భద్రకాళి చెరువును శుద్ధి చేయడానికి కనీసం 18 నెలలు పడుతుందని అంచనా వేశారు. ముందుగా చెరువులోకి మురుగునీరు రాకుండా నియంత్రించి శుద్ధిచేస్తారు. ఇందుకు సంబంధించిన పనులన్నీ పూర్తవ్వడానికి కనీసం మూడేండ్లు పడుతుంది.

5.08 కి.మీ. హెరిటేజ్ వాక్!

వారసత్వ సంపద ప్రాముఖ్యత ప్రతిబింబించడంతోపాటు సాహసోపేతంగా ఉండేవిధంగా గ్రేటర్ వరంగల్‌లో ప్రత్యేక ప్రణాళికను సిద్ధంచేశారు. తొలుత పద్మాక్షి ఆలయం, వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం.. ఈ మూడింటినీ అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. ఆ ప్రణాళికకు తాజాగా మార్పులు చేశారు. వారసత్వ కట్టడాలను అనుసంధానం చేస్తూనే అడ్వెంచర్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. భద్రకాళి ఆలయం నుంచి 1054 మీటర్ల మార్గాన్ని, జైన విగ్రహం నుంచి 854.4 మీటర్ల మేరకు మరో మార్గాన్ని అభివృద్ధి చేస్తారు. ఈ రెండు మార్గాల అభివృద్ధి ప్రణాళిక ప్రతిపాదనల్ని 2018 మార్చిలోపు పూర్తిచేస్తారు. తర్వాత, దాన్ని పూర్తిగా సమీక్షించి నిర్ణయం తీసుకుంటారు. అలా అరంభమయ్యాక 2019 మేలోపు పూర్తవుతుంది. ఇంతేగాక రూ.13.50 కోట్లు ఖర్చుతో కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను పునరుద్ధరించనున్నారు. దీంట్లో బర్డ్ ఎన్‌క్లోజర్లు, పార్టీ లాన్లు, రోలర్ కోస్టర్లు, జలక్రీడలకు వసతులు ఏర్పాటు చేస్తారు. 2019 మార్చిలోగా ఈ పనులుచేయిస్తారు.

దీనితోపాటు 2019 మార్చిలోపు వరంగల్‌లో సుమారు రూ.2 కోట్ల ఖర్చుతో స్మార్ట్ లైబ్రరీని ఏర్పాటుచేస్తారు. వరంగల్ కార్పొరేషన్ విద్యుత్ కోసం ఏటా రూ.2.75 కోట్లను ఖర్చుచేస్తున్నది. ఈ ఖర్చును తగ్గించడానికి అన్ని ప్రభుత్వ భవనాల పైకప్పులు, కాల్వల ఒడ్డుపై సౌరవిద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటుచేస్తారు. ఇందుకోసం రూ.163 కోట్లు ఖర్చు పెట్టడానికి పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ ప్రణాళికలు 2018 జూన్‌లోపు తయారవుతాయి. తర్వాత, ఏడాదిలోపు ఈ పని పూర్తవుతుంది.

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు	ఖర్చు (రూ.కోట్లలో)	ఆరంభం	పూర్తయ్యే ఏడాది
వెయ్యి స్తంభాల గుడి ప్రాంగణం అభివృద్ధి	0.80	2018 ఫిబ్రవరి	2018 పూర్తి
పద్మాక్షి ఆలయం ప్రాంగణం	3.20	2018 జనవరి	2018 జులై
సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రెడ్డిపురం	300	2018 జూన్	2019 డిసెంబర్
సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ప్రగతినగర్	35	2018 సెప్టెంబర్	2020 ఫిబ్రవరి
ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ	1.80	2018 ఫిబ్రవరి	2018 ఆగస్టు
అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిక్ కేబులింగ్	100	-	-
రెయిన్ వాటర్ హార్వెస్టింగ్	20.80	2018 మే	2018 అక్టోబర్
స్మార్ట్ సిటీ: వైఫై జోన్	4.21	2018 ఫిబ్రవరి	2018 ఆగస్టు
వేస్ట్ టు ఎనర్జీ	4.31	2018 ఫిబ్రవరి	2019 ఫిబ్రవరి
పర్యావరణ నాణ్యత పర్యవేక్షణ కేంద్రం	10	2018 మార్చి	2018 సెప్టెంబర్
మంచినీటి సరఫరా (స్మార్ట్ మీటర్లు)	40-50	-	-
నాలా మీదుగా ఎన్‌ఎంటీ (నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్) కారిడార్	16.81	-	-
స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్	0.92	-	-
ఈ సేవా కేంద్రం	0.32	-	-
స్కూళ్లు, కాలేజీల ఆధునీకరణ	1.58	2018 ఏప్రిల్	(మూడు నెలల్లోపు)
ఈ-కౌన్సిలింగ్ సెంటర్లు	0.58	2018 జూన్	-
వరద నీటి కాల్వలు	4.70	2018 సెప్టెంబర్	2019 జూన్
హన్మకొండ బిజినెస్ డిస్ట్రిక్ట్	87	-	-
మురికివాడల పునరుద్ధరణ	91.72	-	-
జీడబ్ల్యూఎంసీ ఆఫీసు చుట్టూ అభివృద్ధి	15.81	-	-
హన్మకొండ బస్ టర్మినల్ కాంప్లెక్స్	610	-	60 నెలల్లో పూర్తి
మల్టీలెవెల్ కార్ పార్కింగ్ (పీపీపీ)	34.47 కోట్లు	2018 మార్చి	మూడేండ్ల లోపు

(స్మార్ట్ సిటీ, ఇతర ప్రాజెక్టుల కింద చేపట్టడానికి ప్రణాళిలు రూపొందించిన పనులు టెండర్లలో పాల్గొన్న సంస్థల ఆధారంగా ప్రారంభం అవుతాయి)

రైతు సంక్షేమమే ధ్యేయం

మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



కామారెడ్డి జిల్లా జంగంపల్లిలో గోదాంను ప్రారంభిస్తున్న మంత్రి పోచారం

దోమకొండ/భిక్కనూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పంటలను భద్రపర్చుకోవడానికి గోదాములను నిర్మిస్తున్నదని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం లింగుపల్లిలో, భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామశివారులో నిర్మించిన గోదాములను సోమవారం విప్ గంప గోవర్ధన్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పోచారం అన్నారు. మార్చి నెలలో రైతులకు డిజిటల్ పట్టాపాస్‌బుక్‌లు అందిస్తామన్నారు.

పగలు ఎండ.. రాత్రి చలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మధ్యాహ్నం పూట ఎండ దంచి కొడుతుండగా రాత్రి వేళ చలి వణికిస్తున్నది. రెండు రకాల వాతావరణం నెలకొడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో 7.9 డిగ్రీలు, రంగారెడ్డి 8.2, మేడ్చల్‌లో 8.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా పలు జిల్లాల్లో 35.9 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
మహబూబ్‌నగర్	34.6	8.2
రంగారెడ్డి	34.7	8.2
మేడ్చల్	32.7	8.4
నాగర్‌కర్నూల్	34.6	8.6
జోగుళాంబ గద్వాల	35.2	10.0
వికారాబాద్	34.8	10.3
సిద్దిపేట	35.3	10.3
సంగారెడ్డి	35.1	10.4
నల్లగొండ	34.6	10.5
రాజన్న సిరిసిల్ల	35.4	10.6
కామారెడ్డి	34.9	10.7
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.7	10.9
యాదాద్రి భువనగిరి	34.6	11.0
నిర్మల్	34.6	11.2
జనగామ	35.5	11.4
ఆదిలాబాద్	35.2	11.4
భద్రాద్రి కొత్తగూడెం	35.8	11.6
మెదక్	35.5	11.9
వరంగల్ రూరల్	35.6	12.0
మంచిర్యాల	35.6	12.0
నిజామాబాద్	35.9	12.2
వనపర్తి	35.0	12.2
మహబూబాబాద్	35.9	12.3
జయశంకర్ భూపాలపల్లి	35.5	12.8
ఖమ్మం	34.6	12.9
జగిత్యాల	35.2	13.0
పెద్దపల్లి	35.4	13.0
వరంగల్ అర్బన్	34.6	13.1
హైదరాబాద్	35.8	13.3
కరీంనగర్	35.2	13.4
సూర్యాపేట	35.3	13.7



ఖిల్లాఘణపురం: వనపర్తి జిల్లాలో పాతాళ గంగ పైపైకి వస్తున్నది. ఎంజీకేఎల్‌ఐ 29వ ప్యాకేజీ కాల్వ ద్వారా ఏర్పాటు చేసిన ఖిల్లాఘణపురం బ్రాంచ్ కెనాల్ సాగునీటితో గణపసముద్రం చెరువుకు నీరు చేరుతున్నది. వెంకటాంపల్లికి చెందిన దేవర్‌శెట్టి ఆంజనేయులు, నారాయణ పొలాల్లోని బోరుబావుల నుంచి నీరు ఉబికివస్తున్నది. ఎండిపోయిన బోరుబావుల్లో సైతం నీటి మట్టం పెరిగింది.

వెల్లువలా గులాబీదళంలోకి..







సూర్యాపేటలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి... వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో మంత్రి జూపల్లి కృష్ణారావు... వికారాబాద్ జిల్లా తాండూరులో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:

గులాబీ పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. సోమవారం పెద్ద సంఖ్యలో చేరారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు 200 మంది, నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన మరో 200 మంది నాయకులు, కార్యకర్తలు మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలో టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 50 మంది హైదరాబాద్‌లోని మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు.మక్తల్ మండలంలో 100మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో చేరారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కదిరెపాడులో టీడీపీకి చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి జూపల్లి కృష్ణారావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని రెండో వార్డుకు చెందిన సుమారు 150 మంది యువకులు, మహిళలు టీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పలువురు నాయకులు నిరంజన్‌రెడ్డి సమక్షంలో చేరారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి నివాసంలో పెద్ద సంఖ్యలో యువకులు గులాబీ దళంలోకి వచ్చారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో వివిధ పార్టీల కార్యకర్తలు మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల మండలంలో 200 మందికిపైగా వివిధ పార్టీల వారు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో, అమ్రాబాద్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో 60మంది కాంగ్రెస్, టీడీపీ నేతలు టీఆర్‌ఎస్‌లో చేరారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో కాసిపేట మండలానికి చెందిన 100మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో, జనగామ జిల్లా పాలకుర్తిలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరారు.







మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలకు కండువా వేస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి సమక్షంలో వనపర్తి జిల్లా పెబ్బేరు మండల నాయకులు.. జనగామ జిల్లా పాలకుర్తిలో కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

వడదెబ్బతో గొర్రెలకాపరి మృతి

ఊర్కొండ: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లికిచెందిన గొర్రెల కాపరి బూర్గుల కృష్ణయ్య(45) సోమవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కృష్ణయ్య రోజులాగే సోమవారం గొర్రెలను మేపెందుకు వెళ్లి, అక్కడ సొమ్మసిల్లి పడిపోగా, గ్రామానికి తీసుకొచ్చేలోపే మృతి చెందాడు.

ఛత్తీస్‌గఢ్‌లో రైలు పట్టాల తొలగింపు

- భూపాలపల్లి జిల్లాలో సెల్‌టవర్ పేల్చివేత
- కలివేరు పోలీస్ ఔట్‌పోస్టు పేల్చివేతకు యత్నం
- బంద్ నేపథ్యంలో మావోయిస్టుల దుశ్చర్య

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: బంద్ పిలుపు మేరకు మావోయిస్టులు అక్కడక్కడా విధ్వంసానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల పరిధిలో సోమవారం తెల్లవారు జామున బకేలి-భాన్సీ మార్గ మధ్యంలో మావోయిస్టులు రైలు పట్టాలను తొలగించగా, ఆరు గూడ్స్ బోగీలు పట్టాలు తప్పాయి. కిరండోల్‌లో సాగునీటి ప్రాజెక్టుల పనులు చేస్తున్న పొక్లెనర్‌తో పాటు పలు వాహనాలకు నిప్పుపెట్టి బంద్‌ను విజయవంతం చేయాలని పోస్టర్లు అంటించి వెళ్లారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధి ఎదిర గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సెల్‌టవర్‌ను పేల్చివేశారు. సాయుధులైన సుమారు 50 మందికి పైగా మావోయిస్టులు పాల్గొన్నట్టు సమాచారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం వైపు వచ్చే వాహనాలను అడ్డుకొని, హల్‌చల్ చేసినట్టు తెలుస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు శివారు పోలీసు ఔట్ పోస్టును పేల్చివేసేందుకు ప్రయత్నించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఔట్‌పోస్టుపై గుర్తు తెలియని వ్యక్తులు మొదట బాంబు వేశారు. అది పేలకపోవడంతో రెండో బాంబు విసిరారు. అది ఔట్‌పోస్టుకు కొద్దిదూరంలో పడి, పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతానికి ముఖద్వారమైన మన్ననూర్, వటువర్లపల్లి, పదర మండాలలో మద్దిమడుగు, శ్రీశైలం వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీచేశారు. కాగా మావోయిస్టులు తలపెట్టిన బంద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎలాంటి ప్రభావం చూపలేదని భద్రాచలం ఏఎస్పీ సునీల్ దత్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుగా ఉన్న భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎలాంటి ఆటంకం కలుగలేదన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎదిర గ్రామంలో దగ్ధమైన సెల్ టవర్ సామగ్రి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

నలుగురికి గాయాలు.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన



మన్యం (ఫైల్)



లక్ష్మి (ఫైల్)

మూసాపేట: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల కేంద్రంలోని సంకలమద్ది స్టేజీ వద్ద సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్టకు చెందిన రాజు(32), పెబ్బేరుకు చెందిన మన్యం(52)తోపాటు అదే మండలానికి చెందిన లక్ష్మీదేవమ్మ(60), శ్రీరంగాపూర్‌కు చెందిన యుగేందర్, సువర్ణ, తిరుపతమ్మ, రాధ మేడారం జాతరలో గోలీసోడా అమ్ముకునేందుకు వెళ్లారు. జాతర ముగియగా బొలెరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మూసాపేటలోని సంకలమద్ది స్టేజీ వద్ద జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ఆగి ఉంది. బొలెరో డ్రైవర్ వేగంగా నడుపుతూ లారీని ఢీ కొట్టగా, బొలెరోలో ఉన్న మన్యంతోపాటు, అతని అల్లుడు రాజు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ లక్ష్మీదేవమ్మ మృతి చెందింది. యుగేందర్, సువర్ణ, తిరుపతమ్మ, రాధ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు.

ఉల్లెపల్లిలో విషాదం

ముని మనుమడి మృతిని తట్టుకోలేక ఆగిన తాతమ్మ గుండె



మృతి చెందిన విష్ణువర్ధన్



శాంతమ్మ మృతదేహం

మల్దకల్: పాము కాటుతో ముని మనుమడు మృతి చెందడాన్ని తట్టుకోలేక తాతమ్మ గుండె ఆగింది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉల్లెపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఉల్లెపల్లి గ్రామానికి చెందిన మంజుల, చిన్న సవారన్న దంపతుల కుమారుడు విష్ణువర్ధన్(5) ఆదివారం సెలవు రోజు కావడంతో ఇంటివద్ద ఆడుకుంటుండగా పాము కరిచింది. ఈ విషయాన్ని బాలుడు గమనించలేదు. సాయంత్రం పొలం పనులు ముగించుకొని అందరూ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసే సమయంలో విష్ణువర్ధన్ నోటినుంచి నురగలు వస్తుండటంతో పాము కరిచిందని గుర్తించారు. వెంటనే గద్వాల దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. విషయం తెలిసిన బాలుడి తాతమ్మ జేజవ్వ శాంతమ్మ(70) కూర్చున్నచోటే కుప్పకూలిపోయింది. ఒకే రోజు ఒకే ఇంట్లో ఇద్దరు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేటినుంచి మేడారం హుండీల లెక్కింపు

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: మేడారం మహాజాతర హుండీలు వరంగల్ నగరానికి చేరాయి. మంగళవారం ఉదయం ఏడున్నర నుంచి హుండీల లెక్కింపు మొదలై దాదాపు వారం పాటు కొనసాగుతుందని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు తెలిపారు. గత నెల 31 నుంచి ఈనెల 3వ తేదీ వరకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క-సారక్క మహాజాతర జరిగిన విషయం తెలిసిందే. ఈ జాతరకు దాదాపు 1.25 కోట్ల మంది భక్తులు తరలి వచ్చిన విషయం తెలిసిందే. దేవాదాయ శాఖ గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 452 హుండీల్లో భక్తులు వారి మొక్కులు చెల్లించుకున్నారు. గత జాతరలో తల్లులకు భక్తులు సమర్పించిన మొక్కులు దాదాపు రూ.8కోట్ల పైచిలుకు ఉంటే ఈసారి రూ.10 కోట్లకు చేరే అవకాశం ఉందని దేవాదాయ శాఖ అంచనా వేస్తున్నది.

తల్లిదండ్రుల గొడువకు కొడుకు బలి



మోహన్ (ఫైల్)

కేసముద్రంటౌన్: నిత్యం తల్లిదండ్రులు గొడువ పడడాన్ని తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి శివారు సబ్‌స్టేషన్‌తండాలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ శంకర్-సరోజ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. శంకర్ కూలి పని చేస్తుండగా, సరోజ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్నది. చిన్న కొడుకు మోహన్(16) కేసముద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శంకర్-సరోజ మధ్య తరుచూ గొడువలు జరుగుతుండగా, మోహన్ పలుమార్లు తల్లిదండ్రులకు సర్దిచెప్పాడు. అయినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన మోహన్ ఈనెల 3న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం గాలిస్తుండగా సోమవారం ఉదయం ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించాయి. బావిలోకి తొంగిచూడగా మోహన్ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. శవాన్ని తీసి పోస్టుమార్టం కోసం మానుకోటలోని జిల్లా వైద్యశాలకు పంపించినట్టు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని..



లాల్‌రౌత్ మావియా మృతదేహం

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని కార్ఖానా ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జానయ్య కథనం ప్రకారం.. మణిపూర్ రాష్ట్రానికి చెందిన రంగాన్‌హుజైలీ కొంపల్లిలో నివాసముంటూ ఓ బ్యూటీ పార్లర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు లాల్‌రౌత్ మావియా(18) కార్ఖానాలోని వాసవీనగర్‌లో తన సోదరి వద్ద ఉంటూ కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి కుమారుడితో హుజైలీ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా కొత్త మొబైల్ కొనివ్వాలని కొడుకు కోరాడు. జీతం తీసుకున్న తర్వాత కొనిస్తానని చెప్పడంతో కుమారుడి ఫోన్ కట్ అయ్యింది. సోమవారం ఉదయం తన సోదరి లాల్‌రతనమావీకి ఫోన్ చేసి కుమారుడికి ఫోన్ ఇవ్వాలని కోరింది. ఆమె అతని గదికి వెళ్లి చూడగా బాత్‌రూం వెంటిలేటర్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. ఆందోళనకు గురైన లాల్‌రతనమావీకి తన అక్కకు విషయం చెప్పింది. లాల్‌రౌత్ మావియా మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు.

రూ.50 ఇవ్వలేదని కొడుకు ఆత్మహత్య

ఘట్‌కేసర్: తన తండ్రి యాభై రూపాయలు ఇవ్వలేదని తాగిన మైకంలో ఉన్న కొడుకు ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీ నివాసి పాటి చెన్నయ్య రెండో కొడుకు కిశోర్(20) ఆదివారం రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. 50 రూపాయలు ఇవ్వాలని తండ్రిని అడగ్గా అతను నిరాకరించాడు. దీంతో కొడుకు కిశోర్ తన గదికి వెళ్లి తలుపులు బిగించుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అత్తను హతమార్చిన అల్లుడు

పెగడపల్లి: భార్యను కాపురానికి పంపడం లేదన్న కక్షతో అత్తనే హతమార్చాడు ఓ అల్లుడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లింగాపూర్‌లో చోటుచేసుకుంది. మల్యాల సీఐ సీహెచ్ నాగేందర్ కథనం ప్రకారం.. సుద్దపల్లికి చెందిన కొమురయ్య, గంగవ్వ దంపతులు. భర్త వేధింపులు భరించలేక ఆమె లింగాపూర్‌లోని తల్లి శనిగరపు నర్సవ్వ(70) వద్ద ఉంటుంది. ఆదివారం రాత్రి అత్త ఇంటికి వచ్చిన కొమురయ్య రోకలి బండతో తలపై తీవ్రంగా కొట్టడంతో నర్సవ్వ అక్కడికక్కడే చనిపోయింది. ఆమె ఒంటిపై ఉన్న బంగారం తీసుకొని పరారయ్యాడు.

గుడుంబాను వందశాతం అరికట్టాం

ప్రత్యామ్నాయ ఉపాధికి ప్రభుత్వం కృషి.. ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ రాజశేఖరరావు వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ రాష్ట్రంలో వందశాతం గుడుంబాను అరికట్టిందని ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ రాజశేఖరరావు వెల్లడించారు. సోమవారం ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ అజయ్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డిప్యూటీ కమిషనర్లు వివేకానందరెడ్డి, ఖురేషీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2015 సెప్టెంబర్‌లో గుడుంబాను తరిమి కొట్టాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించిందన్నారు. 2017, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున గుడుంబా రహిత తెలంగాణ రాష్ట్రంగా ప్రకటించమన్నారు. ఆదిలాబాద్, మెదక్, వరంగల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని తండాల్లో ప్రజలకు చైతన్యం కలిగించి వారిలో మార్పు తెచ్చినట్టు వివరించారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో గుడుంబా వ్యాపారాన్ని అరికట్టడం కోసం వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించి.. వారిని ఈ వృత్తి నుంచి బయటపడేశామని చెప్పారు. ఇటీవల హైదరాబాద్ పరిధిలోని 114 మంది గుడుంబా వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఆటోలను పంపిణీ చేశామని తెలిపారు.

రూ. 95.9 కోట్లతో ప్రత్యామ్నాయ ఉపాధి

గుడుంబా వ్యాపారం మానేసినవారికి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు రూ.95.9 కోట్లు వెచ్చించి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మినహాయించి పాత ఉమ్మడి జిల్లాల్లో 5,768 మందిని గుర్తించామని తెలిపారు. వారిలో 4,795 మందికి ఉపాధి చూపించామన్నారు.

పాత జిల్లాలవారీగా వివరాలు

జిల్లా	గుర్తించిన వారు	లబ్ధిపొందిన వారు	వెచ్చించిన మొత్తం రూ. కోట్లలో
ఆదిలాబాద్	371	290	5.8
కరీంనగర్	450	439	8.78
మహబూబ్‌నగర్	1450	1156	23.12
ఖమ్మం	732	727	14.54
వరంగల్	1438	997	19.94
నల్లగొండ	674	614	12.28
నిజామాబాద్	215	180	3.60
మెదక్	438	392	7.84
మొత్తం	5,768	4,795	95.9

వెయిటేజీ మార్కులపై ప్రమాణపత్రం ఇవ్వండి

ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ పోస్టుల భర్తీలో భాగంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెయిటేజీ మార్కులను కల్పించడంపై ప్రమాణపత్రం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు టీఎస్‌పీఎస్సీ వంటి సంస్థలకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ సంస్థల పోస్టుల భర్తీలో వెయిటేజీ మార్కులను కల్పించడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం ఈ మేరకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. వెయిటేజీ మార్కులు ఇవ్వడంపై ఉమ్మడి హైకోర్టు నిర్ణయం వెలువరించే వరకు పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చేసిన అభ్యర్థనను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది.



సోమవారం ప్రగతిభవన్‌లో తన పెద్ద కుమార్తె స్ఫూర్తి, గ్రంధి భాస్కరరావు సుశీల దంపతుల కుమారుడు ఆశీష్ వివాహానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పెండ్లిపత్రికను అందజేస్తున్న నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, రేణుక దంపతులు

'డబుల్' ఇండ్లకు సహకరించాలి

స్టీల్ కంపెనీల యాజమాన్యాలను కోరిన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి సామాజిక బాధ్యతగా ఉక్కు కంపెనీ యజమానులు తమవంతు సహకారం అందించాలని ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు, గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు నాణ్యతతో విశాలమైన డబుల్‌బెడ్రూం ఇండ్లను నిర్మిస్తున్నదని, ఇటువంటి ఉన్నత కార్యక్రమానికి.. లాభాపేక్షతో కాకుండా సానుకూల దృక్పథంతో సరసమైన ధరకు ఉక్కును విక్రయించాలని కోరారు. మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి సోమవారం సచివాలయంలో ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి సిమెంటు కంపెనీలు.. మార్కెట్లో హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా బస్తా సిమెంటును రూ.230కే విక్రయిస్తున్నాయని, ఉక్కు కంపెనీ యాజమాన్యాలు కూడా తక్కువ రేటుకు ఉక్కును విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం 2.60 లక్షల డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి.. 5.27 లక్షల టన్నుల ఉక్కు అవసరమని కంపెనీ యాజమాన్యాలకు మంత్రులు తెలిపారు. గ్రామాల్లో లక్ష ఇండ్లకు 1.45 లక్షల టన్నులు, పట్టణాల్లో 60 వేల ఇండ్లకు 1.04 లక్షల టన్నులు, జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్ష ఇండ్లకు 2.78 లక్షల టన్నుల స్టీల్ అవసరమని వివరించారు. ఉక్కు విక్రయించిన కంపెనీలకు ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్లో బిల్లులు చెల్లించనున్నట్టు హామీఇచ్చారు. కాగా అన్ని ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో చర్చించుకొని.. ప్రభుత్వానికి తమ నిర్ణయం వెల్లడిస్తామని ఉక్కు కంపెనీల యాజమాన్యాలు తెలిపాయి. ఈ విషయంపై అధికారులతో మరోసారి భేటీ కావాలని మంత్రులు స్టీల్ కంపెనీల యాజమాన్యాలకు సూచించారు. ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో రెండు మూడ్రోజుల్లో మరోసారి సమావేశమై.. నిర్దిష్టమైన ధరను (బేస్‌రేటును) నిర్ణయించాలని గృహ నిర్మాణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్ర రామచంద్రన్‌ను మంత్రులు ఆదేశించారు. సమావేశంలో హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్ర రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ టీకే శ్రీదేవి, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశాంక్‌గోయల్, వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ భారతి, గృహ నిర్మాణశాఖ చీఫ్ ఇంజినీర్ సత్యమూర్తి, జీహెచ్‌ఎంసీ సీఈ సురేష్‌కుమార్, ఆలిండియా స్టీల్ అసోసియేషన్ చైర్మన్ సురేష్‌కుమార్ సింఘాల్ తోపాటు విశాఖ స్టీల్‌ప్లాంట్, జిందాల్, శాలినీ స్టీలు తదితర ఎనిమిది కంపెనీల యజమానులు పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో స్టీల్ కంపెనీల యాజమాన్యాలతో సమావేశమైన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి



సోమవారం సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ల డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

వికేంద్రీకరణతోనే పాలనా ఫలాలు

- కమిషనర్ల ముద్ర పట్టణాలపై కనిపించాలి: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో వికేంద్రీకరణ సూత్రాన్ని బలంగా నమ్ముతున్నదని.. ఈ కారణంగానే ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత వేగంగా చేరుతున్నాయని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ల డైరీని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. సంస్కరణల అమలులో మున్సిపల్ కమిషనర్లు కీలకపాత్ర పోషించాలని, పట్టణాలపై తమ ముద్ర కనబడేలా పనిచేయాలని సూచించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో టీపీజేఏ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

కథనానికి తగ్గట్టు ఫొటోలు ఉండాలి

టీపీజేఏ క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కథనానికి తగినట్టుగా ఫొటోలు ఉంటేనే దానికి విలువ పెరుగుతుందని, ఫొటోలు ఆకట్టుకునేలా అందంగా ఉండాలని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు జీ భాస్కర్, ఉపాధ్యక్షుడు సల్మాన్‌రాజు, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

14 నుంచి మైనింగ్ టుడే సదస్సు

మొదటిపేజీ తరువాయి...

రోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఫిక్కీ సహకారం అందిస్తున్నాయి. మైనింగ్‌రంగంలో పనిచేస్తున్న ఇంజినీర్లను, జియాలజిస్టులను, మినరల్ ప్రాసెసింగ్ టెక్నాలజిస్టులను, విద్యావేత్తలను, పారిశ్రామికవేత్తలను, ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్లను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ప్రపంచ మైనింగ్ రంగంలో దిగ్గజాలుగా పేరొందిన ఆస్ట్రేలియా, ఇటలీ, చైనా, కెనడా, దక్షిణాఫ్రికా తదితర దేశాల ప్రతినిధులు పాల్గొంటారు. ఉక్కు, విద్యుత్, సిమెంట్, పెట్రోకెమికల్స్ వంటి వివిధ మైనింగ్ విభాగాలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారు. పలు మైనింగ్ సంస్థల మధ్య వ్యాపార భాగస్వామ్యాలకు సంబంధించిన చర్చలు జరిపేందుకు ఈ సదస్సు వేదికకానున్నది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వైభవాన్ని వివిధ దేశాల ప్రతినిధులకు చాటిచెప్పేందుకు ఈ వేదిక ఉపయోగపడనున్నది.

కులవృత్తులకు పూర్వవైభవం

నాయీబ్రాహ్మణ యువతకు ధ్రువపత్రాలు, కిట్లు పంపిణీ


3.10 లక్షల మంది సంక్షేమానికి రూ.250 కోట్లు

వృత్తి నైపుణ్య శిక్షణలకు రూ.20 కోట్లు: మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతరించిపోతున్న కులవృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తున్నదని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. సోమవారం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో హెయిర్ సెలూన్, బ్యూటీషియన్‌కు సంబంధించి ఆధునిక శిక్షణ పొందిన నాయీబ్రాహ్మణ యువత 138 మందికి మంత్రి ధ్రువపత్రాలు, కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, అందులోభాగంగానే నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ. 250 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. నాయీబ్రాహ్మణులకు వారి వృత్తిలో నైపుణ్యశిక్షణ ఇవ్వడంతోపాటు, అత్యాధునిక పనిముట్లను అందజేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 3.10లక్షల మంది నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, దశల వారీగా దాన్ని అమలుచేస్తామన్నారు. నాయీబ్రాహ్మణుల వృత్తి నైపుణ్య శిక్షణలకు రూ.20కోట్లు కేటాయించామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బీసీల కోసం బడ్జెట్‌లో రూ.1,250 కోట్లు మాత్రమే కేటాయించిందని, తెలంగాణ సర్కారు 2017-18 బడ్జెట్‌లో రూ. 5,070 కోట్లు కేటాయించిందని చెప్పారు. బ్యాంకు లింకేజీ లేకుండా అర్హులైన బీసీలకు నేరుగా రుణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్, శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సహాయ బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారుల సంఘం 2018 క్యాలెండర్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రం, కిట్లు అందజేస్తున్న మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, తాడూరి శ్రీనివాస్



సోమవారం ఎంసీహెచ్చార్డీలో జరిగిన తహసీల్దార్ల అవగాహన కార్యక్రమంలో స్టాంప్స్ యాక్ట్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ల బాధ్యతలు

- అప్రమత్తంగా ఉండాలి: డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవుడు తెలంగాణ రాష్ట్రానికి మంచి ముఖ్యమంత్రిని ఇచ్చాడని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రిజిస్ట్రేషన్ల బాధ్యతలను కూడా తహసీల్దార్లకు అప్పగించారని, మరింత అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. సోమవారం ఎంసీహెచ్చార్డీలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చట్టాలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై తహసీల్దార్లకు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రికార్డుల ప్రక్షాళనను బాగాచేశారని అభినందించారు. దూరదృష్టితో సీఎం కేసీఆర్ తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ల బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు నిజాం, పైగా, జాగీర్, దేవాదాయ, వక్ఫ్, అటవీ, ప్రభుత్వ భూముల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భూమి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత మ్యుటేషన్‌కు రోజుల తరబడి నిరీక్షించే వాళ్లని, ఇక నుంచి రిజిస్ట్రేషన్ అయిన 48 గంటల్లోగా మ్యుటేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు లేని 451 మంది తహసీల్దార్లకు ఆరు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీలు మధుసూదన్‌రెడ్డి, సైదిరెడ్డి, సుభాషిణి, తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతంకుమార్‌తోపాటు 66 మంది తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి?

- సంస్మరణ పేరుతో సంస్కారరహిత సభ
- టీఆర్‌ఎస్ నేతల శవాలను మోరీలో వేస్తరా?
- ఇది మనుషులు మాట్లాడే భాషేనా?
- జైపాల్, జానా సమాధానం చెప్పాలి
- అంతర్గత గొడవలతోనే బొడ్డుపల్లి హత్య
- విలేకరుల సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి



సోమవారం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, గాదరి కిశోర్, నల్లమోతు భాస్కర్‌రావు, రమావత్ రవీంద్రకుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాయకులు నోముల నర్సింహయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, లింగయ్యయాదవ్, రేఖల భద్రాద్రి ఉన్నారు.

నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ అంతర్గత గొడవలతోనే నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య జరిగిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చరిత్ర హత్యలు, దాడుల రాజకీయాలమయమని విమర్శించారు. వారిలో వారే గ్రూపులు కడుతూ ఆధిపత్య రాజకీయాలతో ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. శ్రీనివాస్ హత్య విషయంలో కాంగ్రెస్ నేతల దుష్ప్రచారాన్ని ఖండించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. చంపడాలు, చంపించడాలు, ఒకరికి వ్యతిరేకంగా ఒకరు కుట్రలు కుతంత్రాలు చేయడాలు కాంగ్రెస్ సంస్కృతి అన్నారు. బొడ్డుపల్లి హత్య విచారకరమని చెప్పారు. ఈ హత్యతో టీఆర్‌ఎస్‌కు సంబంధంలేదని స్పష్టంచేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఇతర కాంగ్రెస్ నాయకులు అత్యంత నీచస్థాయికి దిగజారి మాట్లాడుతున్నారని, శ్రీనివాస్ హత్యనుంచి రాజకీయ లబ్ధిపొందాలని హేయమైన నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మా నాయకుడు కేసీఆర్ 'అందరినీ కలుపుకొనిపోండి. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోండి. ప్రతిపక్ష నాయకులతోనూ మర్యాదగా మసులుకోండి' అని చెప్తారు. జైపాల్, జానారెడ్డి వారి నాయకులకు ఏం చెప్తున్నారు?' అని ప్రశ్నించారు. 'వారి పార్టీ అంతర్గత ఘర్షణ కారణంగా జరిగిన ఘటనను అడ్డంపెట్టుకొని, సంస్మరణ సభ పేరుతో సంస్కారరహిత సభను కాంగ్రెస్ నిర్వహించింది' అని విమర్శించారు. అబద్ధాలతోనే రోజును ప్రారంభించి,అబద్ధాలతోనే రోజును ముగించే కోమటిరెడ్డి సోదరుల గురించి మాట్లాడటమే సరికాదని వ్యాఖ్యానించారు. 'చాలా విజ్ఞులమని, మేధావులమని చెప్పుకునే జైపాల్‌రెడ్డి, జానారెడ్డి, కుంతియాలు కాంగ్రెస్ నేతల భాషకు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'హత్య జరిగిన తెల్లవారి 10 గంటల వరకు శ్రీను భార్య వాస్తవాలే చెప్పారు. ఆ తర్వాతే వెంకటరెడ్డి డ్రామా మొదలుపెట్టారు. హత్య జరిగిన వెంటనే పోలీసులు, టీఆర్‌ఎస్‌పై నిందలేశారంటే ఈ ఘటన కచ్చితంగా కాంగ్రెస్ అంతర్గత తగాదాలతోనే జరిగిందని స్పష్టమవుతున్నది' అని అన్నారు.

గోరీలు, స్థూపాలు తప్ప అభివృద్ధి ఏది?

'గతంలోనే బొడ్డుపల్లి టీఆర్‌ఎస్‌లో చేరిండు. మళ్లీ పార్టీ విడిచి వెళ్లిపోయాడు. చేరనందుకే ఇలా చేశారనడం నీచమైన, దరిద్రమైన మాట. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేకమంది ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలప్రతినిధులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో 12 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలూ టీఆర్‌ఎస్సే గెలుస్తుందని కాంగ్రెస్ నేతలకు తెలుసు. అందుకే విమర్శలు చేస్తున్నరు' అన్నారు. గతంలో వందల రాజకీయ హత్యలతో జిల్లా నాశనమైంది. ఊళ్లల్లో గోరీలు, స్థూపాలు తప్ప అభివృద్ధి జాడలు కనిపించలేదు. కానీ మూడున్నరేండ్లుగా ఏ చిన్న రాజకీయ తగాదా జరుగకుండా ఎలా పారదర్శక పాలన జరిగిందో ప్రజలు చూస్తున్నరు. ఒక్క నల్లగొండలో 'మంత్రి, అధికారులు లేకుండా తాళాలు పగులకొట్టి శంకుస్థాపనచేస్తా' అంటూ స్థానిక ఎమ్మెల్యే చేసిన చిల్లర ఘటన తప్ప ఎలాంటి గొడవల్లేవు' అని చెప్పారు.

హత్యలు చేయించే వాళ్లకే ఆ నీచమైన భాష వస్తుంది

'జైపాల్‌రెడ్డి, జానారెడ్డి, కుంతియా వేదికపై ఉండగానే కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ కార్యకర్తల శవాలు మోరీలో పెడుతమని, మరో నాయకుడు బట్టలూడదీసి కొడుతమని మాట్లాడిన భాష మేము మాట్లాడం. మాకు శవాలను మోరీలో వేసే శక్తి కూడా లేదు. కాంగ్రెస్ నేతలకే ఆ శక్తి ఉంది. మీ కార్యకర్తలను మీరే చంపుకొని మోరీలో వేయగలరు. మీకు ఆ సంస్కృతి ఉంది కాబట్టే, అలవాటు కాబట్టే అలాంటి విమర్శలు చేస్తున్నరు' అని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇవాళే ఇలా మాట్లాడుతున్నరంటే.. అధికారంలో ఉన్నప్పుడు దాన్ని అడ్డం పెట్టుకొని చేసిన అరాచకాలెన్నని ప్రశ్నించారు. 'వెంకటరెడ్డి అరాచకాల గురించి నల్లగొండలో ఎవరినడిగినా చెప్తరు. ఆయన అనుచరులు ఏ రకంగా దందాలు చేస్తరో, ప్లాట్లను ఆక్రమిస్తరో వివరిస్తరు' అన్నారు.

కోమటిరెడ్డిని చూసి జానారెడ్డి, ఉత్తమ్ భయపడలేదా?

నిన్నటివరకు నల్లగొండకు రావడానికి జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ భయపడింది నిజంకాదా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. '20 ఏండ్లు మంత్రిగా పనిచేసిన జానారెడ్డి నల్లగొండ నియోజకవర్గంలో ఒక్క శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమమైనా చేశారా? ఉత్తమ్ మంత్రిగా నల్లగొండలో అడుగు పెట్టగలిగినవా? పీసీసీ చీఫ్‌గా నల్లగొండలో ప్రెస్‌మీట్ పెట్టగలిగినవా? ఎవరికి భయపడి రాలేదు? సమాధానం చెప్పాలి' అన్నారు. సీనియర్ నేతలనే భయపెట్టినవాళ్లు సాధారణ ప్రజలను, ఇతర పార్టీల కార్యకర్తలను ఏరకంగా భయపెట్టిస్తరో చెప్పక్కర్లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎన్ని శవరాజకీయాలు చేసినా, చిల్లర ఏరుకోవాలని చూసినా సాధ్యంకాదని స్పష్టంచేశారు. 'ప్రజలకు అన్నీ తెలుసు. వచ్చే ఎన్నికల్లో ఎవ్వరి బట్టలు విప్పాల్నో నిర్ణయించుకున్నరు. ఆ భయంతోనే కాంగ్రెస్ నాయకులు సభ పెట్టి నీచమైన, నికృష్టమైన మాటలు మాట్లాడారు. మనుషులు మాట్లాడుకోలేని మాటలు మాట్లాడుతున్నరు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, రమావత్ రవీంద్రకుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నోముల నర్సింహయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, రేఖల భద్రాద్రి తదితరులు పాల్గొన్నారు.

సొంత నేతలపైనే దాడులు

టీఆర్‌ఎస్‌కు, బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు ఎన్నడూ చిన్న ఘర్షణ కూడా జరుగలేదని జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఈ మధ్య టీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం వస్తే సంతోషం అనుకున్నామన్నారు. శ్రీనివాస్ ఉండి ఉంటే కొద్ది రోజుల్లో టీఆర్‌ఎస్‌లో చేరేవాడని, ఈ సంగతి ఎమ్మెల్యేకు చేరిందనే సమాచారం తమకు ఉందని తెలిపారు. కాంగ్రెస్‌లో ఎవరైనా ఎప్పుడైనా కోమటిరెడ్డి పెత్తనానికి ఎదురు తిరిగితే దాడులు చేయించిన సందర్భాలు చాలా ఉన్నాయని గుర్తుచేశారు. 'కోమటిరెడ్డి దశరథరెడ్డిపై హత్యాయత్నం ఎలాచేశారో అందరికీ తెలుసు. మాజీ ఎంపీ రఘుమారెడ్డిపై నెమ్మానిలో, ఇందిరాగాంధీకి దండవేయకుండా అడ్డుకుని జానారెడ్డిపై నల్లగొండలో, ప్రస్తుత పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్‌కే వెళ్లి ఆయన కార్యకర్తల మీద, సూర్యాపేటకు వెళ్లి దామోదర్‌రెడ్డితో ఘర్షణపెట్టుకున్నారు. పాలేరులో సీఎం హాజరైన కార్యక్రమంలోనే ఆధిపత్యం కొరకు కొట్టుకొని కేసులు పెట్టుకున్నారు. భువనగిరిలో తన్నుకున్న సందర్భాలున్నయి. వాళ్ల పార్టీ నాయకుణ్నే రాజగోపాల్‌రెడ్డి గాంధీభవన్‌లో కొట్టారు. ఆధిపత్య పోరులో కాంగ్రెస్ నేతలు హత్యలు చేసుకున్న పరిస్థితి ప్రజలు చూశారు. జిల్లాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని 20, 30 ఏండ్లుగా కమ్యూనిస్టులు, టీడీపీ సహా ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను హత్యలు చేయించిన రికార్డులు ఉన్నయి. అలాంటివాళ్లు వా టీఆర్‌ఎస్, కేసీఆర్ గురించి మాట్లాడటం సూర్యుడిపై ఉమ్మివేయడమే అవుతుంది' అని అన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రెండో ఏఎన్‌ఎంల మహాసభలో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో మంత్రి నాయిని, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరిస్తాం

- వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మా రెడ్డి

చిక్కడపల్లి: రెండో ఏఎన్‌ఎం వేతనాల పెంపు విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో టీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో ఏఎన్‌ఎం అసోసియేషన్ మొదటి మహాసభలో ఆయన పాల్గొన్నారు. రెండో ఏఎన్‌ఎంల సమస్యలు సీఎం దృష్టిలో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సీఎం తమను ఆదేశించారని చెప్పారు. హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ మహాసభకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, సంఘం అధ్యక్షురాలు అనురాధ తదితరులు హాజరయ్యారు.

9 నుంచి ముస్లిం పర్సనల్ లాబోర్డు జాతీయ సమావేశాలు

- ఏర్పాట్లను పరిశీలించిన మజ్లిస్‌ఎల్పీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల తొమ్మిది నుంచి మూడురోజులపాటు హైదరాబాద్‌లోని ఒవైసీ దవాఖాన మైదానంలో తలపెట్టిన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) జాతీయ కార్యవర్గ సమావేశాల కోసం చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన ఆహ్వాన కమిటీ ఏర్పాటైంది. మజ్లిస్ నేతలు, నగరంలోని ముస్లిం ప్రముఖులు ఈ సమావేశాల ఏర్పాట్లపై దృష్టి సారించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మందికిపైగా ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆయా రాష్ట్రాల ముస్లిం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఒలేమాలు, ముఫ్తీలు, మత ప్రముఖులు విచ్చేస్తున్నారు.

శ్రీకాంత్, సింధు సారథ్యంలో..

అలోర్ సెటార్(మలేసియా): బ్యాడ్మింటన్‌లో తీరికలేని షెడ్యూల్ కొనసాగుతూనే ఉన్నది. మంగళవారం నుంచి మలేసియా వేదికగా ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మొదలవుతున్నది. స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, హెచ్ ప్రణయ్ గైర్హాజరీలో శ్రీకాంత్, సింధు సారథ్యంలో భారత్ బరిలోకి దిగుతున్నది. ప్రతిష్ఠాత్మక థామస్, ఉబెర్ కప్‌లకు అర్హత టోర్నీ అయిన ఆసియా టోర్నీ పురుషుల విభాగంలో మాల్దీవులు, ఇండోనేసియాతో కలిసి భారత్ గ్రూపు-డిలో ఉన్నది. మరోవైపు మహిళల కేటగిరీలో జపాన్, హంకాంగ్‌తో కలిసి గ్రూపు-డబ్ల్యూలో భారత్ పోటీపడనుంది.



యువ హీరోలకు ఘనస్వాగతం

ముంబై: అండర్-19 ప్రపంచకప్ హీరోలకు స్వదేశంలో ఘనస్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం 3.30గంటలకు ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న యువసేనకు ముంబై క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలుకగా..అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని కేరింతలు కొట్టారు. బీసీసీఐ అఫీసియల్స్ కెప్టెన్ పృథ్వీషాను పూలమాలలతో సత్కరించారు. కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు మిగిలిన ఆటగాళ్లకూ బ్రహ్మరథం పట్టారు.

మేము సైతం..

దక్షిణాఫ్రికాపై మిథాలీసేన ఘన విజయం

రాణించిన స్మృతి మందన ■ గోస్వామికి 4 వికెట్లు

ప్రపంచకప్ జరిగిన ఏడు నెలల తర్వాత మిథాలీసేన ఆడిన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లోనే దుమ్మురేపింది. దక్షిణాఫ్రికా గడ్డపై విరాట్ సేన అందించిన స్ఫూర్తితో చెలరేగి ఆడింది. టీమ్ఇండియా సత్తాచాటిన చోట మేము సైతం అంటూ మహిళా క్రికెట్ జట్టు సత్తా చాటింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆతిథ్య జట్టుపై పూర్తి ఆధిపత్యం కనబరిచి సఫారీ మహిళా జట్టును చిత్తు చేసింది.దీంతో 3మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచి ఈ సీజన్‌ను ఘనంగా మొదలుపెట్టింది.

కింబర్లీ:

దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌లో ఇరుగదీస్తున్న టీమ్ఇండియాను చూసి భారత మహిళా క్రికెట్ జట్టులోనూ ఆత్మస్థైర్యం నిండింది. విరాట్ సేన స్ఫూర్తితో భారత మహిళా క్రికెట్ జట్టు చెలరేగి ఆడి దక్షిణాఫ్రికా మహిళా జట్టును ఓడించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, స్మృతి మందన (98 బంతుల్లో 84; ఫోర్లు 8, ఒక సిక్సర్) తడాఖా చూపగా, మిథాలీ ఆకట్టుకుంది.



జులన్ గోస్వామి (4/24)

బౌలర్లు జులన్ గోస్వామి, శిఖాపాండే అంతకు మించి దుమ్మురేపడంతో భారత్ 88 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్ విధించిన 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైన దక్షిణాఫ్రికా 43.2 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ వాన్ నీకెర్క్ (41) ఒంటరి పోరాటం చేసినా లాభం లేకపోయింది. వోల్‌వర్త్ (21), కాప్ (23) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో గోస్వామికి 4, శిఖా పాండేకు 3, పూనమ్‌యాదవ్‌కు 2 వికెట్లు దక్కాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మిథాలీ సేన 1-0 ఆధిక్యం సాధించింది.

అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మిథాలీ సేన 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఓపెనర్ రౌత్ (19) త్వరగానే అవుటైనా..మరో ఓపెనర్ మందన దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలోనే 64 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. మందనకు వన్డేల్లో ఇది ఏడో హాఫ్ సెంచరీ, కాగా దక్షిణాఫ్రికాపై మొదటిది. మరో ఎండ్‌లో కెప్టెన్ మిథాలీ (45) సహకారం అందించింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ గౌరవ ప్రదమైన స్కోరు సాధించగలిగింది. , కౌర్ (16), సుష్మ (16) ఫరవాలేదనిపించారు.

సంక్షిప్త స్కోర్లు:

భారత మహిళా జట్టు: 214/7, (మందన 84, మిథాలీ 45)

దక్షిణాఫ్రికా మహిళా జట్టు: 162 ఆలౌట్ (వాన్ నీకెర్క్ 45,)



స్మృతి మందన (84)

తీరుమారని బీసీసీఐ

ప్రపంచంలోనే అత్యధిక ధనార్జన కలిగిన బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) తమ అధికారిక వెబ్‌సైట్‌ను రెన్యువల్ చేసుకోవడంలో చూపిన నిర్లక్ష్యమే..మహిళా క్రికెట్ మ్యాచ్ విషయంలోనూ చూపెట్టింది. ఒకవైపు దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డ్ తమ అధికారిక ట్విట్టర్‌లో మహిళా క్రికెట్ మ్యాచ్ అప్‌డేట్స్‌ను ఫొటోలతో సహా అందిస్తే..బీసీసీఐ మాత్రం ట్విట్టర్‌లో కేవలం సమాచారం అందించి చేతులు దులిపేసుకుంది. దీంతో ఈ మ్యాచ్ ఫొటోల కోసం నెటిజన్లు దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ట్విట్టర్‌నే నమ్ముకోవాల్సి వచ్చింది.

లోధా కమిటీ సిఫారసులను అమలు చేయడం లేదు...

■ హెచ్‌సీఏపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లోధా కమిటీ సిఫారసులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని సోమవారం ఉమ్మడి హైకోర్టు పేర్కొంది. హెచ్‌సీఏలో లోధా కమిటీ సిఫార్సుల అమలు జరుగుతున్న తీరుపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అనిల్ రమేశ్ దవే, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీతాపతిలతో కూడిన పరిపాలన కమిటీ (అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ) సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. లోధా కమిటీ సిఫార్సుల అమలుకు బీసీసీఐ సహకారం తీసుకోవాలని సూచించింది. కమిటీ సమర్పించిన నివేదికను ఈ మేరకు కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకు , ప్రతివాదులకు అందచేయాలని స్పష్టం చేసింది. ఈ నివేదికలను పూర్తిస్థాయిగా పరిశీలించిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

క్రికెట్‌కు బొలింజర్ గుడ్ బై



సిడ్నీ: ఆస్ట్రేలియా పేస్ బౌలర్ డగి బొలింజర్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. 36 ఏండ్ల ఈ లెఫ్టార్మ్ పేసర్ 12 టెస్ట్ మ్యాచ్‌ల్లో 50 వికెట్లు, 39 వన్డేల్లో 62 వికెట్లు పడగొట్టాడు. 124 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 411 వికెట్లు తీసిన బొలింజర్, ఈ సీజన్ బిగ్‌బాష్‌లీగ్‌లోనూ ఆడాడు. 2009, 2010లో ఆస్ట్రేలియా తరపున టెస్ట్ మ్యాచ్‌లకు ప్రాతినిథ్యం వహించగా, ఆ తర్వాత జట్టులోకి ఎంపిక కాలేకపోయాడు. దీంతో తాను అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించాడు.

మానవ్‌కు రజతం

■ ప్రపంచ జూనియర్ సర్క్యూట్ ఫైనల్స్

న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ ఆటగాడు మానవ్ తక్కర్ ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజతం గెలుచుకున్నాడు.లగ్జెంబర్గ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మానవ్ 3-4 (11-9,3-11, 11-9, 6-11, 3-11, 11-9, 6-11)తో కనక్ ఝా (అమెరికా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. కనక్ మెయిన్ డ్రాకు అర్హత సాధించకపోయినప్పటికీ.. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచి గేమ్స్ ప్రాతిపదకన ఫైనల్‌కు చేరుకున్నాడు. అంతకు ముంద జరిగిన సెమీఫైనల్లో మానవ్ 11-8, 11-8, 11-5, 11-8తో అబ్దెల్ అజీజ్ (ఈజిప్ట్)పై గెలిచి ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే.

అక్షత్, సిరాజ్ విజృంభణ

■ సర్వీసెస్‌పై హైదరాబాద్ ఘనవిజయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విజయ్ హజారే టోర్నీలో హైదరాబాద్ అదిరిపోయే బోణీ కొట్టింది. సోమవారం సర్వీసెస్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో హైదరాబాద్ 128 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 330 పరుగుల లక్ష్యఛేదనలో సిరాజ్(5/45) ధాటికి సర్వీసెస్ 40.4 ఓవర్లలో 201 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ రాహుల్ (64) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. తొలుత కెప్టెన్ అక్షత్‌రెడ్డి (127) సెంచరీతో హైదరాబాద్ నిర్ణీత 50 ఓవర్లలో 329/5 స్కోరు చేసింది. రాజ్(2/57) రెండు వికెట్లు తీశాడు.

'4 వారాల్లో సమాధానం ఇవ్వండి'

న్యూఢిల్లీ: బీసీసీఐకి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తనపై జీవితకాల నిషేధాన్ని సవాల్ చేస్తూ క్రికెటర్ శ్రీశాంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారణకు స్వీకరించింది. దీపక్ మిశ్రా, ఖన్విల్కర్, చంద్రచూడ్‌తో కూడిన బెంచ్ శ్రీశాంత్ నిషేధంపై వివరణ కోరుతూ బీసీసీఐతో పాటు క్రికెట్ పాలక మండలి కమిటీలోని ఇద్దరు ఆఫీస్ బేరర్లకు నాలుగు వారాల గడువు విధించింది. అయితే కేరళ క్రికెటర్‌కు మధ్యంతర ఉపశమనం కలిగించాలంటూ అతని తరపు న్యాయవాది ధర్మాసనాన్ని కోరగా తిరస్కరించింది.

ఫైనల్లో మెదక్ మాస్టర్స్, టీకేఆర్ టైటాన్స్

■ ఆల్‌స్టార్ క్రికెట్ ప్రీమియర్ లీగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్‌స్టార్ తెలంగాణ రాష్ట్ర ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరింది. మంగళవారం జరిగే ఫైనల్లో మెదక్ మాస్టర్స్ జట్టుతో..టీకేఆర్ టైటాన్స్ తలపడనున్నాయి. సోమవారం జరిగిన తొలి సెమీస్‌లో ఇందూర్ ఐకాన్స్‌పై మెదక్ గెలిచింది. తొలుత ఇందూర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 137 పరుగులు చేయగా..మెదక్ 18.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 138 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఆదిలాబాద్ ఆరోస్ జట్టుపై ..టీకేఆర్ టైటాన్స్ గెలిచింది.

'డీ' గ్యాంగ్‌కు ఏమైంది?

గాయాల బారిన డివిలీయర్స్, డుప్లెసిస్, డికాక్ • తీవ్ర ఒత్తిడిలో దక్షిణాఫ్రికా

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం



డివిలీయర్స్ డికాక్ డుప్లెసిస్

ఒక్కరో, ఇద్దరు అనుకుంటే ఏమో అనుకోవచ్చు. కానీ దక్షిణాఫ్రికాకు ఆయువుపట్టుగా భావించే ఆ ముగ్గురు దూరమయ్యారు. గాయాలు వారి పాలిట శత్రువుగా మారాయి. ప్రత్యర్థి ఎవరైనా, వేదిక ఏదైనా జట్టుకు అద్భుత విజయాలు అందించడంలో వారికి వారే సాటి. 'డీ'గ్యాంగ్‌గా ముద్రపడ్డ డివిలీయర్స్, డుప్లెసిస్, డికాక్ గాయాల బారిన పడటం జట్టును తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేసింది. భారత్‌తో ఆఖరి టెస్ట్‌లో గాయపడ్డ డాషింగ్ బ్యాట్స్‌మన్ డివిలీయర్స్ మొదటి మూడు వన్డేలకు దూరమయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ డుప్లెసిస్ తొలి వన్డేలో చేతివేలుకు గాయమై వన్డే, టీ20 సిరీస్‌లకు అందుబాటులో లేకుండా పోయాడు. తాజాగా వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ వంతు వచ్చింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో డికాక్ మణికట్టుకు గాయమైంది. పూర్తిగా కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశముంది. దీంతో మిగిలిన వన్డేలతో పాటు టీ20 సిరీస్‌కు అతను అందుబాటులో లేకుండాపోయాడు. మార్చి 1న ఆస్ట్రేలియాతో మొదలయ్యే నాలుగు టెస్టుల సిరీస్ వరకైనా అతను కోలుకుంటాడా లేదా అన్నది సందేహంగా మారింది. డికాక్‌కు బదులుగా స్పెషలిస్టు వికెట్‌కీపర్‌గా జట్టుకు ఎంపికైన హెన్రిచ్ క్లాసెన్ మూడో వన్డేలో అరంగేట్రం చేసే అవకాశముంది. డికాక్ దూరం కావడంతో ఆమ్లాతో కలిసి ఓపెనింగ్‌కు ఎవరు దిగుతారనే దానిపై సందిగ్ధత ఏర్పడింది. డివిలీయర్స్, డుప్లెసిస్, డికాక్ గైర్హాజరీలో దక్షిణాఫ్రికాకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. 2009 తర్వాత డివిలీయర్స్, డుప్లెసిస్ లేకుండా సఫారీలు బరిలోకి దిగడం ఇదే తొలిసారి. ఆరు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే రెండు వన్డేలు చేజార్చుకున్న సఫారీలు టీమ్ఇండియాకు దీటైన పోటీనివ్వడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. సిరీస్‌కు ముందు మేటి జట్లను మట్టికరిపిస్తూ వరుసగా 17 విజయాలతో జోరు మీద కనిపించిన దక్షిణాఫ్రికాకు భారత్ డర్బన్‌లో కళ్లెం వేసింది. సమిష్టి ఆటతీరుతో సఫారీల విజయ పరంపరను అడ్డుకున్నది.

నాలుగో వన్డేకు డివిలీయర్స్!

చేతి వేలు గాయానికి గురైన డివిలీయర్స్ శనివారం జరిగే నాలుగో వన్డేలో ఆడే అవకాశం కనిపిస్తున్నది. అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సిన అవసరముంది. గాయం నుంచి కోలుకుని తుదిజట్టులోకొచ్చినా..ఏ మేరకు రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రయోగాలకు వేళైందా?

2019 ప్రపంచకప్ కోసం వేర్వేరు కాంబినేషన్లతో ప్రయోగాలు చేస్తాం. భారత్‌తో సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికా సెలెక్షన్ కన్వీనర్ లిండా జోండి అన్న మాట ఇది. కానీ ప్రస్తుత జట్టు పరిస్థితి చూస్తే ప్రయోగాలకు సమయం ఆసన్నమైనట్లు కనిపిస్తున్నది. ఎందుకంటే..ఓవైపు కీలక ఆటగాళ్లు డివిలీయర్స్, డుప్లెసిస్, డికాక్ గాయాలతో జట్టుకు దూరమయ్యారు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని మార్చేసే సత్తా ఉన్న ఈ ఆటగాళ్లను భర్తీ చేయాల్సిన అవసరం ఇప్పుడు వచ్చింది. కెప్టెన్ డుప్లెసిస్, ఓపెనర్ డికాక్ పూర్తిగా కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశమున్న నేపథ్యంలో దేశవాళీలో రాణిస్తున్న యువ క్రికెటర్లకు అవకాశమిచ్చి చూడాల్సిన అవసరం సెలెక్టర్లపై ఉన్నది. డుప్లెసిస్ గైర్హాజరీలో మూడు వన్డేలు ఆడిన అనుభవమున్న మర్క్రామ్‌ను కెప్టెన్‌గా చేయడం క్రికెట్ దక్షిణాఫ్రికా(సీఎస్ఏ) భవిష్యత్ ఆలోచనలకు అద్దం పడుతున్నది. మరోవైపు గాయంతో తొలి మూడు వన్డేలకు దూరమైన డివిలీయర్స్..గోల్ఫ్ కోర్టులో ఆడటం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. సిరీస్‌లో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మూడో వన్డేలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.